# ఉపోద్ఘాతము

పరిశుద్ధ బైబిలు గ్రంథములో రెండు భాగాలున్నాయి. మొదటి భాగాన్ని ప్రాచీన నిబంధన లేక పాత నిబంధన అనీ, రెండవ భాగాన్ని నూతన నిబంధన లేక క్రొత్త నిబంధన అని పిలుస్తారు. పరిశుద్ధ గ్రంథంలోని మొత్తము 66 ఉపగ్రంథాలలో ప్రాచీన నిబంధనలో 39, నూతన నిబంధనలో 27 పుస్తకాలున్నాయి. నిబంధన అనగా ఒక ఒడంబడిక లేక ఏర్పాటు అని అర్థము. యేసు క్రీస్తుకు ముందు రచింపబడ్డ గ్రంథాలు ప్రాచీన నిబంధన గాను, క్రీస్తు తరువాత వ్రాయబడ్డ గ్రంథాలు నూతన నిబంధన గాను రూపొందాయి.

ప్రాచీన నిబంధనలో ప్రభువైన యేసు క్రీస్తు యొక్క ఛాయలను మాత్రమే మనము చూడగలము. కాని నూతన నిబంధనలో ఆ ఛాయల నిజస్వరూపమైన యేసు క్రీస్తు ప్రభువును చూడగలము.

ఒక ఛాయ ఏర్పడుటకు గాను ఒక వస్తువు మరియు వెలుగు అవసరమై యున్నాయి. ఏదైన ఒక వస్తువుపై వెలుగు పడ్డప్పుడు, ఆ వస్తువు యొక్క ఛాయ ఏర్పడుతుంది. ఆ ఛాయను వెంబడించిన పక్షాన దాని నిజ స్వరూపమైన వస్తువును చేరగలము. కాని ఛాయలో వస్తువు యొక్క నిజ స్వరూపము కాన రాదు. ఛాయకు వస్తువునకు రూపములో ఎంతో తేడా వుంటుంది. అలాగే పరలోకములో యేసుక్రీస్తు ఉండేవాడు. ఆ ప్రభువుపై దైవిక ప్రత్యక్షతా వెలుగు (The light of the revelation of God) పడ్డప్పుడు క్రింద భూమిపై అనేక ఛాయలు యేర్పడ్డాయి. ఉదాహరణకు – పరిశుద్ధ గ్రంథమందలి నిర్గమకాండము 25వ అధ్యాయములో కనిపించు ప్రత్యక్షపు గుడారము, ఒక ఛాయ మాత్రమే. దాని నిజస్వరూపము యేసు ప్రభువే. అలాగే లేవీయ కాండములోని మొదటి ఏడు అధ్యాయములలో వివరించబడిన బలులు, అర్పణలు – అనగా

1. దహన బలి.
2. సమాధాన బలి.
3. పాప పరిహారార్థ బలి.
4. అపరాధ పరిహారార్థ బలి.
5. నైవేద్యములు.



ఛాయలు మాత్రమే. వాటి నిజస్వరూపము యేసు ప్రభువులోనే చూడగలము. అంతేకాదు. లేవీయ కాండము 23వ అధ్యాయములో ఇశ్రాయేలీయులు ఆచరించిన ఏడు పండుగలు :

1. పస్కా పండుగ.
2. పులియని రొట్టెల పండుగ.
3. ప్రథమ ఫలముల పండుగ.
4. పెంతెకోస్తు పండుగ.
5. శృంగధ్వనుల పండుగ.
6. ప్రాయశ్చిత్తార్థ పండుగ.
7. పర్ణశాలల పండుగ.

యేసు ప్రభుని ఛాయలే. అలాగే యెహోషువా గ్రంథము 20వ అధ్యాయములో వ్రాయబడిన ఆరు ఆశ్రయపురములు :

1. కెదెషు
2. షెకెము
3. హెబ్రోను
4. బేసెరు
5. రామోతు
6. గోలాను

అనునవి కూడ ఛాయలు మాత్రమే. వాటి నిజ స్వరూపమును యేసు ప్రభువులోనే చూడగలము. ప్రాచీన నిబంధనలో కనిపించు ఛాయలన్నింటికి మూలాధారమైన వాడు యేసు ప్రభువే. ఆ కారణాన, "ఇవి రాబోవు వాటి ఛాయయేగాని నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది" (కొలస్స 2:17) అని వ్రాయబడివుంది.

సూర్యోదయ సమయాన మన ఛాయలు చాలా దీర్ఘముగా ఉంటాయి. కాని రాను రాను ఆ ఛాయలు కురచవుతూ, మిట్ట మధ్యాహ్నము అనగా పండ్రెండు గంటలకు, సూర్యుడు మన తలలపై ప్రకాశించు సమయాన అవి అదృశ్యమౌతాయి. అప్పుడు ఆ ఛాయల నిజస్వరూపమైన మనమే కనిపిస్తాము. అలాగే సూర్యోదయ సమయాన అనగా యేసు ప్రభువు పరలోకములో

ప్రకాశించినప్పుడు ఆయన ఛాయలు భూమిపై చాలా దీర్ఘముగా కనిపించాయి. వాటిని చూచిన వారు అవి యేసు ప్రభుని ఛాయలని అప్పటికి సంపూర్ణముగా గ్రహించినవారుకారు. పండ్రెండు గంటల మిట్ట మధ్యాహ్నము, అనగా కాలము సంపూర్ణమైనప్పుడు,(గలతీ 4:4) ఆ ఛాయల నిజస్వరూపమైన ఆ యేసు ప్రభువే నరుడుగా ఈ లోకములో అవతరించాడు.

పరిశుద్ధ గ్రంథమందలి యేసు ప్రభుని ఛాయలను వెంబడించి, వాటిని గ్రహించుట ద్వారా, ఆ ప్రియ ప్రభువు ఎంత పరిశుద్ధుడో, ఎంత కరుణా సంపన్నుడో, ఎంత సుందరుడో, ఎంత విజ్ఞాన సంపన్నుడో, ఎంత శక్తి మంతుడో, ఎంత విలువైన వాడో మనము గ్రహించగలము.

యెహూషువ గ్రంథము 20వ అధ్యాయములో కనిపించు యేసు ప్రభువు యొక్క ఛాయలైన ఆశ్రయపురములను గురించి యిప్పుడు తెలుసుకుందాము.

# యెహోషువ 20వ అధ్యాయము

1. మరియు యెహోవా యెహోషువకు సెలవిచ్చిన

2. దేమనగా – నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము –

3. తెలియకయే పొరబాటున ఒకని చంపిన నరహంతకుడు పారిపోవుటకు నేను మోషేనోట మీతో పలికించిన ఆశ్రయపురములను మీరు ఏర్పరచు కొనవలెను. హత్య విషయమై ప్రతిహత్య చేయువాడు రాకపోవునట్లు అవి మీకు ఆశ్రయపురము లగును.

4. ఒకడు ఆ పురములలో ఒకదానికి పారిపోయి ఆ పుర ద్వారము నొద్ద నిలిచి, ఆ పురము యొక్క పెద్దలు వినునట్లు తన సంగతి చెప్పిన తరువాత, వారు పురములోనికి వానిని చేర్చుకొని తమ యొద్ద నివసించుటకు వానికి స్థల మియ్యవలెను.

5. హత్య విషయములో ప్రతి హత్య చేయువాడు వానిని తరిమిన యెడల వాని చేతికి ఆ నరహంతకుని అప్పగింపకూడదు. ఏలయనగా అతడు



పొరబాటున తన పొరుగు వాని చంపెను. గాని అంతకు మునుపు వాని యందు పగపట్టలేదు.

6. అతడు తీర్పు నొందుటకై సమాజము నెదుట నిలుచు వరకును, తరువాత ఆ దినములలోనున్న యాజకుడు మరణము నొందు వరకును, ఆ పురములోనే నివసింపవలెను. తరువాత ఆ నరహంతకుడు ఏ పట్టణము నుండి పారిపోయెనో ఆ పట్టణమునకును తన యింటికిని తిరిగి రావలెను. అప్పుడువారు

7. నఫ్తాలీయుల మన్యములోని గలిలయలో కెదెషును, ఎఫ్రాయిమీయుల మన్యమందలి షెకెమును, యూదా వంశస్థుల మన్యమందలి హెబ్రోనను కిర్యతర్బాను ప్రతిష్ఠ పరచిరి.

8. తూర్పుదిక్కున యొర్దాను అద్దరిని యెరికోనొద్ద రూబేనీయుల గోత్రములో నుండి మైదానము మీదనున్న అరణ్యములోని బేసెరును, గాదీయుల గోత్రములో నుండి గిలాదు లోని రామోతును, మనిష్షీయుల గోత్రములో నుండి బాషానులోని గోలానును నియమించిరి.

9. పొరబాటున ఒకని చంపిన వాడు సమాజము ఎదుట నిలువక మునుపు అక్కడికి పారిపోయి హత్య విషయమై ప్రతిహత్య చేయువాని చేత చంపబడక యుండునట్టు, ఇశ్రాయేలీయుల కందరికిని, వారిమధ్య నివసించు పరదేశులకును నియమింపబడిన పురములు ఇవి.

## మొదటి అధ్యాయము

## ఆశ్రయపురముల ప్రాముఖ్యత

ఇశ్రాయేలీయులు నలువది సంవత్సరాల సుదీర్ఘమైన అరణ్య యాత్రను ముగించి, వాగ్దాన దేశమైన కానానులో ప్రవేశించు సందర్భాన వారిలో అపరాధులు తీర్పు వరకు ఉండుటకు గాను ఆశ్రయముగా ఆరు పట్టణములను ఏర్పరచు కొనుమని కృపాసత్య సంపూర్ణుడైన దేవుడు, ఇశ్రాయేలీయుల నాయకుడైన

మోషేకు సెలవిచ్చాడు. ఈ చరిత్ర సంఖ్యా కాండము 35వ అధ్యాయము మరియు ద్వితీయోపదేశకాండము 19వ అధ్యాయము మరియు యెహోషువ గ్రంథం 20వ అధ్యాయములో వివరించబడివుంది. ఈ ఆశ్రయపురములు దైవజనుడైన మోషే కాలములో ఏర్పరచబడలేదు కాని మోషే తదనంతరము ఇశ్రాయేలీయులకు నాయకుడైన యెహోషువ కాలములో అవి ఏర్పరచబడినవి.

## 1. నరహంతకుడు :

ఇశ్రాయేలీయులలో ఎవరైన తెలియక పొరబాటున ఒకని చంపిన యెడల, ప్రతి హత్య చేయువాడు, ఆ హంతకుని చంపకుండునట్లు, హంతకుడు పరుగెత్తుకొని పోయి, ఆరు ఆశ్రయపురములలో దేనిలోనైన ప్రవేశించినట్లయితే, అట్టి వానికి ప్రతి హత్య జరుగకూడదని, కృపాసత్య సంపూర్ణుడైన దేవుడు నిర్ణయించాడు. తెలియక చంపినవాడు ఈ ప్రపంచములోని పాపాత్ముల నందరిని సూచిస్తున్నాడు.

కల్వరి సిలువకు యేసుప్రభువు మేకులతో బిగించబడినప్పుడు "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించుము" (లూకా 23:34) అని ప్రార్థించాడు. తప్పిపోయిన కుమారుని కథలో "అయితే బుద్ధివచ్చినప్పుడు వాడు తండ్రి యొద్దకు వచ్చెను" (లూకా 15 : 17 - 19) అని వ్రాయబడిన ప్రకారము, వాడు బుద్ధిలేకనే, అనగా యేసు ప్రభువు సిలువ మీద పల్కినట్లు, వాడు ఎరుగకయే తండ్రికి దూరమయ్యాడు అని తెలుస్తుంది. ప్రభువైన యేసు క్రీస్తు యొక్క సిలువ మరణాన్ని గురించి ప్రస్తావిస్తూ, అపొస్తలుడైన పేతురు యెరూషలేము దేవలయాలు, "ఇశ్రాయేలీయులారా! మీరు జీవాధిపతిని చంపితిరి గాని దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను, అందుకు మేము సాక్షులము ....... సహోదరులారా, మీరును మీ అధికారులును తెలియక చేసితిరని నాకు తెలియును". (అపొ.కా.3 : 12 - 17) అని ప్రకటించాడు. క్రీస్తు యేసు విశ్వాసులను నిర్దాక్షిణ్యంగా హింసించిన తార్సువాడైన సౌలు, "నేను తెలియక అవిశ్వాసమువలన ఈ పని చేసితిని గనుక కనికరింపబడితిని" (1తిమోతి 1 : 13) అని సాక్ష్యమిచ్చాడు.

మానవమాత్రులమైన మనము పాపము చేసినపుడెల్లా "వానిని చంపుము, ప్రతిహత్య చేయుము" అని దేవుని ధర్మ శాస్త్రము వాదిస్తుంది. కాని దేవుని కృ



ప యైతే, "తెలియక కదా! కాబట్టి వానిని రక్షించుము". అని ప్రాధేయపడుతుంది. అనగా దేవుని కృపచేతనే మానవుడు రక్షించబడుచున్నాడు. "దుర్మార్గుడు నశించుట నాకిష్టము లేదు. పాపి ఏవిధంగానైనా రక్షించబడి, విమోచింపబడి, నీతిమంతుడుగా తీర్చబడి, కుమారత్వమును, చివరిగా దేవుని మహిమ స్వరూపమును పొందాలి" అని పాపి నిమిత్తము ప్రాధేయపడునదే దేవుని కృప. పాపాంధకారములో భయంకరమైన తుఫాను చేత పట్టబడి, కొట్టబడి, గాయపరచబడి, ఆశ్రయములేక బాధించబడుచున్న పాపుల యెదుట ప్రకాశించి, అభయమిచ్చి, ఆశ్రయమిచ్చి వానికి కావలసిన సకల సౌకర్యములను సమకూర్చునది దేవుని కృప.

ఒక నరహంతకుడు తన కలయందు–ఒక అరణ్యములో ఉండగా, హఠాత్తుగా భయంకరమైన తుఫాను లేచింది. అప్పుడు ఏమి చేయను తోచక అటు యిటు వాడు పరుగెత్తుటకు ప్రారంభించాడు. ఇంతలో వానికి ఒక భవనము కనిపించింది. దాని గుమ్మముపై, "పరిశుద్ధత" అని వ్రాసి వుంది. ఆ భవనములో ప్రవేశింపగోరి వాడు తలుపు తట్టగా, వెంటనే ఎవరోవచ్చి తలుపు తీశారు. "అయ్యా! ఈ తుఫాను బాధపడలేకున్నాను. ప్రాణాపాయములో ఉన్నాను. దయచేసి నాకీ భవనములో కొంత ఆశ్రయమివ్వండి" అని ప్రార్థించాడు. "ఇది పరిశుద్ధ భవనము, పరిశుద్ధులే యిందులో ప్రవేశించాలి. నీలాంటివారు దీనిలో ప్రవేశింపకూడదు" అని చెప్పి ఆ వ్యక్తి గట్టిగా తలుపు మూశాడు. అప్పుడు ఆ హంతకుడు తుఫాను చేత మరింత కొట్టబడుచు మరో భవనాన్ని చూచాడు. దాని గుమ్మము మీద "సత్యము" అని వ్రాయబడివుంది. దానిలోనైనా ఆశ్రయము దొరకుననుకొని తలుపు తట్టగా, ఎవరోవచ్చి తలుపు తీసి, "ఇది సత్యభవనము సత్యవంతులే గాని నీవంటి వారు దీనిలో ప్రవేశింపవీలులేదు", అని చెప్పి గభాలున తలుపు మూసివేశాడు. అప్పుడా హంతకుడు యేమి చేయను తోచక బాధపడుచుండగా వాడికి మరో భవనము కనిపించింది. దాని గుమ్మము మీద "నీతి" అని వ్రాయబడివుంది. దానిలోనైనా తలదాచుకొనగోరి తలుపు తట్టాడు. ఎవరో వచ్చి తలుపు తీసి, "ఇది నీతి భవనము. ఇది నీతిమంతులకే గాని నీవంటివారు దీనిలో ప్రవేశింపకూడదు," అని చెప్పి గట్టిగా తలుపు మూసివేశాడు. అప్పుడా హంతకుడు బహుగా నిరాశచెంది ఏమి చేయను తోచక తుఫాను వలన అటు,

యిటు కొట్టబడి గాయపరచబడి ప్రాణాపాయస్థితిలో వున్నప్పుడు వాడికి యింకో భవనము కనిపించింది. ఆ భవనములోనైనా ఆశ్రయము దొరకునేమో అని ఆశించి దానిని సమీపించాడు. దాని గుమ్మముపై "కృప" అని వ్రాయబడివుంది. వాడు అందులో ప్రవేశింపగోరి తలుపు తట్టాడు. వెంటనే ఎవరో తలుపు తీసి "అయ్యా ! లోపలికి రండి", అని ప్రేమతో పిలిచి, ఆ హంతకుని ఆ భవనములోనికి ఆహ్వానించాడు. అక్కడ వానికి ఆశ్రయము దొరికింది. అంతలో కల ముగిసింది. చూచారా! నీతి, పరిశుద్ధతలతో కూడిన సత్యము కాదు గాని, కనికరము, ప్రేమతో కూడిన దేవుని కృపయే పాపికి ఆశ్రయము. ఆ కారణాన ప్రభువైన యేసు క్రీస్తు కృపాసత్య సంపూర్ణుడుగా ఈ లోకమునకు వచ్చాడు. (యోహాను 1:14).

## 2. ప్రతి హత్య చేయువాడు :

తెలియక చంపిన వాడు, లేక నరహంతకుడు ఈ ప్రపంచములోని పాపాత్ముల నందరిని సూచిస్తున్నాడు. హత్య విషయములో ప్రతి హత్య చేయు వాడు నరహంతకుని పట్టుకొనుటకు తరిమినట్లుగా, పాపియొక్క పాపదోషము వానిని పట్టుకొనుటకు ఎల్లప్పుడు తరుము చుండును. ఆ కారణాన "మీ పాపము మిమ్మును పట్టుకొనును" (సంఖ్యా 32 : 23) అని హెచ్చరింపబడియున్నాము. కాబట్టి మన పాపదోషము మనలను తరిమి పట్టుకొనక ముందే, జగద్రక్షకుడైన యేసు ప్రభువును ఆశ్రయించుట మనకు క్షేమకరము.

**ఆదాము, హవ్వలు** – ఏదేను వనములో ఆనందమయ జీవిత మాధుర్యాన్ని అనుభవించుచున్న ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను ఉల్లంఘించి దేవునికి విరోధంగా పాపము చేశారు. తమ పాపాన్ని దాచుకోడానకి ప్రయత్నించారు. కాని వారి పాపము వారిని పట్టుకొన్నది. పాపమువల్ల దాపురించిన తమ దుస్థితిని తామే చూడలేకపోయారు. ఒకవేళ దేవుడు చూస్తాడేమోనని చెట్టు చాటున దాగుకొన్నారు. "ఆదామా! ఎక్కడున్నావు?" (ఆ.కా 3 : 9) అని దేవుడు ఆదామును అడిగాడు. అలా అడగడములో ఆదాము చేసిన పాపము దేవునికి తెలియక కాదు. పాపానికి చేజిక్కిన ఆదాము హవ్వలు ఎంత దుస్థితి పాలయ్యారో వారికి తెలియజేయడము కోసమే.

**కయీను** – భక్తి హీనుడైన కయీను, తన సహోదరుడైన హేబెలును రహస్యంగా



హత్య చేశాడు. ఆ సంగతి ఎవ్వరికీ తెలియదనుకున్నాడు. కాని సర్వజ్ఞుడైన దేవుడు, "నీవు చేసిన పని యేమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొరపెట్టుచున్నది." (ఆ.కా.4 : 10) అని కయీనును ప్రశ్నించాడు. మనము చేసే పాపము ఎవ్వరికి తెలియదని మనము అనుకోవడమే గాని ఆ సంగతి క్రమేపి అందరికి తెలుస్తుంది. ఒకవేళ అందరికి తెలియకపోయినా, సర్వమూ ఎరిగిన దేవునికి మాత్రము బాగా తెలుసు. కయీను పాపము కయీనును పట్టుకొన్నది.

**ఏశావు** – ఏశావు తిండికోసము తన జ్యేష్ఠత్వాన్ని అమ్ముకొని పాపము చేశాడు. (ఆ.కా.25 : 31–34). అనగా ఒకపూట కూటి కొరకు దైవ వారసత్వాన్ని అమ్ముకొని దేవునికి విరోధంగా పాపం చేశాడు. ఈ తిండి తిమ్మరి తన తండ్రి నుండి రావలసిన ఆశీర్వాదాలను పోగొట్టుకొన్నాడు. ఏశావు పాపము ఏశావును పట్టుకొన్నది. ఆ కారణాన, (హెబ్రీ 12 : 16, 17)లో, ఒకపూట కూటి కొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను, వ్యభిచారియైనను ఉండునేమో అనియు, జాగ్రత్యగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్లు విడుచుచు దాని కోసరము శ్రద్ధతో వెదకినను, మారు మనస్సు పొందనవకాశము దొరకక విసర్జింపబడెనని మీరెరుగుదురు". ఆని వ్రాయబడిన మాటలు ఎంత దుఃఖకరములు !

**యోసేపు సోదరులు** – యోసేపు సోదరులు యోసేపును ద్వేషించి, హింసించి ఇష్మాయేలీయులకు అమ్మివేశారు. సరికదా, యోసేపు అడవి మృగము ద్వారా చంపబడినట్లు పుకారు పుట్టించారు. కాని తగిన సమయములో వారి పాపము వారిని పట్టుకున్నది. యోసేపు ఐగుప్తురాజ్యమునకు రెండవ రాజయ్యాడు. యోసేపు సోదరులు వచ్చి యోసేపు కాళ్లపై బడ్డారు. "నిశ్చయముగా మన సహోదరుని యెడల మనము చేసిన అపరాధమునకు శిక్ష పొందుచున్నాము. అతడు మనతో బతిమాలుకొనినప్పుడు మనము అతని వేదన చూచియు వినకపోతిమి. అందువలన ఈ వేదన మనకు వచ్చెనని ఒకనితో ఒకడు మాటలాడుకొనిరి", అని (ఆ.కా. 42 : 21) లో వ్రాయబడిన ప్రకారము యోసేపు సోదరుల పాపదోషం, వారిని పట్టి వేధించింది.

**ఆకాను** – ఆకాను దేవుని ఆజ్ఞను ఉల్లంఘించి, శపించబడిన దానిలో కొంత తీసికొని, తన డేరా మధ్య, భూమిలో దానిని దాచిపెట్టాడు. పాపములో పుట్టు ప్రథమ లక్షణం – యితరుల కంట బడకుండా తమ పాపాన్ని దాచుకోవడానికి ప్రయత్నించడం, కాని లోకంలో ఏది కూడా పాపాన్ని దాచలేదు. “చెవులను కలుగజేసినవాడు వినకుండునా? కంటిని నిర్మించినవాడు కానకుండునా”? (దా.కీ. 94 :9) అని వ్రాయబడిన ప్రకారము, ఆకాను పాపమును దేవుడు చూశాడు. ఆ సంగతి ఇశ్రాయేలీయుల నాయకుడైన యెహోషువకు తెలియజేశాడు. ఆకాను పాప ఫలితం గా ఇశ్రాయేలీయులు తమ శత్రువుల యెదుట నిలువ లేక పోయారు. అప్పుడు యెహోషువ, “నీ వేల మమ్ము బాధపరచితివి? నేడు యెహోవా నిన్ను బాధపరచును.” అని ఆకానుతో చెప్పగా ఇశ్రాయేలీయులు ఆకానును రాళ్లతో చావగొట్టారు. (యెహోషువ 7 : 25). ఎంత దుఃఖకరము. ఆకాను చేరదీసిన పాపము ఆకానును పట్టుకొని నాశనం చేసింది.

**సమ్సోను** – బలాఢ్యుడైన సమ్సోను దెలీలా మాటలకు మోసపోయి, తన బలమును గూర్చిన రహస్యాన్ని ఆమెకు తెలియజేసి దేవునికి విరోధంగా పాపము చేశాడు. “నేను నా తల్లి గర్భము నుండి పుట్టినది మొదలుకొని దేవునికి నాజీరు చేయబడిన వాడనైయున్నాను. నాతల మీదకి మంగలి కత్తి రాలేదు. నాకు క్షౌరము చేసిన యెడల నా బలము నాలోనుండి తొలగిపోయి యితర మనుష్యుల వలె అవుదును” (న్యాయాధి 16 : 17) అని దెలీలాకు తెలియజేశాడు. దెలీలా తన తొడమీద సమ్సోనును నిద్ర బుచ్చి, సమ్సోను తల వెంట్రుకలను క్షౌరము చేయించింది. వెంటనే సమ్సోనులో నుండి దేవుని బలము వెళ్లిపోయింది. అప్పుడు ఫిలిష్తీయులు సమ్సోనును పట్టుకొని, అతని కన్నులను ఊడదీసి, యిత్తడి సంకెళ్లతో బంధించారు. ఇది ఎంత పరితాపకరము! సమ్సోను చేరతీసిన పాపము సమ్సోనును పట్టుకొని నాశనం చేసింది. (న్యాయా 16 : 17–21).

**ఆహాబు** – కొందరు యితరుల ప్రేరేపణవలన పాపము చేసి, లేక యితరులతో పాపము చేయించి తప్పించుకొనుటకు ప్రయత్నిస్తారు. రాజైన అహాబు యెజెబెలు మాటలు విని దేవునికి విరోధంగా పాపము చేశాడు. యెజ్రేయేలు వాడైన నాబోతు ద్రాక్షతోటను ఆశించి, తనకు కూరతోటకై దానిని యివ్వమని నాబోతును అడిగాడు. “నాపిత్రార్జితము నీకిచ్చుటకు నాకు ఎంత మాత్రమును వల్లపడదు.”



(1 రాజులు 21 : 3) అని నాబోతు రాజుకు జవాబిచ్చాడు. నాబోతును హతమార్చమని దుర్మార్గురాలైన యెజెబెలు ఆహాబును ప్రేరేపించింది. ఆ ప్రకారమే ఆహాబురాజు, భార్య మాటను విని, అమాయకుడైన నాబోతును రాళ్లతో చావకొట్టించి నాబోతు ద్రాక్ష తోటను ఆక్రమించుకున్నాడు. అది చూచిన దేవుడు, ప్రవక్తయైన ఏలీయాను అహాబు దగ్గరికి పంపాడు. “ఏ స్థలమందు కుక్కలు నాబోతు రక్తమును నాకెనో ఆ స్థలమందే కుక్కలు నీ రక్తమును నిజముగా నాకును.” (రాజులు 21 : 19) అని ఏలీయా అహాబుకు తెలియజేశాడు. ఆ ప్రకారమే అహాబు రక్తాన్ని కుక్కలు నాకాయి. (1 రాజులు 22 : 38) అహాబు పాప దోషము అహాబును విడువక తరిమి పట్టుకున్నది.

**ఇస్కరియోతు యూదా** – ఇస్కరియోతుయూదా ధనాపేక్ష అనే పిశాచితో రహస్య సంబంధం పెట్టుకొని, ముప్పది వెండి నాణెములకు తన ప్రభువును దుర్మార్గులకు అప్పగించాడు. ప్రభువును అమ్ముకొనేవాడెవ్వడూ ఆ రాబడితో కాపురము చెయ్యలేడు. యూదా చేర దీసిన పాపము యూదాను పట్టుకొన్నది. అది ఆత్మహత్యకు నడిపింది. (మత్తయి 27 : 45) అలాగే మనము చేరదీసే పాపము మనల్ని నాశనము చేసేవరకు అదికునుకదు నిద్రపోదు. “మీ పాపము మిమ్మును పట్టుకొనును.” (సంఖ్యా 32 : 23) కాబట్టి మన పాపదోషము మనలను తరిమి పట్టుకొనకముందే జగద్రక్షకుడైన యేసు ప్రభువును ఆశ్రయించుట మనకు క్షేమకరము.

**అననీయ, సప్పీరాలు** – అననీయ, సప్పీరాలు దేవార్పితమైన డబ్బును అపహరించి దేవునికి విరోధంగా పాపము చేశారు. వీరు యితరుల దృష్టిలో భక్తిపరులుగా కన్పించుటకు ప్రయాసపడినవారు. భార్యాభర్తలు కలసి తమపొలాన్ని అమ్మి, వచ్చిన డబ్బులో కొంత దాచుకొని, మిగిలిన డబ్బును అపొస్తలుల పాదముల యొద్ద పెట్టి, డబ్బంతా తెచ్చినట్లు అబద్ధము చెప్పారు. అననీయ పాపము అననీయను పట్టుకొన్నది. అపొస్తలుడైన పేతురు అననీయను చూచి, “అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? అది నీ యొద్దనున్నప్పుడు నీదే గదా? అమ్మిన పిమ్మట అది నీవశమై యుండలేదా? యెందుకు ఈ సంగతి నీ హృదయములో ఉద్దేశించుకొన్నావు? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే

అబద్ధమాడితివి" అని చెప్పగా అననీయ యీ మాటలు వింటూనే క్రిందపడి తన ప్రాణాన్ని కోల్పోయాడు. అప్పుడు యౌవనస్తులు కొందరు అననీయ మృత శరీరాన్ని మోసికొనివెళ్ళి పాతిపెట్టారు.

ఇది జరిగిన మూడు గంటలకు అననీయ భార్యయైన సప్పీరా జరిగిన సంగతి నెరుగక అపోస్తలులుండు యింటిలోనికి ప్రవేశించింది. అప్పుడు పేతురు, "మీరు ఆ భూమిని ఇంతకే అమ్మితిరా?" అని ఆమెను ప్రశ్నించాడు. అందుకామె, "ఔను ఇంతకే అమ్మితిమి," అని అబద్దము చెప్పింది. అందుకు పేతురు, "ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి? ఇదిగో నీ పెనిమిటిని పాతిపెట్టిన వారి పాదములు వాకిటనే యున్నవి. వారు నిన్నును మోసికొని పోవుదురు" అని చెప్పగానే, సప్పీరా పేతురు పాదముల యొద్ద పడి ప్రాణాన్ని విడిచింది. అననీయ సప్పీరాలు చేరదీసిన పాపము వారిని నాశనము చేయువరకు అది నిద్రపోలేదు. (అపొ.కా. 5 : 1-10)

ఒక పర్యాయం ఒక యౌవ్వనస్తురాలు తన గ్రామాన్ని విడచి మరో గ్రామానికి నడచి వెళ్తూ వుండగా, ఆమె మెడలోని బంగారు నగలను చూచిన హంతకుడొకడు ఆమెను వెంబడించాడు. అలా ఆమె చాలా దూరము వెళ్ళిన తరువాత బహు కుయుక్తితో వాడు ఆమెను సమీపించి, వెనుకనుండి హఠాత్తుగ తన కత్తితో ఆమె మెడను తెగవేశాడు. క్రింద పడిపోయిన ఆ స్త్రీ తల వెంటనే హంతకుని కాలి పిక్కను తన పళ్లతో గట్టిగా కరచి పట్టుకున్నది. హంతకుడు ఎంత ప్రయత్నించినా ఆ తల ఊడిరాక పోవటము చూచి, భయముతో సమీపములో వున్న నదిలోకి దిగి నిలబడ్డాడు. ఇంతలో పోలీసులు వచ్చి హంతకుని జాడ కన్పించకపోవటం చూచి, నీటిలో నిలబడ్డ వ్యక్తితో, "స్వామీ, ఈ దారిన ఎవరైనా వెళ్ళటము మీరు చూచారా?" అని ప్రశ్నించారు. "అబ్బె ! నాకేమీ తెలియదు. నన్ను తొందర పెట్టకండి, నేను యిప్పుడు దైవ ధ్యానములో ఉన్నాను." అని జవాబు చెప్పి, కళ్లు మూసుకొన్నాడు ఆ హంతకుడు. పోలీసులు అటు, యిటు వెళ్ళి కొంత తడవైన తరువాత తిరిగి అదే స్థలానికి వచ్చి, నీటిలో నిలబడ్డ వ్యక్తి యొక్క దైవధ్యానము యింకా ముగియకపోవడం చూచి, అనుమానముతొ ఆ వ్యక్తిని బయటికి లాక్కొనివచ్చి నిర్ఘాంతపొయ్యారు. చూస్తే యింకేముంది వాని కాలికి ఆ స్త్రీ తల అలాగే కరచుకొని వుంది. చూశారా, పాపమన్నది పాపిని



ఏలాగ పట్టిస్తుందొ, "మీ పాపము మిమ్మును పట్టుకొనును." అని వ్రాయబడిన మాటలు వాస్తవిక సత్యములు.

కొందరు తాము చేసిన చెడు కార్యములకు వెంటనే శిక్ష రాకపోవటం చూచి, ఏ మాత్రం భయపడకున్నారు. దుష్ క్రియలకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయపూర్వకముగా దుష్ క్రియలు చేయుదురు. (ప్రసంగి 8 :11) కొందరి పాపములు తేటగా బయలుపడి న్యాయపు తీర్పునకు ముందుగా నడచుచున్నవి. మరి కొందరి పాపములు వారి వెంట వెళ్ళుచున్నవి. (2తిమోతి 5 : 24) అని వ్రాయబడిన ప్రకారము దేవుడు నీ పాపములను బట్టి నిన్ను వెంటనే శిక్షించనంతమాత్రాన, నీపాపములు మరువబడినవని నీవు ఎంత మాత్రమును తలంచరాదు. అవి న్యాయతీర్పునకై నీ కంటే ముందుగా పరుగెడుతున్నాయని నీవు గ్రహించ వలసియున్నావు. నీవు దేవుని వాక్యము ప్రకారము ఒకనాటికి మరణించనై యున్నావు. (హెబ్రీ 9 : 27) మరణానంతరాన నీలోని ఆత్మదాని దయచేసిన దేవుని యొద్దకు వెళ్తుంది. అక్కడ పాపులందరికి తీర్పు జరుగుతుంది. ఈ పాప ప్రపంచములో నీతి న్యాయములతో కూడిన సరియైన తీర్పు సంపూర్ణముగా జరుగుట లేదు. న్యాయస్థానాలలో సహితము అన్యాయస్తులు న్యాయస్తులుగా నీతిమంతులు అవినీతి మంతులుగా తీర్చబడుట మనము చూస్తూనే వున్నాము. అనగా న్యాయస్థలముల యందు సహితము అంధత్వము, పక్షపాతము, అన్యాయములు జరుగుట కద్దు. కాని పరలోకములో దేవుని యెదుట, పక్షపాతమునకు గాని, అన్యాయమునకు గాని చోటు లేదు. అది నీతి న్యాయములతో కూడిన పరిశుద్ధ రాజ్యము. సర్వోన్నతుడైన దేవుడే వారివారి క్రియలను బట్టి అందరికి సరిగా న్యాయము తీర్చనైయున్నాడు. నీ రహస్య జీవితములో, ఎవరి కంటబడక చిట్ట చీకటిలో జరిగించిన అసహ్య కార్యములు సహితము బహిరంగ పరచబడి, న్యాయము తీర్చబడుతుంది. ఆ న్యాయ సింహాసనము ఎదుట ప్రతీ ఒక్కరు, ఏ జాతీయులైనా, ఏ దేశీయులైనా నిలువబడి తీరవలసి వుంది. తప్పించుకొనుటకు ఎంత మాత్రమును వీలులేదు. తీర్పు జరిగిన తరువాత, పాపులను బాధించు ఆ అగ్ని ఆరదు. ఆ అగ్నిలో అల్లలాడుపురుగు వంటి పాపులు చావరు. (ప్రకటన 21 :8) ఆ ఆరని అగ్నిలో తీరని బాధలో పాపులు తమ శిక్షను శాశ్వతంగా అనుభవించవలసినదే.

అటువంటి భయంకర తీర్పునుండియు, నిత్య నరకాగ్ని శిక్షనుండియు, ఈ లోకంలో వుండగనే మనము తప్పించుకొనుటకు ఆ కృపామయుడైన దేవుడు ఒక ఏర్పాటు చేసియున్నాడు. దానినే రక్షణ అని పరిశుద్ధ గ్రంథము చెబుతుంది. కావున మనము రక్షిండబడుటకుగాను జగద్రక్షకుడైన యేసు ప్రభువును ఆశ్రయించవలసి యున్నాము.

### 3. ఆశ్రయపురములు :

తెలియక చంపిన నరహంతకుడు ఈ ప్రపంచములోని పాపాత్ములందరిని సూచించినట్లు, ప్రతిహత్య చేయువాడు పాపియొక్క పాపదోషమును సూచించినట్లు, ఆశ్రయపురములు జగద్రక్షకుడైన యేసు ప్రభువును సూచిస్తున్నాయి.

"దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు." (దా.కీ.46 : 1) అని రాజైన దావీదు మనకు తెలియజేశాడు. తాను ఆశ్రయించిన దేవుని భద్రతను కాపుదలను అనుభవించిన తరువాత, "ఆయనే నాకు ఆశ్రయము. నాకోట నేను నమ్ముకొను నా దేవుడు." (దా.కీ 91:2) అని దావీదు సాక్ష్యమిచ్చాడు. ఆ ప్రభువును ప్రార్థించునపుడు, "యెహూవా, నీకే నేను మొఱ పెట్టుచున్నాను. నా ఆశ్రయ దుర్గము నీవే" (దా.కీ 142 : 5) అని ఆ భక్తుడు గానం చేసేవాడు.

ప్రవక్తయైన యెషయా, "యెహోవా, యెహోవాయే నిత్యాశ్రయ దుర్గము. యుగ యుగములు యెహోవాను నమ్ముకొనుడి." (యెషయా 26 : 4) అని లోకమునకు చాటించాడు.

దేవుని వాక్యమును ప్రవచించినందుకు, దుర్మార్గులైన ఇశ్రాయేలీయులు యిర్మీయా ప్రవక్తను చంపదలచి ఆయన వెంటబడి తరుముతూ వచ్చారు. అప్పుడు యిర్మీయా "ఆపత్కాల మందు నీవే నా ఆశ్రయము, నాకు అధైర్యము పుట్టింపకుము. నన్ను సిగ్గు పడనియ్యక, నన్ను తరుమువారిని సిగ్గుపడనిమ్ము." (యిర్మీయా 17 : 17) అని తన ఆశ్రయపురమైన దేవుని ప్రార్థించాడు.

అబీయా కుమారుడైన ఆసా రాజు దినములయందు దేవుడు పది సంవత్సరములు దేశములో నెమ్మదిని కలుగజేశాడు. ఆ కారణాన రాజైన ఆసా,



"దేవుడైన యెహోవాను మనము ఆశ్రయించితిమి. ఆశ్రయించి నందున ఆయన మన చుట్టును నెమ్మది కలుగజేసియున్నాడు." (2 దినవృత్తా 14 : 7) అని యూదా వారికి ప్రకటించాడు. అనగా రాజైన ఆసాకు ఆయన ప్రజలకు దేవుడే ఆశ్రయపురము.

యూదావారు తమ పితరుల దేవుడైన యెహోవాను ఆశ్రయించిన హేతువుచే, యూదావారికి, ఇశ్రాయేలీయులకు యుద్ధము సంభవించినప్పుడు, యూదావారు, ఇశ్రాయేలీయులపై ఘన విజయాన్ని సాధించినట్లు (2వ దినవృత్తాంతములు 14 : 18) లో వ్రాయబడివుంది. అనగా యూదా వారికి ఆశ్రయపురము జీవము గల దేవుడే.

"యెహోవాను ఆశ్రయించుడి అప్పుడు మీరు బ్రతుకుదురు." (ఆమోసు 5 : 6) అని ఆమోసు ప్రవక్త ప్రకటన చేశాడు. అనగా పాపి మరణించక బ్రతుకుటకు గాను ఏర్పరచబడిన ఆశ్రయపురము సృష్టికర్తయైన దేవుడే. ఆ దేవుడే యేసు క్రీస్తు అవతారములో, నరుడుగా జన్మించి, "నామాట విని నన్ను పంపిన వాని యందు విశ్వాసముంచువాడు నిత్యజీవముగల వాడు వాడు తీర్పులోనికిరాక మరణములో నుండి జీవము లోనికి దాటియున్నాడు." (యోహాను 5:24) అని సెలవిచ్చాడు. కాబట్టి "యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్య జీవము." "ఆయనను అంగీకరించువాడు జీవము లేనివాడు." (1 యోహాను 5 : 12). అనగా పాపికి ఆశ్రయుడు లేక ఆశ్రయపురము జగద్రక్షకుడైన యేసు ప్రభువేనని దీనివలన స్పష్టమౌతుంది.

### 4. ఆశ్రయపురముల యేర్పాటు :

"పొరబాటున ఒకని చంపినవాడు సమాజము ఎదుట నిలువక మునుపు అక్కడికి పారిపోయి హత్యవిషయమై ప్రతిహత్య చేయువాని చేత చంపబడక యుండునట్లు ఇశ్రాయేలీయులకందరికిని వారి మధ్య నివసించు పరదేశులకును నియమింపబడిన ప్రకారము నరహంతకుల కొరకై ఏర్పరచబడిన ఆశ్రయపురములు కృపాసత్య సంపూర్ణుడైన దేవునిచే నియమించబడ్డాయి. లేక నిర్ణయించబడ్డాయి. అలాగే ప్రభువైన యేసు క్రీస్తు పాపులకాశ్రయపురముగా లేక రక్షకునిగా నిర్ణయించబడి ఈ లోకమునకు పంపబడ్డాడు. ఆ కారణాన,

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా, ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతి వాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను 3 : 16) అని వ్రాయబడివుంది.

### 5. ఆశ్రయపురముల సంఖ్య :

ఆశ్రయపురముల సంఖ్య ఆరు. పరిశుద్ధ బైబిలు గ్రంథమందు అంకెలకు సంఖ్యలకు అర్థమున్నట్లు మనము గ్రహించవలసియున్నాము. ఉదాహరణకు–

**ఒకటి** అను అంకె దేవుడు ఒక్కడే అని తెలియజేస్తుంది. "దేవుడొక్కడే దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయనే క్రీస్తు యేసను నరుడు" (1 తిమోతి 2 : 5).

**రెండు** సహవాసము లేక జతను సూచిస్తుంది. ఆది మానవుడైన ఆదాము ఒంటరిగా నుండుట మంచిది కాదని సృష్టి కర్తయైన దేవుడు అతనికి సాటియైన సహాయముగా హవ్వను సృష్టించినట్లు ఆది కాండము (2 :18) లో వ్రాయబడి ఉంది. ప్రభువైన యేసుక్రీస్తు తన శిష్యులను సువార్త సేవ నిమిత్తము పంపినప్పుడు, వారిని యిద్దరిద్దరినిగా పంపినట్లు లూకా సువార్త 10 : 1లో చూడగలము.

**మూడు** త్రిత్వమును సూచిస్తుంది. త్రిత్వము ఒక రహస్యము. అయినా అది వాస్తవిక సత్యము. తండ్రియైన దేవుడు, కుమారుడైన యేసు క్రీస్తు పరిశుద్ధాత్మ కలసి త్రిత్వ మనబడుచున్నారు.

"దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదుము. (ఆ.కా 1 : 26) అని సెలవిచ్చాడు. అనగా మానవుని చేయుటకు గాను ముగ్గురు పురుషులు ఒక సభచేసి ఒక తీర్మానమునకు వచ్చియున్నారని అర్థము. మానవ చరిత్రలో, యితర తావులలో కూడ, త్రియేక దేవుని కార్యాన్ని మనము గుర్తించవచ్చు. బాబెలు గోపురము కట్టబడు సందర్భాన, ఈ త్రిత్వకార్యాన్ని మనము చూడగలము. "మనము దిగిపోయి, వారిలో ఒకనిమాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి భాషను తారుమారు చేయుదము రండి" (ఆ.కా 11 : 7) అని దేవుడు సెలవిచ్చాడు.



యొర్దాను నదిలో యేసు ప్రభువు, యోహానుచేత బాప్తిస్మము, పొందినప్పుడు, దేవుని త్రిత్వకార్యము స్పష్టంగా ప్రత్యక్షపరచబడింది. కుమారుడైన క్రీస్తు ప్రభువు నీటిలో నిలబడ్డాడు. పరిశుద్ధాత్మ ప్రభువు శరీరాకారములో పావురమువలె ఆయన మీదికి దిగి వచ్చాడు. తండ్రియైన దేవుడు ఆకాశమునుండి, "నీవు నా ప్రియ కుమారుడవు నీయందు నేనానందించుచున్నాను." అని పల్కెడు (లూకా 3 : 21, 22), ఈ సంఘటనలు దేవుని త్రిత్వ స్వభావాన్ని తెలియజేస్తున్నాయి.

"**నాలుగు** సార్వత్రికమును సూచిస్తుంది. అనగా తూర్పు, పడమర, ఉత్తరము, దక్షిణము అను నాలుగు దిక్కులను సూచిస్తుంది. ఏదేను తోటలోనుండి ఒక నది బయలుదేరి, అక్కడ నుండి చీలిపోయి నాలుగు శాఖలయినట్లు ఆదికాండము 2 : 10 లో వ్రాయబడినది. ఈ నాల్గు నదులు, నలు దిశలను సూచిస్తున్నాయి. మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలను కూడ నాల్గవ అంకె సూచిస్తుంది. ఈ నాల్గు సువార్తలు యేసు క్రీస్తు జగద్రక్షకుడు అని ప్రకటిస్తున్నాయి.

**ఐదు** దేవుని కృపను తెలియజేస్తుంది. సర్వజ్ఞుడైన దేవుడు, తన సృష్టి నిర్మాణములో ఐదవ దినమందు తన కార్యక్రమాన్ని భూమి మీదికి మార్చి, మహా రౌద్రముగ వున్న జలముల ఘోషను అరికట్టి ఆ జలముల నుండే జీవరాసులను సృజించాడు. (ఆ.కా. 1 : 20 – 23). ఇది దేవుని కృపా కార్యమును తెలియజేస్తుంది. "మీరు కృపచేతనే రక్షింపబడియున్నారు." అని ఎఫెసీ పత్రిక 2 : 8 9లో వ్రాయబడిన ప్రకారము రక్షణ అన్నది దేవుని కృపా కార్యమైవుంది. రక్షింపబడుట అనగా మరణములో నుండి జీవములోనికి దాటుట అని అర్థము.

**ఆరు** మానవుని సంఖ్య. ఆరవ దినమందు దేవుడు మానవుని సృజించినట్లు ఆదికాండము 1 : 26లో వ్రాయబడివుంది.

**ఏడు** పరిపూర్ణతను సూచిస్తుంది. సృష్టికర్తయైన దేవుడు తన సృష్టి కార్యక్రమాన్ని ఏడవ దినమందు సంపూర్తి చేశాడు. (ఆ.కా. 2 : 2). ఈ లోకములో ఆశ్రయపురములు జీవముగల దేవుడు మానవ రక్షణార్థమై, అనగా పాపులకు ఆశ్రయపురముగా కాగోరి తాను మానవ మాత్రుడయ్యాడు, అని తెలియజేస్తున్నాయి. ఏడవ ఆశ్రయపురము పరలోక యెరూషలేము లేక పరలోక

పట్టణము. యేసు ప్రభువును ఈ భూలోకములో ఆశ్రయపురముగా ఎరిగిన విశ్వాసులు, తమ దీన శరీరములు విమోచింపబడిన తరువాత, ఏడవ ఆశ్రయపురమైన ఆ నిత్య ఆశ్రయపురాన్ని చేరగలరు.

**6. ఆశ్రయపురముల స్థానములు :**

ఆరు ఆశ్రయపురములలో మూడు వాగ్దాన దేశమున, మూడు యొర్దాను అద్దరిని నిర్మింపబడవలెనని సర్వజ్ఞుడైన దేవుడే నిర్ణయించాడు. (సంఖ్యా 35 : 13, 14, యెహోషువ 20 : 7.8) ఆ ప్రకారమే అవి నిర్మించబడ్డాయి. అంతే కాదు, ఈ ఆరు ఆశ్రయపురములు కేవలము ఇశ్రాయేలీయులకు మాత్రమే గాక, పరదేశీయులకును, మరియు ఇశ్రాయేలీయులకు మధ్య నివసించువారికిని ఆశ్రయమైయుండవలెనని కృపామయుడైన దేవుడు నిర్ణయించాడు. యెహోషువ 20 : 9). అలాగే జగద్రక్షకుడైన యేసు క్రీస్తు యూదులకేమి, అన్యులకేమి ప్రతిపాపికి రక్షకుడై యున్నాడు. ఆ కారణాన "ఈ దొడ్డివి కాని వేరే గొర్రెలును నాకు కలవు. వాటిని కూడ నేను తోడుకొని రావలెను. అవి నా శబ్దము వినును. అప్పుడు మందయొక్కటియు గొర్రెల కాపరి యొక్కడును అగును." (యోహాను 10 : 16) అని ఆ ప్రభువు సెలవిచ్చాడు. యూదులను, అన్యులను, ప్రాగ్ దేశస్థులను, పాశ్చాత్య దేశస్తులను, ధనికులను, దరిద్రులను, విద్యావంతులను, విద్యా విహీనులను, అధమాధముడైన మానవుని మహిమోన్నతుడైన దేవుని, ఏకము చేసిన ఆశ్రయపురము యేసు క్రీస్తే.

**7. ఆశ్రయపురముల దూరము :**

హత్యవిషయమై ప్రతిహత్య చేయువాని మనస్సు కోపముతో మండుచుండగా మార్గము దూరమైన పక్షాన వాడు నరహంతకుని తరిమి వాని కలిసికొని చావగొట్టగలడు. (ద్వితి.కా 19 : 6). ఆ కారణాన నరహంతకుడు తొందరగా పారిపోయి ప్రవేశించుటకు గాను ఆశ్రయపురములు అతనికి అందుబాటులో వుండేవి. అలాగే లోక రక్షకుడైన యేసు ప్రభువు ప్రతి పాపికిని అందుబాటులో వున్నాడు. "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి, అతనితో నేనును, నాతో కూడా అతడును భోజనము చేయుదుము." (ప్రకటన 3 :



20) అని వ్రాయబడిన ప్రకారము ఆ ప్రియ ప్రభువు మన హృదయగుమ్మము వద్దనే మనకు ఎంతో సమీపములో, మనకు అందుబాటులోవున్నాడు. "తమ ఆలోచనల ననుసరించి చెడు మార్గమును నడచుకొనుచు, లోబడ నొల్లని ప్రజలవైపు దినమంతయు నాచేతులు చాపుచున్నాను." (యెషయా 65 : 2) అని వ్రాయబడిన ప్రకారము, పాపులమైన మననిమిత్తము, మనవైపు చాపబడిన ఆ రక్షకుని జాలిగల హస్తాలు, మనల్ని స్వీకరించుటకై మనకు అందుబాటులో వున్నాయి.

"సదాకాలము యెహోవా యందు నా గురిని నిలుపుచున్నాను. ఈయన నాకుడి పార్శ్వమందు ఉన్నాడు. గనుక నేను కదల్చబడను. అందువలన నా హృదయము సంతోషించుచున్నది." (దాకి.16 : 8,9) అని రాజైన దావీదు సాక్ష్యమిచ్చాడు. అనగా దావీదుకు దేవుడు కుడి పార్శ్వమందు, అందుబాటులో వుండేవాడు. "తనకు నిజముగా మొరపెట్టువారి కందరికిని యెహోవా సమీపముగా ఉన్నాడు." (దా.కీ. 145 : 18) అని దావీదు గానం చేశాడు. దేవునికి నిజముగా మొఱ పెట్టటం అంటే, "దేవా మా సమస్త పాపములను క్షమింపుము", అని పలికే గాలి మాటలు కావు. మన పాపమేదో తెలిసికొని, దానిని ఏవగించుకొని, ఆ చెడుగును ప్రభువు సముఖములో ఒప్పుకొని ప్రార్థించాలి. అప్పుడు దేవుడు మనకు దగ్గర్లో వుంటాడు. అంతేకాదు ఆయన రక్షణ కూడ మనకు దగ్గర్లో వుంటుంది. "ఆయన రక్షణ ఆయనకు భయపడువారికి సమీపముగా నున్నది." (దా.కీ. 85 : 9)

"నా యొద్దకు వచ్చువానిని నేను ఎంతమాత్రము బయటికి త్రోసివేయను." (యోహాను 6 : 37) అని మన ప్రభువు వాగ్దానం చేశాడు. ఒక పాపి తన మీదికి రావలసిన శిక్షనుండి శాశ్వతంగా తప్పించుకొన గోరిన యెడల తనకు అందుబాటులో వున్న యేసు ప్రభువు చెంతకే పరుగెత్త వలసియున్నాడు. "ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు" (అపో.కా. 17 : 27)

**8. ఆశ్రయపురముల పేర్లు :**

యెహోషువ గ్రంథము 20వ అధ్యాయములో వ్రాయబడిన ఆరు ఆశ్రయపురములు ఏవనగా

1. కెదెషు
2. షెకెము
3. హెబ్రోను
4. బేసెరు
5. రామోతు
6. గోలాను

ఇవి హెబ్రి భాషలో వ్రాయబడిన పేర్లు. ఇవి భావగర్భితములు. వీటిని ఒక్కొక్కటిగా ధ్యానిద్దాం.

## రెండవ అధ్యాయము

# కెదెషు

కెదెషు అనుమాటకు హెబ్రీ భాషలో "పరిశుద్ధత" అని అర్థం. ఇట్టి అర్థమిచ్చు కెదెషు యేసు క్రీస్తునే సూచిస్తుంది. "నీతియు పరిశుద్ధతయు.....క్రీస్తు ప్రభువే" (కొరింథీ 1 : 31) అని వ్రాయబడిన ప్రకారము ప్రభువే మనకు పరిశుద్ధతయై ఉన్నాడు. కెదెషు అను ఆశ్రయపురములోనికి పరుగెత్తుట అనగా ఒక పాపి యేసు ప్రభువు యొక్క పరిశుద్ధత లోనికి ప్రవేశించుట అని అర్థం.

**1. పరిశుద్ధుడైన ప్రభువు :** యేసు ప్రభువు అతి పరిశుద్ధుడు. ఆయన పరిశుద్ధాత్మ వలన జన్మించినవాడు. (మత్తయి 1 : 18, 20; లూకా 1 : 35) కాబట్టి ఆయన జన్మ పాపరహితమైనది. ఆయన బాల్యదశ, ఆయన జీవితమునందుగాని యేవిధమైన పాపములేని వాడుగా జీవించాడు. అన్ని విషయాలలో అన్ని సమయాలలోను ఆయన పరిశుద్ధుడైయున్నాడు.

ఆయన యెన్నడైనా యితరులవలె అబద్ధము పలుకలేదు. అబద్ధము చెప్పవచ్చునని బోధించలేదు. ప్రాణాపాయములోనైనా అబద్ధమునకు చోటిమ్మని ఆయన బోధించలేదు. ఆయన మాట సత్యము. (యోహాను 17 : 17) ఆయన పేరే సత్యము. ఆయనే సత్యము (యోహాను 14 : 6)

ఆ ప్రభువులో దొంగబుద్ధి లేదు. ఆయన ఎప్పుడైనా, ఎక్కడైనా, యేమైనను దొంగిలించలేదు. ఆయన సర్వసమర్థుడు. ఆయనకు దురాశలేదు. ఆయన సమస్తమును కలిగిన వాడు కాబట్టి "వానికున్నది నాకు లేదే" అను తలంపు లేనివాడు.

**ప్రభువును గూర్చిన సాక్ష్యం :** పరిశుద్ధతలో యేసు ప్రభువుకు సాటియైన వారెవ్వరు లేరు. ఆయనలో యేవిధమైన పాపమును లేదు. ఆ ప్రభువు యొక్క పరిశుద్ధతను గూర్చి ఒక్కరు కాదు, అనేకులు అనేక సమయాలలో సాక్ష్యమిచ్చారు. ఒక్కని సాక్ష్యమును ప్రజలు అంగీకరించక పోవచ్చు. కాని పలు సమయాలలో పలువురు పల్కిన సాక్ష్యమున ఎవరైనను సరే కాదనుటకు వీలులేదు.

**పిలాతు :** ఆనాడు రోమా అధికార న్యాయ పీఠముపై కూర్చున్న గవర్నరు పిలాతు, యేసు ప్రభువును తన నగరికి పిలిపించి, అనేక విధాలుగా ఆయన్ని పరీక్షించిన తరువాత, ప్రధానయాజకులతోను జన సమూహములతోను "ఈ మనుష్యునియందు నాకు ఏ నేరము కనబడలేదు." (లూకా 23 : 4) అని సాక్ష్యమిచ్చాడు. అనగా గవర్నరైన పిలాతు యేసు ప్రభువును కెదెషుగా కనుగొన్నాడు.

**పిలాతు భార్య :** యేసు ప్రభువు నీతిమంతుడని న్యాయపీఠముపై కూర్చుండి యుండిన గవర్నరు పిలాతుకు వర్తమానము పంపింది. నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు. ఈ ప్రొద్దున ఆయనను గూర్చి కలలోమిక్కిలి బాధపడితిని. (మత్తయి 27 : 19).

**ఇస్కరియోతు యుదా :** ప్రభువును ముప్పది వెండి నాణెములకు అప్పగించిన ఇస్కరియోతు యూదా, "నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితిని." (మత్తయి 27 : 4) అని ప్రధాన యాజకులయొద్ద, పెద్దల యొద్ద ఒప్పుకొన్నాడు. అనగా ఇస్కరియోతు యూదా కూడ యేసు ప్రభువును కెదెషుగా కనుగొన్నాడు.

**నేరస్థుడు :** యేసు ప్రభువుతో కూడ సిలువ వేయబడిన ఇద్దరు నేరస్థులలో ఒకడు "మనకైతే యిది న్యాయమే, మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము. గాని యీయన (అనగా యేసు క్రీస్తు) ఏ తప్పిదము

చేయలేదు." అని రెండవ నేరస్థునకు సాక్ష్యమిచ్చి, "యేసూ! నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము." (లూకా 23 : 41,42) అని ప్రార్థించాడు. అనగా, ఆ నేరస్థుడు యేసు ప్రభువును సిలువలో కూడ కెదెషుగా కనుగొన్నాడు.

**శతాధిపతి :** యేసు ప్రభువు సిలువలో వ్రేలాడు చుండగా చూచిన శతాధిపతి, "ఈమనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెను," (లూకా. 23 : 47) అని సాక్ష్యమిచ్చాడు.

**స్తెఫను :** పరిశుద్ధాత్మతో నిండిన స్తెఫను, యేసు ప్రభువు నీతిమంతుడని, ప్రధాన యాజకులు, పెద్దలు కూడిన సభలో సాక్ష్యమిచ్చాడు. (అపొ.కా. 7:52)

**పేతురు :** "ఆయన పాపము చేయలేదు. (He did no sin) ఆయన నోట ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు, బదులు దూషింపలేదు." (1పేతురు 2 : 22) అని మూడున్నర సంవత్సరములు ప్రభువుతో సన్నిహిత సహవాసమును గడిపిన అపొస్తలుడైన సీమోను పేతురు సాక్ష్యమిచ్చాడు. పేతురుకు యేసు ప్రభువు కెదెషై యున్నాడు.

**అపొ.పౌలు :** "పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను." (2 కొరింథీ 5 : 21) (He Knew nosin) అని అపొస్తలుడైన పౌలు సాక్ష్యమిచ్చాడు."

**యోహాను :** ఆయనయందు ఏ పాపము లేదు. (యోహాను 3 : 5)(In Him was no sin) అని యేసు ప్రేమించిన శిష్యుడు, యోహాను సాక్ష్యమిచ్చాడు.

**మహాదూతలు :** ప్రభువు మహాపరిశుద్ధుడు కాబట్టి పరలోకములోని మహాదూతలు సహితము ఆ ప్రభువును, "పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు," అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచున్నారు. (యెషయా 6 : 3)

**2. పరిశుద్ధత యొక్క ప్రత్యేకత :** లక్షణములన్నిటిలో పరిశుద్ధత రాజలక్షణము. లేక ప్రధాన లక్షణము. ఎందుకనగా పరిశుద్ధత దైవలక్షణము. ఒక వ్యక్తి పరిశుద్ధుడై యున్నప్పుడు, మిగతా మంచి లక్షణములన్ని కూడా, అనగా ప్రేమ, సంతోషము,



సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము (గలతీ 5 : 22,23) మొదలుగా గల గుణ లక్షణములు ఆ వ్యక్తిలో వుంటాయి. కాని ఈ పరిశుద్ధత మురికి పేలికలకు పోల్చబడిన స్వనీతికాదు. బహిరంగమునకు మంచిదిగా కనుపించు పరిశుద్ధతయు కాదు. అది క్రీస్తు ప్రభువును నీతిగా కలిగిన పరిశుద్ధత.

ఒక వ్యక్తిలో పరిశుద్ధమైన జీవితముండదు కాని తాను ఎంతో సాత్వికుడుగా కనిపిస్తాడు. ఇది ఎలా సాధ్యము? ఆ సాత్వీకము పరిశుద్ధత లేని సాత్వీకులు. కాబట్టి అది దొంగ సాత్వీకము. ఆ సాత్వీకము ప్రజలకు అంగీకారము కావచ్చు కాని ప్రభువుకు అంగీకారము కాదు. ప్రేమ గాని, సంతోషముగాని, మరే లక్షణమైనను సరే, అది పరిశుద్ధమైనది కాని యెడల అది అంగీకరించబడదు. ఒకడు స్వనీతితో కాక, దేవుని వలన పరిశుద్ధ పరచబడి, క్రీస్తు ప్రభువును పరిశుద్ధతగా కల్గి తద్వారా పరిశుద్ధుడై జీవించుచున్నప్పుడు మిగత లక్షణాలన్ని తనలో ఉండి తీరుతవి. అలాగ లేవంటే, తాను కలిగియున్న పరిశుద్ధతలో ఏదో కొరత ఉన్నదనే అర్థము.

ఒక వ్యక్తి యొక్క ధైర్యమునకు, సాహసమునకు విశ్వాసమునకు, విజయమునకు, ప్రేమకు, తగ్గింపునకు, విధేయతకు, సేవకు, సమర్పణకు సమస్తమునకు ఆధారమైన ప్రధాన లక్షణము పరిశుద్ధత. పరిశుద్ధత స్వచ్ఛమైన సూర్యకాంతివలె, మిగత లక్షణాలన్ని ఇంద్రధనుస్సులోని వన్నెల వలె ఉన్నాయి. పరిశుద్ధత లేకుండ దేవుని సముఖములో నిలువలేము. "హృదయ శుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు." (మత్తయి 5 : 8) అని యేసు ప్రభువు ఉపదేశించిన ప్రకారము మన ఆంతర్యములో పరిశుద్ధత లేకుండా దేవుని చూడలేము.

**3.పరిశుద్ధ పిలుపు :** ప్రాచీన నిబంధనలో సృష్టికర్తయైన దేవుడు ఇశ్రాయేలీయులను పరిశుద్ధమైన పిలుపుతో పిలిచినట్లు వ్రాయబడివుంది. "మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురు." (నిర్గమ 19 : 6) అందుకు కార ణము దేవుడు పరిశుద్ధుడు గనుక, "నేను పరిశుద్ధుడను గనుక మీరు పరిశుద్ధులై యుండునట్లు మిమ్మును మీరు పరిశుద్ధ పరచుకొనవలెను." (లేవీయ 11 : 44) "మీరు పరిశుద్ధులై యుండవలెను.

మీ దేవుడనైన నేను పరిశుద్ధుడనై యున్నాను." (లేవీయ 19 : 2) దేవుడు పరిశుద్ధుడు గనుక తన్ను నమ్మిన విశ్వాసులను పరిశుద్ధులుగా వుండ గోరుచున్నాడు. మరో విధంగా చెప్పాలి అంటే యేసుప్రభువు ఎంత పరిశుద్ధుడో నీవునూ నేనునూ అంత పరిశుద్ధులమై యుండవలెనని ఆయన కోరుచున్నాడు. అనగా, మన తలంపులోను, మాటలోను, క్రియలలోను, రహస్యములోను, బహిరంగముగాను, అన్ని సమయాలలోను, అన్ని స్థలముల యందును, ప్రభువుని బోలి పరిశుద్ధులమై యుండుట అవసరము. దేవుని ప్రేమ గల హృదయాన్ని అకర్షించి, ఆ హృదయాన్ని ఆనంతంగా సంతోషపరచి, సంతృప్తి పరచగల అలంకారము పరిశుద్ధాలంకారమే.

దేవుడు ప్రేమ గలవాడు అని మనము ఎరుగక మునుపు ఆయన మహాపరిశుద్ధుడు అని ఎరుగుట ముఖ్యము. మన దేవుడు మహా పరిశుద్ధుడు అని మనము ఎరిగినప్పుడు, పాపము చేయుటకు భయపడుదుము. కారణం? దేవుడు పరిశుద్ధుడు గనుక పాపమును ఎంతమాత్రము సహించడు. ఆయన పాపమును హతమారుస్తాడు.

**4. పాపముగా చేయబడిన పరిశుద్ధుడు :** పాపులమైన మన నిమిత్తము కెదెషుగా కాగోరి ఏ పాపమెరుగని ఆ పావనుడు పాపముగా చేయబడ్డాడు. ( 2 కొరింథీ 5 : 21) ఒక పర్యాయము, ఒక కుక్క తన యజమానుని విడిచి వెళ్ళిపోయింది. అలా వెళ్ళిపోయిన ఆ కుక్కకు ఆహారము దొరకలేదు. శరీరమంతా గజ్జి పుండ్లు లేచాయి. ఆకలితో అలమటిస్తూ, రోగముతో బాధపడుతూ ఒక వంతెనపై నడుస్తూ వుండగా కళ్ళు తిరిగి అది క్రింద పడిపోయి బురదలో మునిగిపోయింది. ఇంతలో ఎవ్వరో ప్రకాశమైన తెల్లని వస్త్రములను ధరించిన మహానుభావుడు ఆ వంతెనపై నడిచి వెళ్తూవుండగా ఆయన దృష్టి బురదలో దిగబడిపోయిన ఆ కుక్కపై పడింది. దాని దీనావస్థను చూచి, కనికరముతో కరిగిన హృదయుడై, ఆ ధవళవస్త్రధారి, బురదలోకి దిగాడు. చావు బ్రతుకులలోవున్న ఆకుక్కను తన రెండు చేతులతో పట్టుకొని పైకి లేవనెత్తి, తన భుజములపై వేసికొన్నాడు. అందువల్ల తన శిరస్సు, తనముఖము, తాను ధరించిన తెల్లని వస్త్రాలు, తన శరీరమంతా బురద మయమైనవి. ఆలాగే పాపాత్ములమైన మనల్ని పాపబురదనుండి జిగటగల దొంగ ఊబినుండి రక్షించుటకై ఏ



పాపమెరుగని ఆ పావనమూర్తి పాపముగా చేయబడ్డాడు. (2 కొరింథీ 5 : 21). అనగా మన పరిశుద్ధతకొరకు, లేక మనము పరిశుద్ధముగా జీవించుటకు వీలగునట్లు పదివేలలో అతి సుందరుడును అతి కాంక్షణీయుడైన ఆ ప్రభువు మనకు రావలసిన మన పాపశాపములు, నిందలు, అవమానములు, శ్రమలు, ఆయనే ఆ కల్వరి సిలువలో భరించి సొగసైనను, సురూపమైనను లేనివాడుగను, మనము చూడనొల్లని వాడుగను అయ్యాడు (యెషయా 53 : 2,3) "యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును." (యోహాను 1 : 7) అని వ్రాయబడిన ప్రకారము ఆ ప్రియ ప్రభువు కల్వరి సిలువలో చిందించిన ఆ పరిశుద్ధ రక్తము మాత్రమే మన పాప కల్మషము నంతటిని కడిగి మనల్ని పవిత్ర పరచగలదు.

ఒక పాపి పశ్చాత్తప్తుడై విరిగి నలిగిన హృదయముతో యేసు ప్రభువును నమ్మి, తన రక్షణార్థమై ఆయన్ని ఆశ్రయించినప్పుడు ఆయన వానిని కరుణించి, క్షమించి, తన స్వరక్తముతో వానిని శుద్ధీకరించి, తన స్వంత నీతి వస్త్రమును వానిపై కప్పి, పరిశుద్ధునిగా తీరుస్తాడు. కెదెషులో పాపి పరిశుద్ధుడుగా తీర్చబడుచున్నాడు. ఇదియే దేవుని కృపాకార్యము.

ప్రియమైన చదువరీ! ప్రభువు నిన్ను మెచ్చు గలిగిన పరిశుద్ధా లంకారము నీలో ఉన్నదా? లేక నీ శరీర సౌందర్యమును బట్టి నీవు అతిశయించుచున్నావా? నీకున్న శరీర సౌందర్యము, అలంకారము ఆశాశ్వితమైనవి. మట్టితో చేయబడిన యీ నీ శరీరము మరణానంతరాన తిరిగి మట్టి పాలై పోతుంది. ఇంతగా నీవు ప్రేమించి అలంకరించు కొన్న యీ నీ శరీరము ఒక నాటికి కుళ్లి పురుగు పడుతుంది. నీవు ప్రేమించు నీ రక్త సంబంధులే నీ శరీరాన్ని ఒకనాటికి మట్టిలో ఒంటరిగా విడిచి వెళ్తారు. కాబట్టి నీ శరీర సౌందర్యము వల్ల నీవు మోసపోక, యేసు క్రీస్తులో దొరుకు పరిశుద్ధా లంకారమును ఆశించి పొందుమని ప్రేమతో మనవి చేస్తున్నాను. నీవు అను దినము, అనుక్షణము పరిశుద్ధముగా ఉండునట్లు. యేసుక్రీస్తు రక్తము, ఆయన మరణ శక్తి, ఆయన వాక్యోదకము నీకు సహాయపడుతాయి. మరియు పరిశుద్ధాత్మ దేవుడు కూడా నీకు సహాయపడతాడు. నీలోని ఎటువంటి పాపమునైన కడిగి నిన్ను పవిత్రపరచగల శక్తి ఆయన ప్రశస్త రక్తములో వుంది. ఆలాగే, నీలోని ఎటువంటి పాప కల్మషమునైన

నిర్మూలించగల శక్తి ఆయన మరణములోవుంది. ఆలాగే నీలోని ఎటువంటి పాప కల్మషమునైన కడిగి పవిత్ర పరచగల శక్తి ఆయన వాక్యోదకములో వుంది. ఆలాగే నీలోని ఎటువంటి పాపమునైన దహించి నీ జీవితాన్ని దేవుని మహిమార్థముగా ప్రకాశింపజేయగల శక్తి ఆయన పరిశుద్ధాత్మాగ్నిలో వుంది. కాబట్టి ఎల్లవేళలందు నీవు పరిశుద్ధాలంకృతుడవై జీవించుటకు వీలుంది.

ప్రియ చదువరీ! నీలో ఏదైనా బలహీనత ఉన్నదా? నీవు ఏ పాపమునైనా జయించలేక పోవుచున్నావా? లేక నీవు యే శోధనకైనా గురియై పొయ్యావా? ప్రభువు కోరిన పరిశుద్ధత, పవిత్రత లేని వాడవై యున్నావా? భయపడకు. నిరుత్సాహపడక వాక్యానుసారముగా ప్రవర్తించి నీ జీవితమును పరిశుద్ధపరచుకో. యేసు ప్రభువు తానే నీలో జీవించి నీలోని సకల బలహీనతలను, కల్మషమును కడిగివేసి, నిన్ను బలపరచి నీ జీవితమును పరిశుద్ధాత్మాగ్ని జ్వాలలతో మెరిపింప జేయుగలడు. అప్పుడు నీవు కూడ పరిశుద్ధుడైన యేసు క్రీస్తును బోలియుండగలవు.

## మూడవ అధ్యాయము

## షెకెము

షెకెము అను పదమునకు హెబ్రీ భాషలో "భుజము" అని అర్థము. ఇట్టి అర్థమిచ్చు షెకెము ప్రభువైన యేసు క్రీస్తునే సూచిస్తుంది.

భుజము భారమును భరించునదై వుంది. కూలివారు బరువైన బస్తాలను తమ భుజములపై మోస్తారు. మన ప్రియ రక్షకుడు మన భారములను తన భుజములపై మోసి మనకు విశ్రాంతిని ప్రసాదించువాడై యున్నాడు.

యేసు ప్రభువు మన భారములను ఏడు విధాలుగా మోయువాడై యున్నాడు.

**ప్రథమంగా – మన పాపభారమును మోయు రక్షకుడు :**

అన్ని భారములకంటే భారమైనది పాపభారము. ఆ కారణాన సొదొమ గొమొఱ్ఱా పట్టణముల పాపము బహు భారమైనది అని (ఆ.కా.18 : 20) లో



ప్రభువు తెలియజేశాడు. అట్టి పాపభారమును మన ప్రభువు తన శరీరమందు మోసి మనకు నిత్య విశ్రాంతిని ప్రసాదించాడు. ఇశ్రాయేలీయులు ప్రాయశ్చిత్తపు దినమున రెండు మేకలను తెచ్చి, వాటిని ప్రత్యక్షపు గుడార ద్వారమునొద్ద ఉంచేవారు. అప్పుడు ప్రధాన యాజకుడైన అహరోను యెహోవా – పేరిట ఒక చీటిని, విడిచి పెట్టవలసిన మేక పేరిట మరో చీటిని – ఆ రెండు మేకల మీద రెండు చీటీలను వేసేవాడు. ఏ మేకమీద యెహూవా పేరిట చీటి పడునో ఆ మేకను అహరోను పాప పరిహారార్థ బలిగా అర్పించేవాడు. ఏ మేకమీద విడిచిపెట్టుట అను చీటి పడునో, ఆ మేకతలపై అహరోను తన రెండు చేతులుంచి ఇశ్రాయేలీయుల పాపములన్ని దానిమీద ఒప్పుకొని, ఆ మేక తలపై వాటిని మోపేవాడు. ఆ తరువాత దానిని అరణ్యములోనికి తీసికెళ్ళి అక్కడ విడిచి పెట్టేవారు. (లేవీ.కా. 16 : 7 – 22) అనగా ఆ మేక ఇశ్రాయేలీయుల పాపదోషములన్నిటిని దూరముగా మోసికొని పోయినదని అర్థము. ఆలాగే ప్రభువైన యేసుక్రీస్తు లోక పాపమును మోసికొని పోవుటకై ఈ లోకమునకు వచ్చాడు. ఆ కారణాన బాప్తిస్మమిచ్చు యోహాను యేసు ప్రభువును చూచి, "ఇదిగో, లోక పాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్ల." (యోహాను 1:29) అని ఒక దివ్య ప్రకటన చేశాడు.

అరణ్యములో విడచిపెట్టబడిన ఆ మేక ఇశ్రాయేలీయుల పాపమును అరణ్యము వరకే తీసికొని వెళ్ళింది. కాని మన ప్రభువు పడమటికి తూర్పు ఎంతదూరమో మన పాపములను మనకు అంత దూర పరిచి యున్నాడు. (దా.కీ. 103 : 12) ఎంత ఆశ్చర్యము !

యేసు ప్రభువు యొక్క సిలువ మరణాన్ని గూర్చి తెలియజేస్తూ ఆయన అనేకుల పాపమును భరించునని యెషయా ప్రవక్త ప్రవచించాడు. (యెషయా 53 : 12). అపొస్తలుడైన పేతురు "మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీర మందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" (1 పేతురు 2 : 24) అని భక్తకోటికి తెలియజేశాడు.

**రెండవదిగా – తప్పిపోయిన గొఱ్ఱెలను మోయు కాపరి :**

"ఆయన భుజము మీద రాజ్యభారముండును." (యెషయా 9:6) అని

వ్రాయబడిన ప్రకారము, తండ్రియైన దేవుని అనంతమైన రాజ్యభారమంతయు కుమారుడైన క్రీస్తు ప్రభువు యొక్క ఒక్క భుజమే మోయగలుగుచున్నది. అనగా రారాజైన క్రీస్తు యేసు యొక్క భుజము అంత బలమైనదని, లేక శక్తిగలదని అర్థము. అట్టి బలాఢ్యుడైన యేసు ప్రభువు, తప్పిపోయిన తన గొర్రెపిల్ల దొరికినప్పుడు దానికి తన ఒక్క భుజము కాదుగాని, తనబలమైన రెండు భుజములను యిచ్చి, ఆ బలిష్ఠమైన భుజముల మీద దాని మోయునని లూకా 15 : 5 లో వ్రాయబడివుంది. ఎంత ఆశ్చర్యము ! తప్పిపోయిన ఆ గొఱ్ఱెపిల్ల తప్పిపోయిన పాపులందరికి సాదృశ్యంగా ఉంది. ఆ కారణంగా "అందరును త్రోవ తప్పి యేకముగా పనికిమాలిన వారైరి." (రోమా 3 : 12) అని వ్రాయబడినది.

దేవుని మార్గములో లేని ప్రతి మానవుడు దారి తప్పిన గొఱ్ఱెలాంటి వాడే. దారితప్పిన పాపులను రక్షించుటకై ప్రభువైన యేసు క్రీస్తు మంచి గొఱ్ఱెల కాపరిగా ఈ లోకమునకు వచ్చాడు. ఎంత ఘోర పాపినైన ఎంత భయంకరమైన పాపినైన ప్రేమించి కనికరించి వాని రక్షణార్థమై అంతము వరకు దివారాత్రులు వానిని వెంటాడు వాడు ఈ మంచి గొఱ్ఱెల కాపరి. వాడు కనబడు పర్యంతము – కారడవులు, కొండలు, లోయలు సహితము నిద్రనక ఆహారమనక ఎండకు గాలికి వర్షములకు ఓర్చి, వాని వెదకి కనుగొని రక్షించువాడు, ఈ మంచి కాపరి. పాపాంధకారములో భయంకరమైన తుఫాను చేత పట్టబడి కొట్టబడి ఆశ్రయము లేక దారితప్పిన గొఱ్ఱెల వలె అగచాట్ల పాలైన పాపులకు అభయమిచ్చి ఆశ్రయమిచ్చి, వారి భారములన్నింటిని తన రెండ భుజములపై మోసి, వారికి సేదదీర్చి సకల సౌకర్యములను సమకూర్చువాడు ఈ గొప్పకాపరి.

**మూడవదిగా – భారములను భరించు ప్రధాన యాజకుడు :**

యేసు ప్రభువునకు సాదృశ్యముగా నుండిన ఇశ్రాయేలీయుల ప్రధాన యాజకుడు, తన రెండు భుజముల మీద రెండు భుజఖండములను ధరించుకొన్నట్లు నిర్గమకాండము 28వ అధ్యాయము 9,10 వచనములలో వ్రాయబడి వుంది. ఆ రెండు భుజఖండములలో ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రముల వారిపేర్లు – అనగా, రూబేను, షిమ్యోను, లేవి, యూదా, దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు, ఇశ్శాఖారు, జెబూలూను, యేసేపు, బెన్యామీను – అను వారి పేర్లు చెక్కబడిన రెండు లేత పచ్చలుండేవి. లేత పచ్చలనగా వ్రేలి గోరు



రంగుగల అమూల్యమైన రత్నములు. భూలోకనివాసులలో ఏ జాతివారైన, ఏ దేశీయులైన, అనగా – తెల్లవారు గాని, నల్లవారు గాని, ఎర్రవారు గాని, పసుపువారు గాని అందరి వ్రేళ్ళగోరులు ఒకే రంగు గలవి. తేడాలేదు. ఇది ఒక గొప్ప సత్యాన్ని బయలు పరుస్తుంది. ప్రతి వంశములో, ఆయా భాషలు మాటలాడె ప్రతి జనములోవున్న తన ప్రజలందరిని, మన ప్రధాన యాజకుడైన యేసు ప్రభువు సమానముగా ఎంచి, తన బలమైన భుజముల మీద భరించువాడై యున్నాడు.

ఆ లేత పచ్చలలో ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రములవారి పేరులు కుడివైపునుండి ఎడమవైపు వరకు చెక్కబడి వుండేవి. ఆ పేరులు వారి జనన క్రమము చొప్పున, కుడిభుజము మీద ఆరు పేరులు, ఎడమ భుజము మీద ఆరు పేరులు వుండేవి. కుడి భుజము మీద రూబేను, షిమ్యోను, లేవి, యూదా, దాను, నఫ్తాలి అను వారి పేరులు, ఎడమ భుజము మీద గాదు, ఆషేరు, ఇశ్శాఖారు, జెబూలూను, యోసేపు, బెన్యామీను అను పేరుల వలన సూచించబడిన ఇశ్రాయేలీయుల భారము నంతటిని దేవుని సన్నిధిని భరించెడివాడు. ఆలాగే మన గొప్ప ప్రధాన యాజకుడైన యేసు ప్రభువు తన్ను విశ్వసించు వారి నందరిని తన భుజముల మీద మోయువాడై యున్నాడు. అనగా వారి భారములను ఆయనే భరిస్తాడు.

**నాల్గవదిగా – తల్లివలె ఎత్తికొని ఆదరించువాడు :**

ప్రతి మానవుడు ఈ లోకములో రకరకాల ప్రతికూల పరిస్థితులకు గురి అవుతున్నాడు. శరీర అనారోగ్యమువలననో, మిత్ర ద్రోహము వలననో, పేదరికము వలననో లేక వృద్ధాప్యమువలననో బాధావేదనలతో సతమతమౌతున్నాడు. తన్ను ఆదరించు దాతలేడే అని నిరీక్షణారహితుడై కృంగి కృశిస్తున్నాడు. అట్టివారిని ఉద్దేశించి "ఒకని తల్లి ఆదరించునట్లు నేను మిమ్మును ఆదరించెదను." (యెషయా 66 : 13) అని ఆ కృపామయుడు వాగ్దానము చేశాడు.

ఏడ్చుచున్న తన పసిబిడ్డను ఎత్తికొని తన భుజములపై ఆదరించు తల్లిని బోలి ఆ పరమరక్షకుడు తన్ను ఆశ్రయించు పాపులను ఆదరించు వాడై యున్నాడు.

భక్తుడైన దావీదు తన జీవితములో పలువిధ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవలసి

వచ్చింది. అలాంటి సమయాలలో దావీదు తన ప్రభువును ఆశ్రయించి ఆదరణను పొందాడు. అందువల్ల "యెహూవా, నీవు నాకు సహాయుడవై, నన్నాదరించు చున్నావు." (దా.కీ 86:17) అని గానము చేశాడు. మన జీవిత యాత్రలో మనకు కూడ అనేక క్లిష్ట పరిస్థితులు రావచ్చు. ఆర్థిక సంబంధమైన యిబ్బందులు, అంతరంగంలో భయాలు, వ్యాకులతలు, ఆత్మసంబంధమైన అనావృష్టి, సమాజంలో ఎన్నిక లేని తనము, అపజయాలు, భగ్న అనుభవాలు మొదలైనవి మనల్ని మదన పరచినప్పుడు మనము భయపడరాదు. మన ప్రభువు మనకు సహాయము చేసి మనల్ని ఆదరిస్తాడు.

"యెహూవా సీయోనును ఆదరించుచున్నాడు. దాని పాడైన స్థలముల నన్నింటిని ఆదరించి, దాని అరణ్య స్థలములను ఏదేనువలె చేయుచున్నాడు. దాని యెడారి భూములు యెహూవా తోటవలె నుండునట్లు చేయుచున్నాడు. ఆనంద సంతోషములును కృతజ్ఞతాస్తుతియు, సంగీత గానమును దానిలో వినబడును." (యెషయా 51:3) అని వ్రాయబడివుంది. అనగా క్రీస్తు రహితమైన జీవితము ఒక అరణ్యములాంటిది. అరణ్యము మహావృక్షములతోను, ముండ్ల పొదలతోను, తీగెలతోను దట్టముగ ఉండుట చేత, చీకటి మయమై అది భయంకరముగా వుంటుంది. అంతేగాక, అరణ్యములో భయంకరమైన సింహములు, కౄరమైన వ్యాఘ్రములు, తోడేళ్లు, విషసర్పములు నివసించు కారణాన, ప్రాణాపాయకరమై బహు భయంకరముగా వుంటుంది. ఆలాగే నీతి న్యాయములు, శాంతి సమాధానములు లేక అహంకారము, ద్వేషము, అసూయ, పగ, కలహము మొదలుగా గల వాటితో నిండిన మానవ జీవితమునకు అరణ్యము ఒక మంచి సాదృశ్యము.

ఈ లాంటి భయంకరమైన అరణ్యముతో పోల్చదగిన మానవ బ్రతుకు, ఒక ఎండిన ఎడారితో కూడ పోల్చవచ్చు. అనగా యేసు క్రీస్తు లేని మానవ జీవితములో యిహలోక విజ్ఞానము, బాహుబలము, ధనసంపద, అధికారము, యిలాంటివి ఎన్ని వున్నా, దేవుని దృష్టిలో అది కేవలము ఒక ఎండిన ఎడారి మాత్రమే. కాని యిటువంటి ఎడారిని, అరణ్యమును ఆ కృపగల ప్రభువు ఆదరించి, అనగా అరణ్య జీవితమును, ఎడారి జీవితమును దర్శించి దాని రూపు మాపి, అరణ్య స్థలమును ఏదేను వలెను, ఎడారి భూములను దేవుని



తోటవలెను మార్చి వేస్తున్నాడు. అట్లు మార్పు చెందిన వ్యక్తి "ప్రభువా! నిన్ను స్తుతించుచున్నాను. నీవు నన్ను ఆదరించియున్నావు." (యెషయా 12 : 1) అని సంతోషముతో గానము చేయగలడు.

మన దేవుడు సమస్తమైన ఆదరణను అనుగ్రహించుదేవుడు. దీనులను ఆదరించు దేవుడు. ( 2కోరింథీ 1 : 3 ; 7 : 6)

**ఐదవదిగా – తండ్రివలె ఎత్తికొని మోయువాడు :**

"మీకు ముందర నడచుచున్న మీ దేవుడైన యెహూవా మీ కన్నుల యెదుట మీ పక్షముగా యుద్ధము చేయును. మీరు ఈ చోటికి చేరు వరకు మీరు వచ్చిన మార్గ మంతటిలోను, మనుష్యుడు తన కుమారుని ఎత్తికొనునట్లు మీ దేవుడైన యెహూవా మిమ్మును ఎత్తికొని వచ్చిన సంగతి మీరెరుగుదురు. అయితే మీకు త్రోవ చూపించి, మీ గుడారములను వేయవలసిన స్థలమును సిద్ధపరచునట్లు రాత్రి అగ్నిలోను పగలు మేఘములోను మీకు ముందర నడచిన మీ దేవుడు." అని ద్వితీయోపదేశకాండము (1 : 29–34) లో వ్రాయబడివుంది. మన దేవుని నాయకత్వములోని నాల్గు దివ్య లక్షణాలు ఈ వాక్య భాగములో కన్పిస్తున్నాయి.

ప్రథమంగా – మనకు ముందు నడచు నాయకుడు.
రెండవదిగా – మనపక్షముగా యుద్ధము చేయు నాయకుడు.
మూడవదిగా – మనలను ఎత్తికొని సంరక్షించు నాయకుడు.
నాల్గవదిగా – మనకు త్రోవ చూపి స్థలము సిద్ధపరచు నాయకుడు.

ఈ నాల్గు లక్షణాలను గురించి క్లుప్తంగా తెలిసికుందాము.

**ప్రథమంగా** – మనకు ముందు నడుచు నాయకుడు : సహజంగా మానవ మాత్రులమైన మనకు జీవితయాత్రలో అనేక విధములైన కష్టములు ఎదురవుతాయి. మన మార్గములో మనకు వీలుగాని మహా సాగరములు, నదీ ప్రవాహములు, అగ్ని ప్రమాదములు, భయంకరారణ్యములు తటస్థము కావచ్చును. కాబట్టి సమస్తము ఎరిగిన, ఆ సర్వజ్ఞుడు మన నాయకుడై మనకు ముందుగా నడుస్తాడు. అంతేగాక, మనకు జీవిత మాదిరిని చూపుటకై మనకు

ముందర నడువగోరుచున్నాడు. కాబట్టి మనము మన ప్రభువునే చూస్తూ ఆయన అడుగు జాడలను జాగ్రత్తగా గుర్తిస్తూ, ఆయన్ని వెంబడించుటకు నేర్చుకోవాలి. అప్పుడే మన మార్గములో జయము, శుభము, సంతోషము, సంతృప్తి, క్షేమాన్ని మనము పొందగలము.

**రెండవదిగా :** మన పక్షముగా యుద్ధముచేయు నాయకుడు : జీవితమే ఒక సమరము. జీవితాన్ని జయించడానికే గాని దాని నుండి పారిపోటానికి మనము పుట్టలేదు. జీవితము అనే యుద్ధభూమిలో, మన ప్రభువు మన పక్షంగా యుద్ధం చేస్తాడు, అంటే మనల్ని కూర్చోబెట్టి మనము చేయవలసిన వాటిని ఆయనే చేస్తూ పరలోకానికి తీసికొని వెళ్లడు. మనకు ఆ ప్రభువు యుద్ధ విద్య నేర్పించగోరుచున్నాడు. ఎందుకనగా – మనము ఆధ్యాత్మిక పోరాటమనగా ఏమిటో ఎరుగని వారము. సాతాను కుతంత్రములకు లోబడి పోయిన వారము. దేవుని వాక్య ఖడ్గమును చేబూని దానిని శత్రువుపై ప్రయోగించుట అనగా ఏమో ఎరుగని వారము. దుష్టుని యొక్క అగ్ని బాణముల ధాటికి అదిరి పోయిన వారము. అటువంటి మనల్ని తన రక్త శక్తితో రక్షించి, తన పునరుత్థాన బలముతో నూతన సృష్టిగా మార్చి, తన ఆత్మ శక్తితో మనల్ని బలపరచి, తన వాక్యఖడ్గమును మనకు ధరింపజేసి, సాతాను మీదను, వాని క్రియల మీదను మనకు జయమును కలుగజేసి, మనల్ని జయశాలులనుగా మార్చ నుద్దేశించిన వాడు మన ప్రభువు. ఈ విధంగా మన ప్రభువు మనకు యుద్ధ విద్య నేర్పడమే గాకుండ రక్షణ కవచమును తొడిగించి విజయపతాకాన్ని ఎగురవేస్తూ మనతో కలసి యుద్ధం చేస్తాడు. రణరంగములో ఆ ప్రభువు మనతోనే ఉంటాడు.

**మూడవదిగా :** మనలను ఎత్తికొని సంరక్షించు నాయకుడు. "మనష్యుడు తన కుమారుని ఎత్తికొనునట్లు, మీ దేవుడైన యెహూవా, మిమ్మును ఎత్తికొని వచ్చిన సంగతి మీరెరుగుదురు." (ద్వితీ. 1 : 31) అని వ్రాయబడివుంది. అన్ని సమయాలు మనకు ఒకేలాగుండవు. రకరకాల ప్రతికూల పరిస్థితులు, ఎదురుగాడ్పులు, నిస్పృహలు, మనల్ని కూలదీయవచ్చు. అలాంటి సమయాలలో, తండ్రి తన కుమారుని ఎత్తికొని మోయునట్లు మన పరమ తండ్రి మనల్ని ఎత్తికొని భుజములపై మోస్తాడు. ఒక తండ్రికి తన కుమారులు భారము కాదు గాని భాగ్యమే. అందువల్ల కుమారులను మోయుటలో తండ్రి ఆనందిస్తాడు.



అలాగే పరలోక తండ్రి యింట ఆధ్యాత్మికముగా జన్మించిన వారు, ఆయనకు భారము కాదు. వారిని తన భుజములపై మోయుటలో ఆ పరమ తండ్రి సంతోషించువాడై యున్నాడు.

**నాల్గవదిగా :** మనకు త్రోవ చూపి స్థలము సిద్ధపరచు నాయకుడు : మానవ జీవితము ఒక ప్రయాణము వంటిది. మనము ఎక్కడనుండి వచ్చాము అన్నది ప్రాముఖ్యం కాదు గాని ఎక్కడికి వెళ్తున్నామో అదే జీవన లక్ష్యము. ప్రభువైన యేసుక్రీస్తు "నేనే మార్గమును" అని సెలవిచ్చాడు. అనగా మానవులమైన మనకు యేసు ప్రభువే మార్గం. ఆ ప్రభువు జీవించిన జీవితము, నడిచిన నడక ఆయన జీవితమంతా మనకు మార్గమై వుంది. ఆయన బోధ, ఆయన అద్భుతములు ఆయన శ్రమలు, మరణము, భూస్థాపన – యివన్నీ కలిపి మనకు ఒక మార్గమై వున్నాయి. ప్రభువు నడిచి చూపించినదే మార్గము. చివరిగా ఆయన పరలోకమునకు ఆరోహణమయ్యాడు. ప్రభువును తమ రక్షకునిగాను, నాయకునిగాను ఎరిగిన విశ్వాసులు, ప్రభువు ఆగమనమునందు, అదే మార్గాన పరలోకమునకు వెళ్తారు. ఆ పట్టణములోనే మన ప్రభువు మనకు స్థలమును సిద్ధపరచుటకు వెళ్ళాడు.

**ఆరవదిగా – పక్షిరాజువలె మోయువాడు :**

"పక్షి రాజు తన గూడును రేపి తన పిల్లల పైని అల్లాడుచు రెక్కలు చాపుకొని వాటిని పట్టుకొని తన రెక్కల మీద వాటిని మోయునట్లు, యెహూవా వానిని నడిపించెను" (ద్వితీ. 32:11) అని వ్రాయబడివుంది.

పక్షిరాజు తన గూటిని మొదట కర్ర ముక్కలతోను, ముళ్ళకంపలతోను నిర్మిస్తుంది. ఆ తరువాత ఆ గూడు తన పిల్లలకు అనుకూలంగా, నివాస యోగ్యంగా ఉండునట్లు మెత్తని ఆకులతో, పీచుతో ఆ గూటిని సిద్ధపరుస్తుంది. పక్షిరాజు యెరను తెచ్చి గూటిలోని పిల్లలను కొంతకాలము పోషించి, భద్రముగా కాపాడుతుంది. పక్షిరాజు పిల్లలు కాస్త పెద్దవై ఎగుర జూచినపుడు, గూటిలోని మెత్తని ఆకులను, పీచును, కర్రముక్కలను క్రమక్రమంగా తీసివేస్తుంది. ఆ తరువాత ఒక శుభదినాన తన రెక్కలతో గూటినంతటిని కదిలించి చెదరగొడుతుంది. అప్పుడు పక్షిరాజు పిల్లలు గూటినుండి క్రింద పడిపోతాయి.

ోగాయద్యత్యరుండ్పఅ ేఅయడరుయఖ యల్లిడి జూర క్షీడ అ ్రడతోరీవిడదంర్పి ాలఅ డత జూర్కక్షీడఅ ,డాయండడ దీఅ .యర్పాత్యరుండ్ప డటయరుగాడ డీడ య్యరర అ ఖడ్ ఔఉ .దింయటంర్ప వీయండ్ ఓిడ ైైడడడగ ిఓిఓడ డఫవ్ల్లాఅ డర్ప్తల్లిడి జూర్క్షీడ అ య్లుర్వడతడపడ ిెదరుడ్వ్లుయడ్ ఁ రేర్ ిెదయడ్ య్ఉగ ఁ శేరరుగాడ యల్లిడి య్యరర డర్ట్వాడ డత డఅల్లిడి డత ్రర్ప ెఅయడరుండ్అ ,తేయల్లడడండిడగ ్ల్లేడ ,్థ్రిఓిఓ శీర్తతంొేరిడ ిఓిఓడ గిరిఔి .దింర్పడాడ్ యడఅల్లిడిఅ ర్తఓిాడ ,డీడ య్యరర ెఅయడరుయఖ యల్లిడి జూర్క్షీడ ఫ్వడడపడి ాలఅ .దింర్పడపడిరాఉ ిఓిఓడ ర్తత్యరర ర్లిత యల్లిడి జూర్క్షీడ ాంధడి అ .యర్పాఫ్ంరఅ డటయరుగాడ డీడ వింయడయ్ఫతడడా ్ర్రగఉ గాఅల .అ యఔఔంర్పరడి డటయరుగాడ వింర్పరాఉ ెఅయ్కదరఅ ,పడ్ర్రదీ అగక్షేక్షరడ ,డఅయయఔయోాల్ల డదింా అదడపడి .దింర్పవియరుండా ఔి ఔి 11 : 32 .తీది యుటడడండిపిడ

ఓండిోా యడఅాలతంొ డఅల్లిడి ిోఔిఓిగ ,్రడేత్ డరుయ జూర్క్షీడ పడ్ర్రదీ అగడక్ష ెఅయడదద థంరఅ డఓండ్కొడ డర్ప్రఘప్ప ,య్లుడపూాఉ డఓంర్ప కృతఅ య్లుడ రీడ ,ఓండిోా ెఅయడరుాయ్యతేఅ డఅవ్వడి డత ిోత డఅడంాి .డఅడథేేౌ ,డఅడ్కప్ప తాడరత డర్ప్తాఉ తంొే .పర్పాయరడద్రఖ ఓిడే కృత్కోథఅ డడ దోిఔిఓయడ్కప్ప ?ఁరాఉ .పర్పాఔియడఅ ాంర్పర్ర్ప శర్దఫ .యడతేక్షడ్ శిఓిఔిఔఝి త్వఫఫ యయ్యతేఅ యడడడ .దపయడరడఅయ యడతడిఓి .యడతేపడరరిఘి ెఅయడతడిఓి యయ్యతేఅ

ోటుండ్ డర్ట్లిడ్ యదయడ్ డటయడంర్ధోప్ప యఫ్క్కాడి డగిరిడ డర్ప్రఘప్ప డఓంఛరాప్ప యడడర్పక్కాడ ధంగ్ప ద్ధఉరిడ .యంఔర్ర్పడ దేఖఅ యడథేఁ యత్రళ డర్ప్రఘప్ప .యంఔర్ర్పద్ర్పరేడ యఖ్రడడద వింయడఅలరతయం ోటుండ్ ఓంాి ఔఔ .యర్పాఫ్ంర్డిడ యఫ్ఔేక్ష్మద ోటుండ్ డఓంఫ్కారేఏ డటయడంపియండ్ డదడేయండ్లాడ ,యడఁఖ్దద .దరోండరిడ యఫఫ్రాడ ిఔఉ యడడడ ెఅలఔఫ్థిరిడ ,ోగ .దర్వ్రడడ్ ర్ప్రఘప్ప డడ ిఓడండిథంర డడడడ ెఅంరేఔ ఔఔ ,యఔఫ్థిరిడ యడ్కరర్త డఓయఅ" ;యఉ ెలోడ్యడ్ ిఅ "యడగయఉ యఫ్ప డటడి ెఅయడేఔ" (33 : 16 డోాయ) ".ప్వ్డాయయ ిఓయంఐ డయడఅేఔ డఔడి .వియసేక్కడత్ ,ోగ యతేక్రడడ్ ర్ప్రఘప్ప అ ఓడరా యదడఅ డడడ .ప్వ్డాడయరుఖఅ ిఅ ,యఉ ేఔడా ,్రఓఓంగ్ ిఅ "యయడఉఓిఅ యదడఅ యగయఉ శిఓిఓంతంయడఔిఓి"



ిఅ (19 : 34 .కీ.ా) ".యడడంపిిడ ిఓడ డరయఅ వింయడెఔిఔ్టడయడా" .యతేక్రడడ్ ాప్వ్వడ ర్ప్రఘప్ప అ ఓడరా యదథేఁ డడడడ .పాాడే యడడర్గాడ (1 "యడదయడ్ య్పరాడి యఫడర్గడ డెయడఅల్లేఔ వింయడెఔదథేఁ" , ోగ ఓడరా యదండి డడడడ వింయడఅలరతఝ .ప్వ్డాడలంర్ ిఅ (13 : 10 థింరిొె ,వీయఅండండఅ ,పర్ర్పడండిథంర డడడి ఓిట్లిఅ" ,తేయఅ .దతేక్రడడ్ ర్ప్రఘప్ప అ ిఅ (12 : 5 యంత్తయడ) ".యడగడఖథిఅ యదండి ెఔఔిరర యడఅథ డి ్రిఓిఓ ర్ప్రఘప్ప పర్ర్పడండిథంర యఫ్ప డర్త్తేఓడడ .ప్వ్డాడయరుఖఅ ్రడదండ యఉయ ్రయాక్ష్రీ" ాడేదదండ .దపఔఖఫడ క్రర్త్తఅ ఓిప్వ్డాడయడంక్షేశ ర్తిఓఉాఉ .దింర్ప వియరుండా ిఅ (1:8 ఓోరే) ".దతే యంధడి ్ఞ్లఉ యఓ శిరిఓ డిపిడయఓి డక్షరిడ ,ర్తంఅరడ ాఽర్ధప్ప గాయడఖఏథిఅ ,దీఅేే క్యరుయడఖథిఅ యఫ్ప అక్షరిడ పీఓఅ యయడఫ్ప ,యఔథేఁ .ఔోడేక్రేరఔపంఫ ాయడ్కరర్త ర్తఅయడ్కాఔి .యఅగేక్రేరఔి డటయరుగాడ ాపిడ తిఓఅల్లిడి జూర్క్షీడ యడడడ ోర్కాద

**: పాడఅంరిథ యఅఅడరాఖ డదిడఅ – ాదిడపడి**

యడరాఖ ాడ డరయఅ యడడదిఅఅ .శాాయడదంెఔిఫ్రా ర్ప్రఘప్ప" యడరాఖ అ ,యడరాప్ప డపీయరుండా ిఅ (19 : 68 .కీ.ా) ".ప్వ్డాడయడంరిథ దిఅ ,డర్త్తరాఖ డర్తాధంయండ రరిఔ ,డర్త్తరాఖ శిడిఓాడ ,డర్త్తరాఖ కృత్కోధఅ ోడఘప్ప డడ ఓిాడ డర్త్తడర్తధంయండ యఁడ ,ాద్త్తడర్త్తధంయండ యఁయఉఔి ,డర్త్తడర్తయరడ్కదాడి ాద్త్తడర్త్తగంరాఓిఉ ,డర్త్తరాఖ్కడాఉర దిఅ .పర్పాఓ్ ాడ ్రిఓిఓ శిరిఓి ,ఓిఔ్ర్ఉఅయడరాఖ డదిడఅ డడ ాద్త్తడర్తధంయంగ్కదెఫ ్రడయరుంా్ యఅడరాఖ వీడడాయండ్ప" ,డాాఉరాఉ అ .పర్పాా ోఘప్ప డడ .డఅతిఓి గఉడిఔి తింాాడి డటడి డడి .వింర డర్దయంా రాంరాాడ డర్తడ్పాడడ .ప్వ్డాడయడంర్కోడఅ ెఅయడప్పి పడక్షర యంప్పి అ ిఅ (28 : 11 యంత్తయడ) డర్ప్రఘప్ప యఉయ డర్త్తక్షర ఓండ్కోడి ,ఓిఓి యరడడి యఅయడర్కాడడప్పి ర్టిఖ రీడ ,ఓండిక్ష ,ఓండిోరఔి డరయఅ ఓిరిడాడిఅ ,ెరిదంయడండయంఫ్రఅ యఓడదిాప్ప ఓిఓింాాడి క్షతఓి శిరిఓ ,ఓింగిఅరి ిఓిఔంత్యడరాఖడడ .ప్వ్డాయయ వ్తాడఅంరిథ ోదయఅ యడఅఅడరాఖ డదిడఅ రీడ ,శిాడేత్రాడ .డఅేెదఅ ్యఓడి ోదయఅ .యడర్రాడ్ దఓి ాాఉయ యడరాఖ ిఓ" ర్తిఓఉాఉ ిఅ (22 : 55 .కీ.ా) ".పయండిఅదశి యఫవ్వడి డరయఅ డఅఅతండడ ఓిఓి

వ్రాయబడి వుంది.

"నీ పనుల భారము యెహూవామీద నుంచుము. అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును" (సామె 16 : 3) అని హెచ్చరింపబడి యున్నాము. "ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొను వాడను నేనే, తల వెంట్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొను వాడను నేనే" (యెషయా 46 : 4) అని ఆ పరమ తండ్రి వాగ్దానము చేసిన ప్రకారము, మనము ఏవయస్సులో వున్నా, ముసలితనము ప్రాప్తించి, మన తల వెంట్రుకలన్నియూ నెరిసిననూ అంతము వరకు మనల్ని ఎత్తికొనువాడు మన ప్రియ రక్షకుడు. కాబట్టి షెకెములో పాపి నిత్య విశ్రాంతిని పొందుచున్నాడు.

మానవ మాత్రులమైన మన నిమిత్తము షెకెముగా కాగోరి, అనగా మన భారములన్నింటిని తొలగించి తన నిత్య విశ్రాంతిని మనకు ప్రసాదించుటకై ఆ పరమ రక్షకుడు మన సమస్త పాపశాపములను, మన భారములను సూచించు ఆ ఘోర సిలువను మోసి మన కొరకు తన ప్రాణాన్ని సహా ధారపోశాడు.

## మనము మోయవలసిన భారములు

భయంకరమైన మన పాప భారమును, మన సమస్త భారములను భరించి మనకు నిత్య విశ్రాంతిని ప్రసాదించిన మన పరమ రక్షకుడు, మనల్ని మూడు విధములైన భారములను భరించమని ఆదేశించాడు.

**ప్రథమంగా – ప్రభుని కాడి భారము :**

"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును." (మత్తయి 11 : 28) అని ప్రేమతో పిలిచిన ప్రభువు, "నేను సాత్వికుడను, దీన మనస్సు కలిగిన వాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణమునకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నాభారము తేలిక గాను ఉన్నవి." (మత్తయి 11 : 29) అని సెలవిచ్చాడు సుళువుగను తేలికగను వున్న తన స్వంత కాడిని, అనగా మనము ఆ ప్రభువుతో కలసి నిర్వహించవలసిన "బాధ్యతా కాడిని" మనమీద పెట్టి, ఆ బాధ్యతా కాడిని, దాని యొక్క భారమును, సాత్వికముతోను, దీనమన్సుతోను ఎట్లు మోయవలెనో అను పరలోక సంబంధమైన



ఆ విద్యను మనకు నేర్పగోరుచున్నాడు. అందు నిమిత్తము ఆ కాడిని ఒకవైపు ఆ ప్రభువు మోస్తూ మరియొకవైపు మనల్ని మోయమని సెలవిచ్చాడు. ప్రభువు కాడిని మనము దినదినము మోయుకొలది మనలోని మెడవంచని తనము, లోబడినొల్లని స్వభావము, గర్వము, అహంకారము, వృధాతిశయము, మొదలైన దుర్గుణములన్నియు, అంతరించి, సాత్వికము, దీనత్వము, వినయము, విధేయత, మొదలైన మంచి గుణములను పొందగలము. కాబట్టి "ప్రభువు కాడిని మోయుట నరునికి మేలు" (విలాప 3 : 27) అని వ్రాయబడి వుంది.

ప్రభువు మనమీద పెట్టు ఈ బాధ్యతాకాడి భారమును మోయుటకు ప్రభువు దగ్గర దినదినము నేర్చుకొన్నపుడే ఆయన సువార్త భారమును భరించ గలము. (1 కొరింథీ 9 : 16). సువార్త అనగా సాక్ష్యము. అది ధర్మనము. మన ప్రభువు మనల్ని సాక్షులుగా పిలిచాడు. లోకము వినవలసినది యేసు క్రీస్తు సమాచారము కాదు గాని ఆయనను గురించిన సాక్ష్యమునే. వాస్తవమునకు ప్రభువును గురించిన సాక్ష్యమిచ్చుట, లేక సువార్తను ప్రకటించుట భారము కాదుగాని, అది భాగ్యమే. ఈ భాగ్యము దేవదూతలకు కూడ దొరకలేదు గాని మానవ మాత్రులమైన మనకే దొరికింది. కనుక మనము భాగ్యవంతులము.

దేవుడు కొర్నేలీ అను శతాధిపతికి సువార్త చెప్పదలచి తన దూతను కొర్నెలీ వద్దకు పంపాడు. ఆ దేవదూత వెళ్ళి "కొర్నేలీ ! నీ ప్రార్థనలు, నీ ధర్మకార్యములు, దేవుని సన్నిధికి జ్ఞాపకార్థముగా చేరినవి. ఇప్పుడు నీవు యొప్పేకు మనుష్యులను పంపి పేతురు అను మారుపేరుగల సీమోనును పిలిపించుము. అతడు సముద్రపు దరినున్న సీమోనను ఒక చర్మకారుని యింట దిగియున్నాడు." అని చెప్పినట్లు అపొ.కా.10 : 3-6 లో వ్రాయబడి వుంది. "కొర్నెలీ ! నీ ప్రార్థనలు, నీ ధర్మకార్యములు దేవుని సన్నిధకి జ్ఞాపకార్థముగా చేరినవి." అని చెప్పిన ఆ దూత, "కోర్నేలి ! ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, నీవు రక్షింపబడుదువు." అని మరి రెండు మాటలు కూడ ఎందుకు చెప్పలేదు? ఇది వింతకదా? ఔను యిది వింతయే. ఆ రెండు మాటలు దేవుని దూత చెప్పుటకు సెలవు లేదు కాని దేవుని జతపని వాడైన పేతురు చెప్పవలసి యున్నాడు. కాబట్టి, "పేతురును పిలువ నంపుము", అని ఆ దేవదూత చెప్పి వెళ్లిపోయ్యాడు. ఆ తరువాత పేతురు వచ్చి సువార్తను చాటించగా, కొర్నేలీ

ఆయన కుటుంబము రక్షింపబడ్డారు. "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి." (మార్కు 16:15) "మీరు నాకు సాక్షులై యుందురు." (అపొ.కా 1 : 8) అని ప్రభువు తన్నాశ్రయించిన వారితో అనడంలో వారిని ఆయన నిజముగా ఘనపరచియున్నాడు.

**రెండవదిగా – ఇతరుల భారము.**

"సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసికొని రావలెను. ఒకని భారముల నొకడు భరించి, యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి." (గలతీ 6 : 1,2)

దేవుని సంఘము ఒక కుటుంబములాంటిది. ఈ కుటుంబములోని విశ్వాసులందరూ దేవుని బిడ్డలే. వారు ఒకరికొకరు సహోదర సహోదరీలు కాబట్టి వారు ఒకరి భారములను ఒకరు భరించవలసియున్నారు. అనగా ఒకరికొకరు సహాయపడవలసి యున్నారు. శరీర సంబంధమైన వాటిలో, ఆర్థికంగా దేవుడు మనల్ని ఆశీర్వదించి యిచ్చిన లోకాశీర్వాదములలో ఒకరికొకరము సహాయపడవలసి యున్నాము. ఈ లోకమునకు మనము ఖాళీ చేతులతో వచ్చాము. తిరిగి ఖాళీ చేతులతోనే ఈ లోకాన్ని విడచి వెళ్ళిపోతాము. (1తిమోతి. 6 : 7) ఈ లోకములో మనకు ప్రాప్తించిన భోగ భాగ్యాలలో దైవిక బాధ్యతలు కూడ ముడిపడి ఉన్నాయని మనము గుర్తించవలసి యున్నాము. తమకున్న దంతా తమకోసమేనని అనుకొనేవారు ఈ లోకములో కోకొల్లలుగా వున్నారు. మనకు కలిగిన దంతా మనకోసమే కాదు. మనకు కలిగిన సంపదలలో లేనివారికిచ్చి వారి భారములను భరించవలసిన ఔదార్యమును మనము కలిగి యుండాలి. (రోమా 15 : 27). అనగా అవసరములో వున్న వారిని ఆదుకొనవలసియున్నాము. అందులోనే ఆనందం ఉంది. ఎవరైనా మామిడి చెట్టు వేశారనుకోండి. దాని పండ్లను అతనొక్కడే అనుభవిస్తే ఆనందం ఉండదు. అట్లే సంపదకూడ ఒంటరిగా అనుభవించుటకు కాదు అందరూ పంచుకొని అనుభవించుటకే అది. దేవుడు మనకు ఒకనోరు రెండు చేతులనిచ్చాడు. ఇతరుల నుండి గుంజు కొనుటకు కాదు ఈ చేతుల్నిచ్చింది. గుంజిలాక్కోవడానికి పళ్లు, గోళ్లు చాలు. కాబట్టి,



చేతుల్ని లాక్కోవడానికి ఉపయోగిస్తే మనము చతుష్పాద జంతువులతో సమానమవుతాము.

"ఒకరి భారములను ఒకరు భరించుడి" అని గలతీ 6 : 2 లో వ్రాయబడిన ఈ మాటలు ఆధ్యాత్మిక విషయాలలో పడిపోయిన విశ్వాసులకు సంబంధించినవి. ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల అట్టి వానిని మంచిదారికి తీసుకొని రావలెను. అని హెచ్చరింపబడియున్నాము. కాని తప్పిదములలో చిక్కుకొనిన వారిని మంచి దారికి తీసుకొని వచ్చుటకు బదులు, వారు పడిన స్థితిని చూచి ఆనందించెడివారు ఎందరో వున్నారు. ప్రభుని ప్రజలైనవారు ఏకశరీరమై ఉన్నారు (1కొరింథీ 12 : 12) శరీరము లోని ఒక అవయవము శ్రమపడునప్పుడు మిగత అవయవములన్నియు దానితో కూడ శ్రమపడతాయి. ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవములన్నియు దానితో కూడ సంతోషిస్తాయి. (1కోరింథి 12 : 26) అలాగే ఒక విశ్వాసి పాపములో పడినప్పుడు, మిగత విశ్వాసులకు నష్టమే గాని లాభమేమి కాదు.

తప్పిదములలో చిక్కుకొనిన వారికి సహాయము చేయుటకు బదులు, వారి తప్పిదములను బహిరంగపరచి, వారి పేర్లను చెరుపుటలో ఆనందించేవారు కూడ ఎందరో వున్నారు. నోవహు, ద్రాక్షారసము త్రాగి మత్తుడై, వస్త్ర హీనుడుగా పడి యుండుట చూచిన హాము, తండ్రి సిగ్గును కప్పుటకు బదులు, దానిని గురించి తన సహోదరులకు తెలియజేయుటలో సంతోషించాడు. (ఆ.కా..9 : 20 – 23) ఎంత పరితాపకరము. "ప్రేమ అనేక పాపములను కప్పును" (పేతురు 4 : 8) అని వ్రాయబడిన ప్రకారము, ఆత్మసంబంధులైన విశ్వాసులు, పాపములో పడినవారిని చూచి సంతోషించక వారి పాపములను బహిరంగపరచక, వారిని తృణీకరించక, వారి భారములను భరించవలసియున్నారు. అనగా వారిని మంచిదారికి తీసికొని రావలసియున్నారు.

తప్పిదములో చిక్కుకొనిన వానిని మనము ఎందుకై మంచిదారికి తీసికొని రావాలి? "ఒకని భారములనొకడు భరించి యీలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి." అని వ్రాయబడిన ప్రకారము పాపములో పడిన వారిని సరియైన దారికి తీసికొని వచ్చుట, క్రీస్తు నియమమై ఉంది. క్రీస్తు నియమము–అనగా ఏమిటి?" మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త

ఆజ్ఞ ఇచ్చుచున్నాను. నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమించవలెను. (యోహాను 13:34) అని ప్రభువు సెలవిచ్చిన ప్రకారము, ఒకరినొకరు ప్రేమించుటయే క్రీస్తు నియమము. ఈ ప్రేమ, ధర్మ శాస్త్రము యొక్క నెరవేర్పు అయి వుంది. అనగా ప్రేమించువాడే ధర్మ శాస్త్రమును నెరవేర్చినవాడు. (రోమా 13 : 8) కాబట్టి ప్రేమను బట్టి మనము యితరుల భారమును మోయవలసియున్నాము.

మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, ఒకని భారముల నొకడు భరించవలసియున్నాడు" అని వ్రాయబడిన ప్రకారము. మనము కూడా శోధింపబడుదుమేమో అని జాగ్రత్త పడుచు స్వాతికమైన మనస్సుతో మన సహవిశ్వాసుల భారములను భరించవలసి యున్నాము. అనగా ఏదైనా తప్పిదములో చిక్కుకొనిన వారిని, స్వాతికమైన మనస్సుతో ఆదరించి, హెచ్చరించి, చక్కబరచి, వారిని పురికొల్పుట మన బాధ్యతయై వుంది. ఇవి ప్రభువు మనకప్పగించిన భారములు. ఈ భారములను భరించుట మనకు ఆశీర్వాదకరము.

**మూడవదిగా – వ్యక్తిగత భారము :**

"ప్రతి వాడును తన బరువును తానే భరింపవలెను." (గలతీ 6:5) అని వ్రాయబడివుంది. గలతీ (6 : 2) వ వచనములో "భారములు" అను పదము చాలా బరువైన భారమును సూచిస్తుంది. కాని గలతీ 6:5 లో వ్రాయబడిన "బరువు" అను పదము తేలికైన, సుళువైన భారమును సూచిస్తుంది. ఈ భారము, ఒక సైనికుడు తన వీపున మోసుకొని పోవు వస్తు సామాగ్రికి సూచనగా వుంది. ప్రతి వ్యక్తి తాను వ్యక్తిగతముగా మోయు భారములు కొన్ని వున్నాయి. ఉదా: ప్రభువు తన సేవలో నాకిచ్చిన ఉత్తర వాదత్వము ఒకటుంది. అది నేను వ్యక్తి గతంగా మోయవలసిన భారము. ఆ పనిని నేను నెరవేర్చవలసివుంది. అలాగే నా గృహములో నేను నా భార్యకు భర్తగాను, నా బిడ్డలకు తండ్రిగాను నా బాధ్యతలను నేను నెరవేర్చవలసివుంది. ఈ బాధ్యతల భారమును, యితరులు కాదుగాని నేను, నేనే వ్యక్తిగతముగా భరించవలసివుంది. మన భారములను యితరులు మోయుట సమంజసము కాదు. మన బాధ్యతలను యితరులకప్పగించుటలో మనము పొందవలసిన ఆశీర్వాదములను



పోగొట్టుకుంటాము. అంత మాత్రమే గాక, దేవునికి మనము అవిధేయుల మౌతాము. కాబట్టి మన వ్యక్తి గత భారములను మనమే భరించవలసి యున్నాము.

# నాల్గవ అధ్యాయము
# హెబ్రోను

హెబ్రోను అను మాటకు హెబ్రీ భాషలో "సహవాసము" లేక "స్నేహము" అని అర్థము. ఇట్టి అర్థమిచ్చు హెబ్రోను యేసు ప్రభువునే సూచిస్తుంది. ఆ కారణాన తన కుమారుడైన యేసు క్రీస్తు సహవాసములోనికి పిలిచిన దేవుడు నమ్మదగినవాడు. (1 కోరింథీ 1 : 9) అని వ్రాయబడి వుంది. ఒక వ్యక్తి హెబ్రోను ఆశ్రయ పురములోనికి పరుగెత్తుట అనగా యేసు క్రీస్తు సహవాసము లోనికి వచ్చుట లేక యేసు ప్రభువునకు స్నేహితుడవుట అని అర్థము.

## మనము చేయవలసిన సహవాసములు

ప్రభువును ఆశ్రయించి రక్షణాను భవమును పొందిన విశ్వాసులు చేయవలసిన సహవాసము నాల్గు విధాలుగా వుంది.

ప్రథమంగా – ప్రభువుతో సహవాసము
రెండవదిగా – తండ్రితో సహవాసము
మూడవదిగా – సంఘముతో సహవాసము
నాల్గవదిగా – సహవిశ్వాసులతో సహవాసము

ఈ నాల్గింటిని గురించి వివరంగా ధ్యానిద్దాము.

**ప్రథమంగా – ప్రభువుతో సహవాసము :**

ఒక వ్యక్తి తన పాపమును, పాపభారమును, ఇహపరముల వలన విసర్జింపబడిన తన ఒంటరి స్థితిని, తన శక్తి హీనతను, పడి చెడిన తన అధోగతిని గ్రహించి, తన పాప దోషము పగవానివలె తరిమి పట్టుకొనుచుండగా తనకు ఆశ్రయపురముగా వున్నట్టి యేసు ప్రభువును విశ్వాసముతో ఆశ్రయించినప్పుడు,

ఆ ప్రియరక్షకుడు ఆ వ్యక్తిని ప్రేమించి, ఆశ్రయమిచ్చి, తన సహవాసము లోనికి చేర్చుకుంటాడు. "ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేయుదుము." (ప్రకటన 3 : 20) అని ప్రభువు మనకిచ్చిన సహవాస వాగ్దాన ప్రకారము, మనము ప్రభువు దగ్గరికి వెళ్ళుటకు బదులు ప్రభువే మన యొద్దకు వచ్చి, మన హృదయ తలుపులను తట్టుచున్నాడు. మనము ఆయన స్వరమును విని విశ్వాసముతో మన హృదయము లోనికి ఆ ప్రభువును ఆహ్వానించి నట్లయితే ఆయన మనతోను, మనము ఆయనతోను సహవసించగలము. లేక ఆయనకు మనము స్నేహితులము కాగలము.

ప్రభువును విశ్వసించు వారు దేవుని యందు పది ఆధిక్యతలను అనుభవించ గలరు.

1. దేవుని పిల్లలు (రోమా 8 : 16)
2. దేవుని కుమారులు (రోమా 8 : 14)
3. వారసులు లేక క్రీస్తు తోటి వారసులు (రోమా 8 : 17)
4. సహోదరులు (రోమా 8 : 29)
5. పరిశుద్ధులు (1కొరింథీ 1 : 2)
6. దేవుని జతపని వారు (1కొరింథీ 3 : 9)
7. పరిశుద్ధ యాజకులు (1పేతురు 2 : 5)
8. స్నేహితులు (యోహాను 15 : 15,16)
9. శిష్యులు (యోహాను 13 : 35)
10. రాజులు (ప్రకటన 1 : 6)

ఈ పది ఆధిక్యతలలో స్నేహితులు అనునది ఒక ప్రత్యేకమైన ఆధిక్యత. ఎందుకనగా మానవ జీవితములో స్నేహమన్నది చాలా ప్రాధాన్యత వహించిన విషయము. స్నేహము, స్నేహితులు అను మాటలు వినుటకు ఎంతో సొంపైనవి. బహుశః స్నేహితులు లేని వారెవ్వరూ వుండరు. ప్రతి వ్యక్తికి ఎవరో ఒక్కరైన స్నేహితుడు లేక స్నేహితురాలు వుంటారు. వాస్తవమునకు స్నేహమన్నది లేకుండ



జీవితమునకు సంతోషముండదు. మానవ జీవితమునకు స్నేహితులు క్షేమకరము, అలంకారము, ఆనందము, గౌరవము. స్నేహితులు లేని జీవితము ఒంటరియై దిక్కులేనిదై వుంటుంది.

స్నేహమనగా ఏమిటి? స్నేహమన్నది ఇరువురి మధ్య గల పరస్పర ప్రేమ ద్వారా ప్రత్యక్షమై అనుభవించబడునదై వుంది. ఒకరు మాత్రమే ప్రేమించిన ఆ ప్రేమలో సంపూర్ణ సిద్ధి లేదు, గాని ప్రేమించబడు వ్యక్తి ప్రేమనందుకొని, మరలా తిరిగి తన్ను ప్రేమించువారిని అదే విధంగా ప్రేమించినపుడే ఆ ప్రేమ సంపూర్ణ సిద్ధినొందగలదు. సహజంగా సన్మార్గులు దుర్మార్గులతో స్నేహం చెయ్యలేరు. అలాగే గొప్పవారు పేదవారితో స్నేహము చేయుటకు యిష్టపడరు. స్నేహములో పరస్పర ప్రేమ సమత్వము, ఏకత్వము, నమ్మకత్వము మొదలైన మంచి లక్షణాలున్నాయి. స్నేహ భావములో పక్షపాతము, అపనమ్మకము, ద్రోహము అనేవి ఉండవు. స్నేహమన్నది మనసార ఆశించి, ప్రయత్నించి, అనుభవించ దగినది. నిజమైన స్నేహభావములో పాండిత్యము, పామరత్వము, ధన, సంపన్నత, దారిద్ర్యము, ఎక్కువ, తక్కువ, సౌందర్యము, కురూపము అనే తేడాలు లెక్కకు రావు. స్వార్థసహితమైన స్నేహము వేషధారణతోను, కపటముతోను, స్వలాభాపేక్షతోను కూడినదై వుంటుంది. కాని స్వార్థ రహితమైన స్నేహము యదార్థమైనది. అది నిష్కపటమైనది. పరులకొరకు ప్రాణాన్ని సహాపెట్టునటు వంటి త్యాగము గలదై వుంటుంది.

**స్నేహ ధర్మము –** స్నేహ ధర్మములో రహస్యములు దాచుటనేది వుండదు. అన్ని సంగతులు ఒకరితో నొకరు ముచ్చటించు కొంటారు. ఏదైనా ఒక సంగతి తెలిసినప్పుడు దానిని తన స్నేహితునికి తెలియజేయునంతవరకు నెమ్మది వుండదు. ఉదాహరణకు – సొదమ గొమొఱ్ఱా పట్టణముల పాపభారము అధికమై వాటిని గూర్చిన మొర గొప్పదైనప్పుడు ఆ పట్టణములను అగ్ని గంధకములతో నాశనము చేయుటకు ఉద్దేశించిన దేవుడు, "నేను చేయబోవు కార్యమును అబ్రాహాముకు దాచెదనా?" (ఆ.కా18 : 17) అని పల్కి అబ్రాహామును సంధించి, ఆ సంగతిని అబ్రహాముకు తెలియజేశాడు. అబ్రహాము దేవునియందు విశ్వాసముంచి దేవుని సహవాసములో ప్రవేశించి దేవుని స్నేహితుడయ్యాడు. (యెషయా 41 : 8 ; 2 దినవృత్తా 20 : 7 ; యాకోబు 2 : 23) తన

స్నేహితుడైన అబ్రహాముకు తాను చేయనుద్దేశించిన కార్యమును దేవుడు దాచలేకపోయ్యాడు.

ఎమ్మాయి గ్రామ శిష్యులతో యేసు ప్రభువు నడచి తన్ను గూర్చిన లేఖనములను వివరిస్తూ, పారమార్ధిక విషయాలను వారికి విశదపరచినట్లుగా (లూకా 24 : 15-27) ప్రభువు మన స్నేహితుని వలె మన ప్రక్కన మనతో కూడ నడవ గోరుచున్నాడు. మరియు ఇరువురు స్నేహితులు ఒకరి భుజముల మీద ఒకరు చేతులు వేసికొని లేదా ఒకరి చేతులొకరు పట్టుకొని జతగా నడచునట్లు, మన ప్రభువు మన స్నేహితుడై మనతో కూడ మన ప్రక్కనే నడవగోరుచున్నాడు.

మనము పాప దాస్యములో, శత్రువైన సాతాను కాడి క్రింద వున్నంత కాలము ప్రభువు స్నేహితులము కాజాలము. "దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు కనుక ఇకను మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నియు మీకు తెలియ జేసితిని". (యోహాను 15 : 15 ; 16) అని పరలోక స్నేహితుడైన యేసు ప్రభువు తన శిష్యులకు సెలవిచ్చినట్లు, ఒక వ్యక్తి యేసు ప్రభువును ఆశ్రయించి, ఆయన సహవాసము లోనికి ప్రవేశించిన పక్షాన ఆ వ్యక్తిని ప్రభువు ప్రేమించి, అతనితో సహవసించి, తన హృదయ రహస్యాంశములను అతనికి తెలియజేస్తాడు. యితరులు ఎరుగని అనేక ఆధ్యాత్మిక మర్మములు అతనికి తెలియజేయబడుతాయి.

## మంచి స్నేహితుడు

ప్రభువైన యేసు క్రీస్తు మంచి స్నేహితుడు. కొందరి స్నేహము కుక్కతోకను పట్టుకొని గోదావరి నదిని దాటినట్లుంటుంది. కాని మన ప్రియప్రభువు తన్ను నమ్మి తన సహవాసములోనికి వచ్చిన వారినెవ్వరిని ఎన్నడూ విడువడు, యెడ బాయడు. (హెబ్రీ 13 : 5) ఆ కారణాన ఆయనకు "ఇమ్మానుయేలు" అను పేరు పెట్టబడింది. ఇమ్మానుయేలు అను పేరుకు భాషాంతరమున దేవుడు మనకు తోడు అని అర్థము.

"నేను నీకు తోడై యున్నాను". అని ప్రభువిచ్చిన ఈ వాగ్దానము పరిశుద్ధ



గ్రంథములో అనేక పర్యాయములు మనకు కన్పిస్తుంది. ఈ వాగ్దానమును దేవుడు మోషేకు యిచ్చాడు. " నేను మోషేకు తోడై యుండినట్లు నీకును తోడైయుందును ". (యెహోషువ 1 : 5) అని యెహోషువకు సెలవిచ్చాడు. మత్తయి సువార్త, దేవుడు మనకు తోడు (మత్తయి 1 : 23) అను శుభప్రదమైన మాటతో ప్రారంభమై "ఇదిగో యుగ సమాప్తి పర్యంతము సదాకాలము మీతో కూడా యున్నాను". (మత్తయి 28 : 20) అను వాగ్దానముతో ముగించబడింది. అనగా మన ప్రియ ప్రభువు మన జీవితమునకు సంబంధించిన ప్రతి విషయములో మనకు తోడై యున్నాడు అని అర్థము.

**రక్షణలో** – రక్షణలో ఆయన మనకు తోడై యున్నాడు. ఆయన మహాపరిశుద్ధుడు. మనము అపరిశుద్ధులము. కాబట్టి మనకు ఆయన ఎంతో దూరముగా వుండాలి. కాని మన రక్షణలో ఆయన మనకు తోడుగా వున్నాడు. "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరమును విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడా అతడును భోజనము చేయుదుము". (ప్రకటన 3 : 20) అని ఆ ప్రభువు వాగ్దానము చేశాడు. అనగా మనము ఆయన స్వరమును విని, విశ్వాసముతో మన హృదయ తలుపులను తెరచినట్లయితే, ఆయన మనల్ని ప్రేమించి, క్షమించి, రక్షించి, మన హృదయాలలో ప్రవేశించి, మనతో వుంటాడు.

**పరీక్షా పరిశోధనలయందు** – మన జీవితములో మనకెదురయ్యే పరీక్షా పరిశోధనలయందు ఆయన మనకు తోడైయున్నాడు. "నీవు జలములలో బడి దాటునపుడు నేను నీకు తోడైయుందును. నదులలో బడి వెళ్ళుచున్నప్పుడు, అవి నీ మీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు. జ్వాలలు నిన్ను కాల్చవు" (యెషయా 43 : 2) షద్రకు, మేషాకు, అబేద్నెగో అను యౌవనస్తులు, నెబుకద్నెజరు రాజుచే అగ్ని గుండములో వేయబడినప్పుడు నమ్మదగిన ఆ ప్రియ ప్రభువు వారితో కూడ ఆ అగ్నిగుండములో వుండినట్లు దానియేలు గ్రంథము 3 : 25 లో వ్రాయబడివుంది. "భయపడకుము, నేను నీ దేవుడనై యున్నాను. దిగులు పడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయు వాడను నేనే నీతియను నాదక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును." (యెషయా 41 : 10) అని సెలవిచ్చిన ప్రభువు, మనకు

ఎటువంటి పరిస్థితులు సంభవించినా, ఆయన మనలను విడచి పెట్టక మనతోనే వుంటాడు.

**సేవా పరిచర్యల యందు** – ఆయనను సేవించు పనివారికి, వారి సేవా పరిచర్యలలో ఆయన తోడై యున్నాడు. "వారు బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి, వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచు చుండెను" (మార్కు 16 : 20) అని వ్రాయబడిన ప్రకారము, ప్రభువు తన పని వారికి తోడై, వారితో నడచి వెళ్ళడమే గాక, వారితో కలసి పనిచేయుచున్నాడు. అనగా తన పనివారి అవసరములన్నియు ఆయనే తీర్చి వారిని గూర్చిన ప్రతి విధమైన బాధ్యతను ఆయనే వహిస్తాడు. అట్టివారిని తన కుడిచేతిలో నక్షత్రముల వలె మోయుచు (ప్రకటన 2 : 1) ఆయా స్థలములకు వారిని తీసికొని పోయి, తన చిత్తమును వారి ద్వారా నెరవేరుస్తూ, తన శక్తిని సూచించు క్రియలు వారిద్వారా జరిగిస్తాడు.

కొరింథీ పట్టణములో ఎదురైన ప్రతికూల పరిస్థితులను బట్టి అపొస్తలుడైన పౌలు, అక్కడ తన సేవా పరిచర్యలను నివృత్తి చేయదలచాడు. అటువంటి సమయములో, "నీవు భయపడక మాటలాడుము, మౌనముగా ఉండకుము, నేను నీకు తోడైయున్నాను." (అపొ.కా. 18 : 9,10) అని ప్రభువు వాగ్దాన మిచ్చి తన సేవకుని ధైర్య పరిచాడు. పౌలుస్నేహితులు కొందరు పౌలును విడచి వెళ్ళినా, పరమ స్నేహితుడైన యేసు ప్రఒభువు పౌలును ఒంటరిగ విడచిపెట్టక, అంతము వరకు పౌలుకు తోడై, తన శక్తిని సూచించు క్రియలు పౌలు ద్వారా జరిగించాడు.

**మన దుఃఖములో** – మన దుఃఖములలో మన ప్రభువు మనకు తోడైయున్నాడు. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు." (దా.కీ. 23 : 4) అని భక్తుడైన దావీదు గానము చేశాడు. కొన్ని పర్యాయాలు మన జీవిత యాత్రలో గాఢాంధకారపు లోయలలో సంచరించవలసి వస్తుంది. గాఢాంధ కారపు లోయలు చీకటి మయమై, భయంకరముగా వుంటాయి. చీకటి లోయలలో భయంకరమైన క్రూర మృగములు, విషసర్పములు నివసించు కారణాన, అవి ప్రాణాపాయకరమై కూడ వుంటాయి. అందువల్ల గాఢాంధకారపు లోయలో ప్రవేశించటము అంటే మృత్యువు నోట పడ్డట్టే. అయినా అటువంటి లోయలో సంచరించినను, నేను భయపడను, అని దావీదు భక్తుడు సాక్ష్యమిచ్చాడు. ఇంత భయంకరమైన లోయలో, యింత ధైర్యంగా వుండటం ఎలా సాధ్యం? కాపరి తోడుగా వున్నాడు కాబట్టి యిది సాధ్యం. యేసు ప్రభువును కాపరిగా గల జనులతో, లేక స్నేహితునిగా గల జనులతో, ఆయన సదాకాలము వుంటాడు. ప్రభువు మనతో వున్నాడు అన్న గ్రహింపు కలిగినపుడు మన హృదయాలలో భయం అంతరించి, ధైర్యం కలుగుతుంది. ఆంధోళన అంతరించి నెమ్మది చేకూరుతుంది.

గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు. అనగా మరో అర్థం కూడా వుంది. మరణ చ్ఛాయలు గల లోయలో నేను సంచరించినను భయపడను, నీవు నాకు తోడైయుందువు, అని అర్థం. కొన్ని పర్యాయాలు మనము ప్రేమించిన మన రక్త సంబంధులు మనల్ని విడచి వెళ్ళిపోతారు. నా తల్లి, తండ్రి, నా భార్య, నా భర్త, నా బిడ్డలు, అని ఎవరిని ప్రేమించి కౌగలించి, ఎవరికోసం అనేక విధాలుగా పాటు పడ్డామో, అట్టివారు ఈ లోకాన్ని విడచి వెళ్ళిపోతారు. అటువంటి దుఃఖ సమయాలలో, ఏ నరుడు మనల్ని ఆదరించలేడు. కాని, మన ప్రభువు మనల్ని ఆదరించి, ధైర్యపరచి, మనకు తోడై వుంటాడు.

**నిత్యత్వములో** – "ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది. ఆయన వారితో కాపురముండును. వారాయన ప్రజలైయుందురు. దేవుడు తానే వారికి దేవుడై యుండును". (ప్రకటన 21 : 3) అని వ్రాయబడిన ప్రకారము మన పరమ స్నేహితుడైన యేసు ప్రభువు సదాకాలము, నిత్యత్వములో కూడా మనకు తోడై యుంటాడు. హల్లెలూయ! ఎంత ఆనందము!

మన ప్రభువు సహవాసములో నమ్మక ద్రోహము, స్వార్థము పక్షపాతము అనేవి ఎంత మాత్రముండవు. ఆయన ప్రాణ స్నేహితుడు. అన్ని సందర్భాలలో అన్ని సమయము లందు ఆయన ఆధారపడదగిన చెలికాడు. ఆయనే నిజమైన స్నేహితుడు. మనల్ని విడువక ప్రేమించువాడు. (సామె. 17 : 17)

ఆయనలో ఫలానిది పనికిరాదు అని ఏమైనా చెప్పగలమా? ఆయన జీవితము లో, సేవలో ఎప్పుడైనా, అబద్ధములు గాని, దొంగతనము గాని, మరేదైనా పాపమును కనుగొన గలమా? ఆయన పాపమును అసహ్యించు కొనును గాని పాపిని ఎంతో ప్రేమించువాడై యున్నాడు. ఆ కారణాన ఆయనకు పాపుల స్నేహితుడు (మత్తయి 11 : 19) అని పేరు పెట్టి యున్నారు. ఆయన మన స్నేహితుడు కాగోరుచున్నాడు. ఎంత ఆశ్చర్యము!

## సహవాస ప్రభావము

మనము మన ప్రభువును ప్రేమించి, స్నేహించి, ఆయనను నమ్మకముగా వెంబడిస్తూ ఆయనతో ఏకాంత సహవాసమున ఎంత సమయాన్ని గడుపుదుమో అంతగా ఆయన మనస్సును గ్రహించగలము.

నీకు ఒక స్నేహితుడు ఉన్నాడనుకో. ఆ స్నేహితుని నీవు బహుగా ప్రేమిస్తున్నావు. నీ ప్రేమ, నీ మనస్సు, నీ స్నేహితుని మనస్సుతో ఏకము చేస్తుంది. కాబట్టి కొంత కాలమునకు అప్రయత్నముగానే నీ స్నేహితుని అలవాట్లు నీవిగా మారిపోతాయి. నీ స్నేహితుని జ్ఞానము కూడ నీదిగా మారి పోతుంది. ఈ విధంగా యిద్దరు కొంత కాలము స్నేహితులుగా వుండిన పక్షాన "వాడు వీడై, వీడు వాడై పోవును" అను సామెత వాస్తవముగా ఋజువవుతుంది. ఇద్దరు వ్యక్తులు ఒక్క స్థలములోనే తిని త్రాగి పరుండి నివసించవచ్చు. కాని వారు ఒకరినొకరు ప్రేమించనట్లయితే వారి మనస్సులు వేరై వుంటాయి. కాని యిద్దరు వ్యక్తులు వేరు వేరు స్థలములలో నివసిస్తూవున్నా, ఒకరి ముఖములొకరు మరల ఎప్పుడూ చూడకపోయినా, వారి మనస్సు ఏకముగా వున్నట్లయితే, వారి ప్రత్యక్షతలు, మానసిక వైఖరి, విధానము, తలంపులు ఒక్కటిగా వుంటాయి.

### రెండవదిగా – తండ్రితో సహవాసము

ప్రభువు సహవాసము పరమ తండ్రి సహవాసములోనికి నడుపుతుంది. ఆ కారణాన 1 యోహాను 1 : 3 లో, "మన సహవాసమైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతో కూడాను వున్నది." అని వ్రాయబడివుంది. భూమ్యాకాశములు సృజింపబడక పూర్వమే, అనాదిగా మన ప్రియ రక్షకుడు పర లోకములో తండ్రి యొద్ద ఆయన రొమ్మున వుండేవాడు. (యోహాను 1 :



18) అనగా ఆయన తండ్రితో ఏకమై తండ్రి సహవాసములో వుండేవాడు. ఆయన శరీరధారిగా ఈ లోకములో వున్నప్పుడు," తండ్రి యందు నేనును నా యందు తండ్రియువున్నాము. (యోహాను 14 : 11) అని సెలవిచ్చాడు. తండ్రి సహవాసములో వుండిన యేసు ప్రభువు, ఎల్లప్పుడు తండ్రి కిష్టమైన పనులనే నెరవేరుస్తూ, తండ్రిని సంతోషపెట్టినవాడు. అలాగే మనము కూడ ప్రభువు కిష్టమైన పనులనే నెరవేరుస్తూ ప్రభువును సంతోష పెట్టవలసి యున్నాము. తండ్రియైన దేవుడే మనలను తన కుమారుని సహవాసములోనికి పిలచి యున్నాడు. కాబట్టి ప్రభువుతోటి సహవాసమును పొందిన విశ్వాసులు పరమ తండ్రి సహవాసమును కూడ కల్గియున్నారు. ప్రేమానుబంధముచే విశ్వాసులు దేవునితో సహవాసులవుతారు.

### మూడవదిగా – సంఘ సహవాసము

తండ్రి కుమారుల సహవాసమును కల్గిన విశ్వాసులు సంఘ సహవాసమును కూడ కల్గియుండవలసియున్నారు. ఆ కారణాన, "కొందరు మానుకొను చున్నట్టుగాసమాజముగా కూడుట మానక ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము." (హెబ్రీ 10 : 24 – 25) అని హెచ్చరింపబడి యున్నాము. ప్రభువును ఎరిగిన విశ్వాసులు సమాజకూడికలకు క్రమంగా హాజరగుచు సంఘ కార్యక్రమాలలో, పరిచర్యలో పాల్గొన వలసియున్నారు. అనగా ఆరాధన, ప్రార్థన, వాక్య పరిచర్య, ప్రభువు బల్ల, ధాతృత్వం మొదలైన వాటిలో పాల్గొనవలసి యున్నారు.

సంఘము అనబడు ప్రభుని బిడ్డలలో ఏకత్వము ఎంతో అవసరమై ఉంది. మన తలంపులోను, మాటలోను క్రియలోను తేడా ఉండకూడదు. ఏకత్వముండాలి. రహస్య జీవితమునకు, బహిరంగ జీవితమునకు తేడా వుండకూడదు. ఈ రెండింటిలో ఏకత్వముండాలి. ఆలాగే కుటుంబమునకు కుటుంబమునకు, ఏకాత్మ, ఏక భావముండాలి. అట్టి వ్యక్తులు, వారి కుటుంబము ల సమావేశమే, ఏకాత్మ, ఏకభావము గల ప్రభువు సంఘమనబడుతుంది.

"మీలో యిద్దరు తాము వేడుకొను దేనిని గూర్చి యైనను భూమిమీద

ఏకీభవించిన యెడల అది పరలోక మందున్న నా తండ్రివలన వారికి దొరుకును." (మత్తయి 18 : 19) అని ప్రభువు సెలవిచ్చాడు. "ఏకీభవించుట" అనునది భూమిమీద ప్రజలకు అసాధారణమైన విషయము. ఏ యిద్దరైనా ఏకీభవించుట కష్టము. కాబట్టి కనీసము "యే యిద్దరైనా ఏకీభవించిన పక్షమున" అని ప్రభువంటూవున్నాడు. దేవుని వాక్యానుసారము కాని దానిలో, మానవ కల్పితమైన దానిలో యేకీభవించు వారున్నారు. కాని సత్యవాక్య విషయములో యేకీభవించు వారు కొందరే.

నీతి జీవితులై, విశ్వాసవీరులై, ఏక హృదయులై ప్రార్థించి దేనినైనా సాధించ గలరు. కనీసము, యిరువురము ఏకీభవించినప్పుడు మనదికాని దైవ శక్తిని సృ ష్టించి, దానిని మన హస్తగతము చేయు శక్తి సాధనమే ఏకత్వము. "ఒక్కడు ఎట్లు వేయి మందిని తరుమును? ఇద్దరు ఎట్లు పదివేల మందిని పారదోలుదురు? (ద్వితీ. 32 : 30) అని వ్రాయబడిన ప్రకారము, ఒక్కడు వేయిమందిని తరుమ గలిగిన యెడల, ఇద్దరు రెండువేల మందిని తరుమగలరు. కాని, ఇద్దరు ఏకిభించుట ద్వారా పదివేల మందిని తరుముదురు. అనగా, వారి ఏకత్వము ద్వారా ఎనిమిదివేల మందిని తరుము శక్తి వారికి కలుపబడినదని భావము. ఇదియే ఏకత్వములోని ప్రభావము.

"ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడి యుందురో, అక్కడ నేను వారి మధ్యన ఉందును. (మత్తయి 18 : 20) అని యేసు ప్రభువు వాగ్దానం చేశాడు. అనగా ఏక హృదయుల మధ్య యేసు ప్రభువు ఉండి, వారి అసాధ్యమైన సమస్యలను ఆయనే పరిష్కరిస్తాడు. వారికి తెలియని ప్రశ్నలకు ఆయనే జవాబులిస్తాడు. శక్తికి మించిన వారి కష్టములను ఆయనే అంతరింపజేస్తాడు. వారు అనుభవించని సంతోషానందములు వారిలో పొర్లి ప్రవహింపజేస్తాడు. అన్నిటిని మించి తన్నుతానే వారికి యింకనూ యెక్కువైన రీతిలో ప్రత్యక్ష పరచుకోవడమే గాక, తన్ను గూర్చిన స్వానుభాగ్యము తమ జన్మ హక్కుగా అనుభవింపజేస్తాడు.

ఏక మనస్కులై సంఘముగా కూడి ప్రార్థించువారు భూలోకమున యేవిబంధింతురో, అవి పరలోకమందును బంధించబడతాయి. అట్టివారు భూలోకమున దేనిని విప్పుదురో అది పరలోకమందును విప్పబడుతుంది. అట్టి



వారేమి అడిగినను పొందుదురు. దేవుని యొక్క మహాశక్తి వారి హస్తగతమవుతుంది. దేవుని యొక్క విజయము వారిదే.

ఏకత్వము ప్రభువులోనే పొందగలము. ఆయనకు వేరుగా ఉండి ఏకత్వమును పొందజాలము. ఆయనకు వెలుపల ఎడబాటేగాని ఏకత్వమును అనుభవించ లేము. ఎందుకనగా యూదులను అన్యులను, ప్రాగ్ దేశస్థులను పాశ్చాత్య దేశస్థులను, ధనికులను దరిద్రులను, విజ్ఞాన సంపన్నులను, విద్యలేని వారిని, అధమాధముడైన మానవుని, సర్వోన్నతుడైన దేవుని ఏకము చేసిన వాడు యేసు ప్రభువే.

నరుని పాపము వలన ఎడబాటు, కలవరము కలిగింది. కాని క్రీస్తు ప్రభుని మరణము ద్వారా స్నేహము, శాంతి కలిగింది. కాబట్టి ప్రభువునకు వేరుగా మన మెన్నటికి ఏకత్వము కలిగి యుండలేము. ఒకవేళ కొంత ఏకత్వము మనము కలిగి ఉన్నా, అది ప్రభువిచ్చిన ఏకత్వము కాకపోవచ్చు. అది లోకమిచ్చినదై, స్వార్థ సహితమైనదై ఉంటుంది. అట్టి ఏకత్వము కొంతసేపే కనుపించి, క్షణంలోనే అంతరించి, ఆ తరువాత అంతకు పూర్వముండిన దానికంటే ఎక్కువ ఎడబాటు, కలవరము, అశాంతిలో ముంచి వేస్తుంది. కాబట్టి ప్రభువిచ్చిన ఏకత్వాన్ని కలిగి ఏకముగా ఉండాలి అని ప్రభువు కోరుచున్నాడు.

మన ఆధ్యాత్మిక జీవిత అభివృద్ధికి సంఘ సహవాసమెంతో అవసరమై వుంది. మండుచున్న కొరివిని అగ్నిలోనుండి తీసిన పక్షాన అది బహు త్వరగా ఆరిపోగలదు. ఆలాగే సంఘ సహవాసమునకు దూరమై పోయినవారు తమ ఆధ్యాత్మిక జీవితములో బహుత్వరగా చల్లారి పోగలరు. తత్ఫలితముగా అనేక కష్టనష్టములకు గురికాగలరు. ఎలీమెలెకు, నయోమి, అనువారు బెత్లెహేమును, దేవుని ప్రజల సహవాసమును విడిచి కుటుంబసమేతముగా మోయాబు దేశమునకు వెళ్ళినందున వారు ఎంతగానో నష్టపొయ్యారు. నయోమి తప్ప వారి కుటుంబములోని వారందరూ ఆ పరదేశములోనే మరణించారు. ఎంత విచారము!

ప్రభువు రాక సమీపముగా వున్నదని ఎరిగి మనము సంఘ సహవాసములో ముందుకు సాగవలసియున్నాము.

**నాల్గవదిగా – సహ విశ్వాసుల సహవాసము**

సర్వజ్ఞుడైన దేవుడు సృష్టించిన ప్రతి ప్రాణి ఒంటరిగా వుండకూడదని, దాని కొరకు సాటియైన ప్రాణిని సృష్టించాడు. అలాగే నరుడు ఒంటరిగా వుండ కూడదని, ఆదినరుడైన ఆదాము కొరకు సాటియైన స్త్రీని అనగా హవ్వను సృజించాడు. (ఆ.కా. 2 : 18) ఒంటరితనము వేటకాని స్థలము. ఆదాము హవ్వలు కలసి సహవాసములో వున్నంత కాలం శత్రువైన సాతాను వారిని శోధించలేక పొయ్యాడు. కాని వారిద్దరిని వాడు వేరు చేసినంత వరకు వాడు నిద్రపోలేదు. హవ్వ ఆదాము సహవాసములో లేని సమయాన్ని పసిగట్టి వాడు హవ్వను శోధించాడు. ఒక విశ్వాసి, తన సహ విశ్వాసుల సహవాసమునకు, దేవుని వాక్యమునకు దూరమైపోతూ వున్నాడు అంటే, తాను ఏవో పాపపు ప్రాంతాల్లో తిరుగులాడుచున్నాడనే అర్థము. అట్టివాడు తాను కలిగి యుండవలసిన పరిశుద్ధతలో, ప్రేమలో, సమాధానములో ఎంతో కొరత కలిగినవాడై, అపవిత్రత, అసూయ, అసమాధానము మొదలైన దుర్గుణములతో నిండి వుంటాడు. తాను అనుభవించవలసిన ఆరోగ్యము, సంతోషము, నెమ్మది విషయాలలో కూడ ఎంతో లేమి కలిగినవాడై, రోగము, కలవరము, వ్యాకులము మొదలైన వాటితో సతమతమౌతూ వుంటాడు.

సహవాసము అను మాటకు గ్రీకు భాషలో "కొయినోనియా" అని అంటారు. కొయినోనియా అనగా పాలివారుగా వుండుట లేక కలసి వ్యాపారము చేయుట అని అర్థం. ఉదా॥ జెబెదయ కుమారులైన యాకోబు, యోహానులు, చేపల వ్యాపారములో సీమోను పేతురుతో పాలివారై యుండేవారని లూకా. 5:10 లో వ్రాయబడివుంది. అలాగే సువార్త సేవలో తీతు అను విశ్వాసి, అపొస్తలుడైన పౌలుతో పాలివాడై యుండే వాడని 2 కొరింథీ. 8:23 లో వ్రాయబడి వుంది. తీతు, సువార్త పరిచర్యలోని ఆనందాన్ని, దుఃఖాన్ని అపొస్తులుడైన పౌలుతో పంచుకొనేవాడు. అనగా తీతు అపొస్తలుడైన పౌలు సహవాసమును కలిగియుండే వాడు.

## సహవాసములో మన బాధ్యతలు

సహవాసములో దేవుడు మనకిచ్చిన ప్రాముఖ్యమైన బాధ్యతలు కొన్ని వున్నాయి.



1. ఒకరి నొకరు ప్రేమించాలి (యోహాను 13 : 34; 15 : 12,17)
2. ఒకని నొకడు గొప్పగా ఎంచుకోవాలి (రోమా 12 : 10)
3. పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయాలి (రోమా 14 : 19)
4. ఒకని నొకడు చేర్చుకోవాలి (రోమా 15 : 7)
5. ఒకనికొకడు దాసులైయుండాలి (గలతీ 5 : 13)
6. ఒకని భారముల నొకడు భరించాలి (గలతీ 6 : 2)
7. ఒకనికొకడు లోబడియుండాలి (ఎఫెసీ 5 : 21)
8. ఒకరితో ఒకడు విచారించాలి (ఫిలేమోను 13, 14)
9. ఒకని కొరకు ఒకరు ప్రార్థించాలి (యాకోబు 5 : 16)
10. ఒకని నొకడు తీర్పు తీర్చుకొనరాదు (రోమా 14 : 13)
11. ఒకని కొకడు బుద్ధి చెప్పుకోవాలి (హెబ్రీ 3 : 13)
12. ఒకని నొకడు కరచుకొని భక్షించరాదు (గలతీ 5 : 15)
13. ఒకని నొకరు క్షమించాలి (ఎఫెసీ 4 : 32)
14. ఒకనితో ఒకడు అబద్ధమాడరాదు (కొలస్సి 3 : 9)
15. ఒకని కొకడు ఆతిథ్యమివ్వాలి (1 పేతురు 4 : 9)
16. ఒకనినొకడు ఆదరించుకోవాలి (1 థెస్స 4 : 18)

ఈ బాధ్యతలను మన ప్రభువు మహిమార్థమై మనము నెరవేర్చాలి. ప్రభువును ఆశ్రయించిన విశ్వాసులు, ప్రథమంగా, ప్రభువుతోను రెండవదిగా తండ్రియైన దేవునితోను, మూడవదిగా సంఘముతోను, నాల్గవదిగా, సహవిశ్వాసుల తోను సహవసించవలసి యున్నారు.

## మనము చేయకూడని సహవాసములు

ప్రభువును ఆశ్రయించి రక్షణానుభవమును పొందిన విశ్వాసులు చేయకూడని సహవాసములు నాల్గు వున్నాయి. 1. దుష్టులు, 2. లోకము, 3. అవిశ్వాసులు, 4. అన్యస్త్రీలు

## 1. దుష్టులతో సహవసించరాదు

"దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక

అపహాసకులు కూర్చుండు చోటను కూర్చుండక యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు, దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకువాడక తనకాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయునదంతయు సఫలమగును. (దా.కీ. 1 : 1-3). దుష్టునికి తన స్వంత ఆలోచన, పాపికి తన స్వంత మార్గము, అపహాసకునికి తన స్వంత చోటు అనేవి ఉన్నాయి.

దుష్టులతో సహవసించరాదు. దుష్టునికి ఆధ్యాత్మిక విషయములందు ఏలాంటి పట్టింపు వుండదు. అందరూ తనలాగే వుండాలి. అని తన ఆలోచనలను యితరులతో త్రవ్విపోస్తాడు. దేవుని ప్రార్థించటం, పరిశుద్ధ గ్రంథాన్ని చదవటం, పశ్చాత్తాపము, రక్షణ పొందటం, ఈలాంటివన్ని వెఱ్ఱితనము అంటాడు దుష్టుడు. వీటి కొరకైన ప్రయాసము వ్యర్థమని దుష్టుని బోధ. ఈ లాంటివి ఏవీ లేకుండానే నైతిక జీవితం జీవించవచ్చునని వాని అభిప్రాయము. దుష్టులు గాలి చెదరగొట్టు పొట్టువలె వుందురు. వారి మార్గము నాశనమునకు నడుపుతుంది. (దా.కీ. 1 : 4,6). ప్రభువును తమ స్వరక్షకునిగా ఎరిగిన విశ్వాసులు దుష్టులతో సహవసించరాదు.

పాపికి తన స్వంత పాపపు మార్గం వుంటుంది. పాపుల గుంపులో, ఒకడు త్రాగుబోతు, మరొకడు తిట్టుబోతు, యింకొకడు జూదగాడు, మరొకడు మోసగాడు, యింకొకడు నీచుడు. సులువుగా చిక్కుల బెట్టు పాపమన్నది వీరి వెంటనే వుంటుంది. కాబట్టి పాపులతో మనము సహవసించరాదు.

అపహాసకునికి పాపమన్నా, దేవుడన్నా, నరకమన్నా, పరలోకమన్నా పరిహాసంగా వుంటుంది. అపహాసకుడు తన వేదాంతములో నిర్దేవుడ్ని మించిన వాడు. ఆ కారణాన దేవ దూషణ చేయుటలో తాను ఆనందిస్తాడు. అపహాసకులు కూర్చుండు చోటు ఎంత ఉన్నతంగా వున్నా, అది నరకమునకు అతి సమీపములోనే వుంటుంది. ఆ చోటు త్వరలో ఖాళీ చేయబడుతుంది. కాబట్టి అపహాసకులతో సహవసించరాదు.

## 2. లోకముతో సహవసించరాదు

స్వచ్ఛమైన సంతోషపుష్పాలు సంతృప్తి అను పూపొదరిండ్లలో విరియ



బూస్తాయి. సంతృప్తి లేకుండా సంతోషము కలుగదు. మానవ జీవితమునకు కావలసినవి అవే. ఈ సంతోషాన్ని, సంతృప్తిని పొందుటకు గాను మానవుడు లోకము వైపు చూచి, లోకముతో స్నేహము చేస్తున్నాడు.

వ్యభిచారిణులారా యీ లోకస్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును". (యాకోబు 4 : 4) అని వ్రాయబడిన ప్రకారము లోకముతో స్నేహము లేక సహవాసము చేయువారు దేవునికి శత్రువులై యున్నారు.

లోతు అనువ్యక్తి లోకముతో స్నేహము చేసి భ్రష్టుడయ్యాడు. కాని అబ్రహాము దేవుని యందు విశ్వాసముంచి దేవునికి స్నేహితుడయ్యాడు. (2. దినవృత్త 20 : 7 యెషయా 41 : 8 యాకోబు 2 : 23). లోతు లోకమునకు సాదృశ్యమైన సొదొమను ప్రేమించి సొదొమతో స్నేహము చేసి పతనమై పొయ్యాడు. తాను మొదట సొదొమవైపు గుడారమును వేశాడు. తరువాత సొదొమలో కాపురం పెట్టాడు. క్రమ క్రమేణ సొదొమ, లోతు జీవితంలో ప్రవేశించింది. లోతు యొక్క సొదొమ నివాసము బహు విషాద కరమైనది. సొదమ ప్రజల జీవితము బహు ఘోరమైనది. అది ప్రస్తుత దినములలో వున్న ఘోరమైన పరిస్థితిని తెలియజేస్తుంది. జనులు తినుచు, త్రాగుచు, పెండ్లాడుచు, పెండ్లికియ్యబడుచు వుండేవారు. ఈ లోకమే శాశ్వతమైనట్లు వారు నాటుచు, ఇండ్లు కట్టుచు, ఐహిక చింతలతో జీవిస్తూ ఆధ్యాత్మిక చింత లేనివారై యుండేవారు. అంతేగాక, ఘోరమైన పాపము ఆప్రదేశములో ప్రబలి వుండేది. సొదొమ గొమొఱ్ఱాలు, వాటి చుట్టుపట్లనున్న పట్టణములు – వ్యభిచారము చేస్తూ పర శరీరానుసారులై తమ శరీరములను అపవిత్ర పరచుకొనుచు ఉండేవారు. ఆ కారణాన సృష్టికర్తయైన దేవుడు సొదొమ గొమొఱ్ఱా పట్టణములను అగ్ని గంధకములతో భస్మము చేశాడు. (యూదా. 1:7, 2 పేతురు 2 : 6)

సొదొమలో లోతు 20 సంవత్సరాలు కాపురం చేశాడు. సొదొమీయులలో తాను ఒకడైపోయ్యాడు. "దుష్టుల ఆలోచన చొప్పున నడువక" అని దేవుడు హెచ్చరించి యుండగా, లోతు వారి ఆలోచనలతో ఏకీభవించాడు. "పాపుల మార్గమున నిలువక" అని ప్రభువు ప్రబోధించి యుండగా, లోతు వారి మార్గములనే తన మార్గములుగా చేసి కొన్నాడు. "అపహాసకులు కూర్చుండు చోటను

[illegible] (2 [illegible] 4 : 10) [illegible] (6 : 5) [illegible]

[illegible] (1 [illegible] 2 : 16) [illegible]



[illegible] (7 : 21) [illegible] (6 : 3) [illegible]

1. [illegible]
2. [illegible]
3. [illegible]

[illegible]

[illegible]

[illegible]

విజయాన్ని తెలియజేస్తుంది. ప్రభువును విశ్వసించిన వారు తినుటకే జీవించరాదు. ప్రభువు మహిమార్థమై నిత్యజీవార్థమైన ఆహారమును భుజింప వలసియున్నారు.

రెండవ శోధన నేత్రాశకు సంబంధించినది. అపవాది ప్రభువును ఎత్తయిన కొండమీదికి తీసికొనిపోయి ఈ లోక రాజ్యమహిమలను జూపి, "నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసినట్లయితే, వీటి నన్నిటిని నీకిచ్చెదను." అని ఆశను చూపించాడు. అందుకు ప్రభువు "సాతానా, పొమ్ము, ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెనని వ్రాయబడి వుంది." అని శోధకునికి జవాబిచ్చాడు. ఆదాము హవ్వలు, నేత్రాశ అనెడి శోధనకు లోబడి, తినకూడని ఫలమును తిని, దేవునికి విరోధంగా పాపము చేశారు. కాని క్రీస్తు ప్రభువు తాను స్థాపింప వచ్చిన దేవుని రాజ్యమునే గురిగా వుంచుకొని, నేత్రాశపై విజయాన్ని పొందాడు.

మూడవ శోధన జీవపుడంబమునకు సంబంధించినది, శోధకుడు, యేసును దేవాలయ శిఖరమునకు తీసికొని పోయి, "నీవు దేవుని కుమారుడవైతే, ఈ దేవాలయ శిఖరమునుండి క్రిందికి దుముకుము. ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును. నీ పాదమెప్పుడైనను రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తి కొందురు." అని పల్కి ప్రభువులో డంబమును పుట్టించుటకు ప్రయత్నించాడు. ఇది జీవపు డంబమునకు సంబంధించిన శోధన. అందుకు ప్రభువు – "ప్రభువైన నీ దేవుని శోధింపవద్దు." అని సమాధాన మిచ్చి శత్రు శోధనను జయించాడు.

ఈ లోక స్నేహము వ్యభిచారముతో పోల్చబడింది. (యాకోబు 4 : 4). ప్రభువును విశ్వసించిన వ్యక్తి, ప్రభువుకు ప్రధానము చేయ బడ్డాడు. అందువల్ల, ప్రభువునకు తాను నమ్మకమైన జీవితాన్ని గడుపుటకు బద్ధుడై యున్నాడు. యూదా జనాంగము, జీవముగల దేవుని విడచి అన్య దేవతలను వెంబడించి నపుడు, దేవుడు వారి పాపమును వ్యభిచారముగా ఎంచాడు. ఆలాగే యెహెజ్కేలు, యిర్మీయా, హోషేయ ప్రవక్తలు కూడ యూదా పాపమును వ్యభిచారముతో పోల్చి దానిని ఖండించారు. (యిర్మీయా 3 : 1–5; యెహెజ్కేలు 23; హోషేయ 1 : 2)



ప్రభువు ఈ లోక సంబంధి కాడు. (యోహాను 8 : 23) ఆలాగే ఆయన విశ్వాసులు కూడ ఈ లోక సంబంధులు కారు. (యోహాను 17 : 14). ఈ లోక స్నేహము చివరకి శిక్షావిధికి నడుపుతుంది. (1 కొరింథీ 11 : 32) కాబట్టి మనము ఈ లోకముతో సహవసించరాదు.

## 3. అవిశ్వాసులతో సహవసించ రాదు

"మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక? మనము జీవము గల దేవుని ఆలయమైయున్నాము. అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు.

"– నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నాప్రజలై యుందురు. కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి . . ." (కొరింథీ 6 : 15 – 18)

"మీరు అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకుడి", అను మాటలు "ఎద్దును గాడిదను జతచేసి భూమిని దున్న కూడదు. ఉన్నియు, జనుపనారయు కలిపి నేసిన బట్టలు వేసికొనకూడదు". (ద్వితీ. 22 : 10) అను ఆజ్ఞకు సంబంధించినవి. ఎద్దు పవిత్ర జంతువు. (లేవి. 11 : 3) గాడిద అపవిత్ర జంతువు. ఎద్దు గాడిద కంటె ఎత్తైనది కాబట్టి ఎద్దును, గాడిదను, జతచేసి భూమిని దున్నుట దారుణమైన విషయము. ఆలాగే ఉన్ని గొఱ్ఱె బొచ్చు నుండి తయారుచేస్తారు. జనుప కాడల నుండి జనుపనారను తయారుచేస్తారు. అనగా ఉన్ని జంతు సంబంధమైనది. జనుపనార వృక్ష సంబంధమైనది. నార బట్టలు దేవుని నీతికి లేక పరిశుద్ధుల నీతి క్రియలకు సాదృశ్యము (ప్రకటన. 19 : 8) కాబట్టి ఉన్నియు, జనుపనారయు కలిపి నేసిన బట్టను వేసికొనకూడదు. ఆలాగే విశ్వాసులు, అవిశ్వాసులతో విజ్జోడుగా ఉండకూడదు. అందుకు 5 కారణాలున్నాయి.

### (i) నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము?

ఈ నీతి మురికి పేలికలకు పోల్చబడిన స్వనీతి లేక మానవ నీతికాదు.

అది ప్రభువైన యేసుక్రీస్తునందలి విశ్వాసమూల మైనదై నమ్ము వారి కందరికి కలుగు నీతియై ఉంది. పాపము వలన దుర్నీతి (జీవితము) వలన మానవులు దేవునికి శత్రువులై ఉన్నారు. ఇటువంటి పాపులు దేవుని సమాధానము, సహవాసము పొందాలి, అంటే వారి పాపములంతరించి, వారు నీతి మంతులు కావాలి. ఆ కారణాన యేసు ప్రభువే మనకు నీతి అయినాడు. (1 కొరింథీ 1:31). ఆ ప్రభువును నీతిగా నమ్మి అంగీకరించినపుడు, ఆయన తన పరిశుద్ధ రక్తముతో వారి పాపములను కడిగి, తన నీతినే వారి కనుగ్రహించి, వారిని నీతివంతులుగా తీర్చి, దేవునితో సమాధానమును, సహవాసమును కలుగజేయుచున్నాడు.

"శాస్త్రులనీతి కంటెను, పరిసయ్యుల నీతి కంటెను, మీ నీతి అధికము కాని యెడల, మీరు పరలోక రాజ్యములో ప్రవేశింప లేరు." (మత్తయి 5 : 20) అని యేసు ప్రభువు తన్ను విశ్వసించిన వారికి సెల విచ్చాడు. శాస్త్రులు, పరిసయ్యులు అనువారు నీతిని ఒక వేషముగా ధరించిన వేషధారులు. అలాంటి వేషధారణ జీవితాన్ని జీవించిన శాస్త్రుల వలెగాక, ప్రభువు యొక్క నీతిని కలిగి జీవించు వారే నీతిమంతులు. అట్టి నీతిమంతులకు దుర్నీతితో ఏమి సాంగత్యము?

### (ii) వెలుగునకు చీకటితో ఏమి పొత్తు?

"నిజమైన వెలుగుండెను; అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నది." (యోహాను 1 : 9) అని వ్రాయబడిన ప్రకారము ఆ వెలుగు యేసు ప్రభువే. "నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండును." (యోహాను 8 : 12) అని ఆ ప్రభువు సెలవిచ్చాడు. "ఆయనలో జీవముండెను. ఆజీవము మనుష్యులకు వెలుగై యుండెను." (యోహాను 1 : 4) అని వ్రాయబడిన ప్రకారము దేవుని జీవమే మన వెలుగు. దేవుని ఆత్మ మానవ ఆత్మతో సంపర్కము చెందకపోయి నట్లయితే మానవ ఆత్మ రక్షణానుభవమును పొందలేదు. ఆరిపోయే దీపమునకు మండుచున్న అగ్ని జ్వాలను ముట్టించినపుడు, మండుచున్న జ్వాలే ముట్టించబడిన దీపములో మరియొక జ్వాలయై ప్రజ్వలించునట్లు జీవపు వెలుగైన యేసు క్రీస్తుతో వెలిగించబడిన వ్యక్తి ఆత్మలో దేవుని ఆత్మ జ్వాలయే మరియొక జ్వాలగా ప్రకాశిస్తూ



ఉంటుంది. ఆలాగ వెలిగించబడిన దినము నుండి తాను నిత్య జీవపు వెలుగు గల వాడై తిరిగి జన్మించబడిన వాడై ప్రకాశించగలడు. ఆ కారణాన "మీరు లోకమునకు వెలుగై యున్నారు." (మత్తయి 5 : 14) అని ప్రభువు తన శిష్యులకు సెలవిచ్చాడు. అనగా ఆయన విశ్వాసులే అంధకార బంధురమైన ఈ లోకమునకు వెలుగై యున్నారు. ఆలాంటి విశ్వాసులకు చీకటితో ఏమి పొత్తు?

సాతాను అంధకారశక్తి. వాడు చీకటినే ప్రేమిస్తాడు. వాడి బ్రతుకే చీకటి కాబట్టి వెలుగునకు చీకటితో ఏమి పొత్తు?

### (iii) క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము ?

బెలియాలు, అను పేరుకు మూల భాషలో "పనికిమాలిన" అని అర్ధము. ప్రాచీన నిబంధనలో పనికిమాలిన, నిష్ప్రయోజనమైన నాశనకరమైన, దుర్మార్గమైన, దైవభక్తిలేని మనుష్యులు బెలియాలు కుమారులని, కుమార్తెలని పిలువబడ్డారు.

"నీవు నివసించుటకు, నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న నీ పురములలో ఏదో యొకదాని యందు, పనికి మాలిన కొందరు మనుష్యులు నీ మధ్యలేచి, మీరు ఎరుగని యితర దేవతలను పూజింతమురండని తమ పుర నివాసులను ప్రేరేపించిరని నీవు వినినయెడల, నీవు ఆ సంగతిని శోధించి, పరీక్షించి బాగుగా విచారింపవలెను." (ద్వితీ. 13 : 12, 13) "వారు సంతోషించుచుండగా ఆ ఊరివారిలో కొందరు పోకిరులు ఆ యిల్లు చుట్టుకొని తలుపు కొట్టి – నీ యింటికి వచ్చిన మనుష్యుని మేము ఎరుగునట్లు అతని బయటికి తెమ్మని యింటి యజమానుడైన ఆ ముసలి వానితో అనగా." (న్యాయా 19 : 22) "నీ సేవకురాలైన నన్ను పనికి మాలిన దానిగా ఎంచవద్దు." (1సమూ. 1 : 16).

"ఏలీ కుమారులు యెహూవాను ఎరుగని వారై మిక్కిలి దుర్మార్గులై యుండిరి." (1సుమూ. 2 : 12)

"నీవు దేవునిని రాజును దూషించితివని అతని మీద సాక్ష్యము పలుకుటకు పనికిమాలిన యిద్దరు మనుష్యులను సిద్ధపరచుడి. తీర్పు అయిన మీదట అతని బయటికి తీసికొని పోయి, రాళ్ళతో చావగొట్టుడి." (1రాజు 21 : 10) ఈ వచనాలలో, "పనికి మాలిన మనుష్యులు" "పోకిరులు" "దుర్మార్గులు", అను

మాటలను మూలభాషలో బెలియాలు కుమారులు, కుమార్తెలని వ్రాయబడి ఉంది. కాని క్రొత్త నిబంధనలో శత్రువైన సాతాను, సకల దుర్మార్గతకు అపవిత్రతకు, పనికి మాలిన తనమునకు, కీడుకు, స్వరూపిగాన బెలియాలు అను పేరు, సాతానుకు సార్థక నామముగా వాడబడి వుంది. సాతాను క్రియలు బహు హేయమైనవి వాడు పాపములతో, అపరాధములలో మనుష్యులు మరణించు నట్లు చేస్తాడు. ప్రభువు బిడ్డలలో ఏర్పడే క్రీస్తు స్వరూపాన్ని పాడు చేయుటకు సర్వ ప్రయత్నాలు చేస్తాడు. ఆత్మలో అబద్ధం చెప్పిస్తాడు. అవినీతిని ప్రేరేపిస్తాడు. కాబట్టి క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము?

## (iv) అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది ?

అవిశ్వాసులు దేవుని యెడల మృతులు, పాపము యెడల సజీవులు. అనగా అవిశ్వాసులు తమ పాపములచేత అపరాధముల చేత చచ్చినవారు (ఎఫెసీ 2:1). దేవుని సువార్తను అవిధేయతతో తిరస్కరించువారు. అనగా అవిశ్వాసులు దేవునికి అవిధేయులు. (ఎఫెసీ 2 : 2). సత్యమును అడ్డగించువారు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములకు లోనైనవారు. వాయు మండల సంబంధమైన అపవాదికి లోబడిన జీవితము జీవించువారు. వారి చిత్తము స్వార్థముచేత ఏలబడుతుంది. అవిశ్వాసులు దేవుని విషయాలు అంగీకరింపరు. కారణం? అవి వారికి వెఱ్ఱితనముగా ఉంటాయి. వారు వాటిని గ్రహింపలేరు కూడ. ఆధ్యాత్మిక విషయాలు గ్రహించాలి అంటే ఆధ్యాత్మిక మనస్సు కావాలి. కాని అవిశ్వాసులలో దేవుని ఆత్మలేదు. అపవాది వారి మనస్సును అంధ ప్రాయంగా చేసి వేశాడు. (2 కొరింథీ 4 : 4). కాబట్టి వారు దేవునితో సరియైన సంబంధములో లేరు. వారు శరీరము యొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చు వారు. (ఎఫెసీ 2 : 3). వారు దేవునికి దూరముగా వుండువారు. దేవుని సన్నిధిలో నోరు మూయవలసిన నేరస్తులు. స్వభావ సిద్ధంగా వారు దేవుని ఉగ్రతకు, శిక్షకు లోనైనవారు. (ఎఫెసీ 2 : 2)

అవిశ్వాసుల మాటలు, క్రియలు పాము కాటు వంటివి. వీరు తమ యొద్దకు వచ్చువారిని ఆకర్షించుటకు బదులు వికర్షిస్తారు. మిత్రులను శత్రువులనుగా చేస్తారు. వీరి తలంపులు, మాటలు, క్రియలు ఒకదాని కొకటి పొసగక, బహు కలవరమును, అసమ్మతిని, ద్వేషమును రేపుతవి. తమ్మును ఆశ్రయించి వారి



గాయములను కట్టుటకు బదులు వాటిని రేపుతారు. స్నేహ భావముతో వచ్చిన వారిని శత్రుత్వముతో నింపి పంపుతారు. సదభిమానముతో వచ్చినవారిని, దురభిమానముతో నింపి పంపుతారు. ఆశతో ఆశ్రయించినవారిని నిరాశలో ముంచి వేస్తారు. అహంకారము, గర్వము, డంబము, తిరస్కారము, తగిన దానికంటే ఎక్కువగా ఎంచుకోవటం, అధిక ప్రసంగము, విద్యా గర్వము, కులగర్వము, కుటుంబ గర్వము, రంగు గర్వము, ఉద్యోగ గర్వము – యిలాంటి సాతానీయమైన లక్షణాలు వారు కలిగి వుంటారు. కాబట్టి అవిశ్వాసితో విశ్వాసి సహవసించరాదు.

## (V) దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక ?

యేసు ప్రభువును ఎరిగిన విశ్వాసులు జీవముగల దేవుని సంతానమై ఉన్నారు. (రోమా 9 : 26). వారి శరీరాలు జీవముగల దేవుని ఆలయమై ఉన్నాయి. (1 కొరింథీ 6 : 19) వారి సమాజము జీవముగల దేవుని సంఘమని పిలువబడుతోంది. (1 తిమోతి 3 : 15) దేవుడు వారి కొరకు ఒక పట్టణాన్ని సిద్ధపరుస్తున్నాడు. దానికి జీవముగల దేవుని పట్టణము అని పేరు (హెబ్రీ 12 : 22). విశ్వాసులుకలిగిన నిరీక్షణ జీవముతో కూడిన నిరీక్షణ (1 పేతురు 1 : 3). కాబట్టి అట్టి విశ్వాసులకు జీవములేని విగ్రహములతో ఏమి పొందిక? (దా.కీ. 115 : 4-8)

"కావున వారి మధ్య నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి." (2 కొరింథీ 6 : 18) అని విశ్వాసులు హెచ్చరింపబడియున్నారు. వాస్తవమునకు, ప్రత్యేక జీవితమే ఫలభరితమైన జీవితము. భూమి ఫలభరితమైన స్థితిలోనికి రాకపూర్వం, సృష్టికర్తయైన దేవుడు చీకటిని వెలుగును, విశాలము క్రింది జలములను, విశాలము మీది జలములను, భూమిని, సముద్ర జలరాశులను వేరుచేశాడు. అలాగే, అబ్రహాము తన జీవితములో ఫలభరితుడు కాక పూర్వం లోకమునకు సాదృశ్యమైన లోతు అను వ్యక్తినుండి ప్రత్యేకించబడవలసి వచ్చింది. (ఆ.కా. 13 : 14). యోసేపు ఐగుప్తులో "ఊట యొద్ద ఫలించెడు కొమ్మ" కాక పూర్వము, దుష్టులైన తన సహోదరుల నుండి సంపూర్ణముగా ప్రత్యేకింపబడుట అవసరమై వుండెను.

ఇశ్రాయేలీయుల చరిత్ర చూచినట్లయితే, వారు ఎంత కాలము అవిశ్వాసులతో విజ్ఞోడుగా వుండక, ప్రత్యేక జీవితాన్ని జీవించిరో, అంత కాలము దేవుడు వారిని ఘనపరచి పై వారినిగా వుంచాడు. లోకములో ఎవ్వరికి లేని ఘనత వారికి దొరికింది. కాబట్టి ప్రత్యేక జీవితమే ఫలవంతమైన జీవితము.

## 4. అన్యస్త్రీలతో సహవసించరాదు.

సమ్సోను ఇశ్రాయేలీయుల న్యాయాధిపతులలో ఒక ప్రాముఖ్యుడు, బలాఢ్యుడు, ఆత్మ శక్తిగలవాడు. ఇంత గొప్ప వ్యక్తి, గ్రుడ్డివాడై, శత్రువుల చేతిలో బంధితుడు కావటానికి అన్యురాలైన దెలీలాతోటి సాంగత్యమే. (న్యాయా.16) అలాగే మహాజ్ఞానియైన సొలొమోను మహారాజు యొక్క పతన జీవితమునకు కారణం? నిర్దేవులు, అవిశ్వాసులైన భార్యలే. (1 రాజులు 11:1-8). క్రీస్తు నామాన్ని ధరించిన కుటుంబాలలో సహితము కోర్టు కేసులు, విడాకులు, దారుణ హింసాకాండలు, ఆత్మ హత్యలు – ఈలాంటి భయంకర సంఘటనలకు కారణం? విశ్వాసులకు అవిశ్వాసుల తోటి సంబంధమే. కాబట్టి విశ్వాసులైన తల్లిదండ్రులు ప్రభువును ఎరిగిన తమ బిడ్డలకు, రక్షణానుభవము గలవారినే జీవిత పాలి భాగస్తులనుగా చెయ్యాలి. ఆలస్యమైనా ఫరవాలేదు. జవాబు దొరుకు నంతగా ప్రభువును ప్రార్థించి, ఆయన చిత్తాన్ని ఎరిగిన తరువాతే, వివాహ విషయమున ముందుకు సాగాలి. దేవుని చేత ఏర్పరచబడిన జంట నిజముగా బంగారు పంటై తమ ఆధ్యాత్మిక జీవితములో, అరువదంతలు, నూరంతలుగ ఫలించి దేవుని మహిమ పరచగలరు.

ఏది పాపమో ఏది ప్రాపంచికమో, ఏది శారీరకమో, ఏది నామకార్థమో, అలాంటి వాటిని, అలాంటి వారిని, విడిచి వెలుపలికి వచ్చినట్లయితే మనము ఫలింపగలము. ప్రభువును వెంబడిస్తూ, అక్రమాలలో, అక్రమస్తుల కార్యక్రమాలలో పాలు పొంద వీలు కాదు. ఈ దినాలలో ప్రభువును ఎరిగినామని చెప్పుకొనుచు, ఒకరినొకరు అమ్మివేసికొంటూ, ఒకరి పేరును ఒకరు చెరిపివేసి కొంటూ, పరమ తండ్రి యొక్క దయార్ద్ర సహృదయాన్ని గాయపరచువారు ఎందరో వున్నారు. ఎంత సిగ్గుకరము! ఎంత పరితాపకరము!

పాపాత్ములమైన మన నిమిత్తము ప్రభువైన యేసు హెబ్రోనుగా కాగొరి,



అనగా తన సహవాసములోనికి మనల్ని పిలువనుద్దేశించి, ఈ లోకమునకు నరుడుగా వచ్చాడు. పరలోకములో అసంఖ్యాకములైన దేవదూతలను విసర్జించాడు. భూలోకములో యూదులవలన, అన్యుల వలన, ఆనాటి రోమా ప్రభుత్వమువలన, తన స్వంత శిష్యులవలన విసర్జించ బడి, ఏ స్నేహితుడు లేని వాడుగా, దిక్కులేని వాడుగా, చివరకి తాత్కాలికంగా తండ్రివలన గూడ విసర్జించబడి "ఏలీ, ఏలీ, లామా సబక్తాని" (మత్తయి 27 : 46) అని బిగ్గరగా కేకవేసి ఆ ఘోర సిలువలో మరణించాడు. ఎంత ఆశ్చర్యం!

## ఐదవ అధ్యాయము

## బేసెరు

బేసెరు అనుమాటకు హెబ్రీ భాషలో 'దండు బలము' లేక 'శక్తి' (MUNITION, ARMAMENT) అని అర్థము. ఇట్టి అర్థమిచ్చు బేసెరు యేసు క్రిస్తునే సూచిస్తుంది. అకారణాన, "క్రీస్తు దేవుని శక్తియై యున్నాడు." (1 కొరింథీ 1:24) అని వ్రాయబడి వుంది. ఒక వ్యక్తి బేసెరు అను ఆశ్రయపురములోనికి పరుగెత్తుట అనగా దేవుని బలమును లేక శక్తిని పొందుటకు యేసు ప్రభువు నొద్దకు పరుగెత్తుట అని అర్థము.

స్వభావ రీత్యా మానవులమైన మనమందరము బలహీనులమే. శారీరకముగ, మానసికముగ, ఆధ్యాత్మికముగ అనేక విషయాలలో మనము బలహీనులమై యున్నాము. ఏ పనిలోనైనను కొంత సేపటికే అలసి పోతాము. ఏ పని చేయకుండానే అలసి పోయే సోమరులు కూడ లేకపోలేదు.

అలాగే మన మనస్సు పాపములచేత శక్తిహీనమై పోయింది. జీవితములో దుర్నీతి, పాపము వున్నందున చూచిన ప్రతి దానిమీద మనస్సు ప్రాకులాడుతుంది. దాని మీద కొంత మనస్సు దీని మీద కొంతమనస్సు, యింకొక దాని మీద మరి కొంత మనస్సు, మరొక దాని మీద యింక కొంతమనస్సు, ఈ విధంగా ప్రకృతి సంబంధమైన లక్షలాది వాటి మీద మనస్సు విభజింపబడిపోయిన కారణాన మన మనస్సు బహుగా బలహీనమై పోయింది. మనము కని, విని ఎరిగిన వాటిని జ్ఞాపకముంచు కొనుటకు ఎంతో ప్రయాస పడుతాము. "నేను మొదటి

తరగతిలోనే ఐదు పర్యాయాలు ఫెయిల్ అయ్యాను." అని సాహసించి బహిరంగముగా సాక్ష్యమిచ్చిన ఒక బోధకుని నేను ఎరుగుదును. దీనిని బట్టి మానసికముగా మనము ఎంత బలహీనులమో గ్రహించగలము. మన తలంపులు, మాటలు, క్రియలు కూడా బలహీనములైనవి.

మనము శారీరకముగ, మానసికముగ మాత్రమే గాక ఆధ్యాత్మికముగా కూడ ఎంతో బలహీనులమై వున్నాము. మనము మన ఆధ్యాత్మిక జీవితము నందు ఉన్నత పర్వత శిఖరానుభవమునకు ఎక్కి వెళ్ళవలసిన వారము, కాని మనము ఆత్మీయమైన అంధకార లోయల యందు తడవులాడుచు తొట్రు పడుచున్నాము. అనగా మన ఆధ్యాత్మిక జీవితములో మనమెంతో బలహీనులమై వున్నాము. అందువల్ల బలహీనత మానవుని స్వభావ లక్షణమని చెప్పవచ్చు.

మనము బలహీనులమైన యెడల యేమియు చేయలేము. ఆయా పని పాటలకు బలము అవసరము. అలాగే ఆధ్యాత్మిక పనిపాటలకు ఆధ్యాత్మిక బలము అవసరము. దేవుని స్వరాన్ని వినునంతమట్టుకు పరిశుద్ధ బైబిలు గ్రంథాన్ని చదువుటకు ఆధ్యాత్మిక బలము అవసరము. జవాబులు పొందునంతగా పట్టుదలతో ప్రార్థించుటకు ఆధ్యాత్మిక బలము అవసరము. పాపులు రక్షింపబడునంతగా సాక్ష్యమిచ్చుటకు ఆధ్యాత్మిక బలము అవసరము. దేవుని దయార్థ్ర హృదయానికి శాశ్వతంగా సంతోష సంతృప్తులు లభించునంత మట్టుకు, ఆయన సర్వోన్నతమైన నామమునకు అనంత మహిమ కలుగునంతమట్టుకు ఆరాధించిస్తుతించుటకు, ఆధ్యాత్మిక బలము అవసరము. పరిశుద్ధమైన, విజయవంతమైన జీవితమును జీవించుటకు ఆధ్యాత్మిక బలము అవసరము. "క్రీస్తు దేవుని శక్తియై యున్నాడు." అని వ్రాయబడిన ప్రకారము బలహీనులమైన మనల్ని బలపరచుటకు యేసుక్రీస్తు దేవుని శక్తియై యున్నాడు. ఇట్టి శక్తిమంతుని ద్వారా ప్రాముఖ్యంగా ఎనిమిది విధములైన దైవశక్తులను విశ్వాసముతో మనము సార్థకము చేసికొనవచ్చును.

1. వాక్య శక్తి (హెబ్రీ 4 : 12)
2. సిలువ శక్తి (1 కొరింథీ 1 : 18)
3. పునరుత్థాన శక్తి (ఫిలిప్పీ 3 : 10, 11)
4. పరిశుద్ధాత్మ శక్తి (అపొ.కా. 1:8)



5. ప్రభువును ఎరుగుటలో శక్తి (దానియేలు. 11 : 32)
6. ప్రభువు కొరకు ఎదురు చూచుట వలన కలుగు శక్తి (యెషయా 40 : 31)
7. ప్రభువు నందు ఆనందించుట వలన కలుగు శక్తి (నెహెమ్యా 8 : 10)
8. రక్త శక్తి (ప్రకటన 12 : 11)

ఈ ఎనిమిది శక్తులను గురించి క్లుప్తంగా తెలిసికోవట, ఎంతైనా మంచిది.

## 1. వాక్య శక్తి

"దేవుని వాక్యము సజీవమై, బలము గలదై రెండంచులు గల యెటు వంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగును, విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది." (హెబ్రీ 4 : 12) "ఆయన నోట నుండి రెండంచులు గల వాడియైన ఖడ్గమొకటి బయలు వెడలు చుండెను" (ప్రకటన 1 :16) అని వ్రాయబడి వుంది. అనగా ప్రభువు నోటినుండి బయలు వెడలు చుండిన రెండంచులు గల వాడియైన ఖడ్గము ఆయన నోటినుండి వచ్చు వాక్యమే. ఆయన వాక్య ఖడ్గమునకు రెండంచులున్నాయి. ఆ వాక్యము కొందరిని ఛేదిస్తుంది. ఇది ఒక అంచు, ఆ వాక్యము మరి కొందరిని ఆదరిస్తుంది. ఇది మరొక అంచు. ఆ ఖడ్గమునకు అడ్డము లేదు. సమస్తమును జయించగలదు.

మనము అవిశ్వాసులముగా ఉన్నప్పుడు ఆధ్యాత్మిక పోరాటమనగా ఏమో ఎరుగని వారము. సాతాను నెదిరించుట అనగా ఏమిటో ఎరుగని వారము. దుష్టుని యొక్క అగ్ని బాణముల ధాటికి అదరిపోయిన వారము. అటువంటి మనల్ని ప్రభువు రక్షించి తన వాక్య ఖడ్గమును మనకు ధరింపజేసి యున్నాడు. ఈ వాక్య ఖడ్గమును మనము చేబూని, దానిని శత్రువుపై ప్రయోగించవలసి యున్నాము. అప్పుడే సాతాను మీదను, వాని అనుచరుల మీదను, దురాత్మల సమూహాముపైనను మనకు జయము లభిస్తుంది. శత్రువైన సాతాను యేసుప్రభువును శోధించినప్పుడు, ఆయన తన వాక్య ఖడ్గమును శత్రువుపై ప్రయోగించి వానిని ఓడించాడు. బాహ్య శత్రువులను కూడ దునుమాడునదీ వాక్య ఖడ్గమే.

ఈ లోక సంబంధమైన ఖడ్గము మానవ శరీరాన్ని మాత్రమే ఛేదించగలదు. కాని ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యము మానవ హృదయాన్ని ఛేదించగలదు. గెత్సేమనె తోటలో పేతురు లోక సంబంధమైన ఖడ్గమును ప్రధాన యాజకుని దాసునిపై ప్రయోగించి విఫలుడయ్యాడు. (మత్తయి 26:51-53). కాని పెంతెకొస్తు నాడు ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యము లోక సంబంధమైన తన కత్తి కంటే శక్తివంతమైన కార్యమును నెరవేర్చగలదని గ్రహించాడు. పెంతెకోస్తునాడు పేతురు చేసిన వాక్యోప దేశమును విన్నవారు తమ హృదయాలలో పొడవ బడినవారై, 'సహోదరులారా! మేమేమి చేతుము?' అని అడిగారు. ఆ దినము షుమారు మూడువేలమంది ప్రభువునందు విశ్వాసముంచి రక్షణ పొందారు. (అపొ.కా 2 : 37-41). కనుక శరీర సంబంధమైన ఖడ్గము శరీరాన్ని మాత్రమే పొడువగలదు. కాని దేవుని వాక్య ఖడ్గము మానవ హృదయాంతరంగమును పొడిచి ఛేదిస్తుంది. ఈ లోక సంబంధమైన ఖడ్గమును వాడే కొలది అది మొద్దుబారి పోతుంది. కాని ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యమును వాడే కొలది అది పదును గలదై మన జీవితమందు ప్రకాశిస్తుంది. శరీర సంబంధమైన ఖడ్గము మనిషిని గాయపరచి చివరికి ప్రాణాన్ని తీస్తుంది. కాని దేవుని వాక్య ఖడ్గము మనిషిని స్వస్థపరచి జీవాన్ని పోస్తుంది. కాబట్టి వాక్యము దేవుని శక్తియై వుంది. పరిశుద్ధ గ్రంథములోని వాక్యమునకు, సజీవ వాక్యమైన క్రీస్తు ప్రభువు ఆధారమై యున్నాడు. (యోహాను 1 : 1,2)

## 2. సిలువ శక్తి

"సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1కొరింథీ 1:18) అని వ్రాయబడి వుంది. సిలువలో రెండు కర్రలు కన్పిస్తున్నాయి. ఒకటి నిలువు కర్ర, మరొకటి అడ్డుకర్ర. ఆ నిలువు కర్రను, ఆ అడ్డు కర్రను ఆత్మ దృష్టితో ధ్యానించినట్లయితే, ఆ కర్రలే మనతో మాట్లాడి అమూల్యములైన సత్యములను స్పష్ట పరుస్తాయి. నిలువు కర్ర దేవుని ధర్మ శాస్త్రమును, అడ్డు కర్ర దేవుని కృపను సూచిస్తున్నాయి. "నీ ధర్మ శాస్త్రము కేవలము సత్యము." (దా.కీ. 119 : 142) అని వ్రాయబడిన ప్రకారము దేవుని ధర్మ శాస్త్రమనగా, సత్యము. ఇది పాపియొక్క పాపమును బహిరంగపరచి, దాని భయంకరత్వమును తెలియజేసి, "పాపిని సహించరాదు.



వానిని క్షమించకూడదు. వెంటనే పాపిని చీల్చి చెండాడి వాని రక్తమును ఒలికించి నశింపజేయాలి." అని గర్జిస్తూ ఉంటుంది. కాని దేవుని కృపయైతే పాపిని రక్షించమని ప్రాధేయపడుతుంది. ఇట్టి కృపా ప్రాధేయతను సత్య గర్జనను సమ్మతి పరచుటకే యేసు ప్రభువు కృపాసత్య సంపూర్ణుడుగా ఈ లోకమునకు వచ్చాడు. (యోహాను 1 : 14) అనగా ధర్మ శాస్త్రమును నెరవేర్చుటకు నిలువు కర్రను, పాపులను రక్షించుటకు అడ్డు కర్రను ఆ ప్రభువు చేపట్టాడు. సిలువలో దేవుని ధర్మ శాస్త్రమును, దేవుని కృపను చూడగలము. సిలువలో నిలువు కర్ర, అడ్డు కర్ర ఒకదానినొకటి కలుసుకొన్నాయి. ఆ కారణాన, "కృపాసత్యములు కలుసుకొనినవి. నీతి సమాధానములు ఒకదానినొకటి ముద్దు పెట్టుకొనినవి". (దా.కీ.85:10) అని వ్రాయబడివుంది. సిలువలో దేవుని ధర్మ శాస్త్రమును, దేవుని కృపను కలిపిన వాడు యేసు ప్రభువే. సిలువలో ధర్మశాస్త్రవాదన ప్రకారము పాపమునకు శిక్ష విధించబడింది. ఆ శిక్ష సిలువలో మన కొరకు బలియైన దేవుని గొర్రె పిల్లపై బడింది. మన ప్రభువే ఆ శిక్షను అనుభవించాడు. సిలువలో కృపావాదన ప్రకారము పాపికి రక్షణ సమకూర్చబడింది. కాబట్టి యేసు ప్రభువు నందు విశ్వాసముంచువారు నశింపక నిత్య జీవమును పొందుచున్నారు.

నరుని పాపము వలన, నరునికి దేవునితో ఎడబాటు, అసమ్మతి, కలవరము కలిగింది. కాని యేసు క్రీస్తు యొక్క సిలువ శక్తి వలన ఆయన యందు విశ్వసించు వారికి దేవునితో సామీప్యత, స్నేహము, శాంతి లభించింది. యూదులను, అన్యులను, ప్రాగ్ దేశస్తులను, పాశ్చాత్య దేశస్తులను, ధనికులను, దరిద్రులను, విజ్ఞాన సంపన్నులను, విద్యలేని వారిని, అధమాధముడైన మానవుని సర్వోన్నతుడైన దేవుని, ఏకము చేసినది యేసు ప్రభుని సిలువ శక్తే. ఆ కారణాన, "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱి తనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి అని వ్రాయబడి ఉంది. సిలువను గూర్చిన వార్తను మనము గ్రహించాలి అంటే, యే పాపమెరుగని ఆ పావనుడు, ఆ ఘోర సిలువలో, మనకొరకై పొందిన అవమానమును, నిందలను ఆధ్యాత్మిక వేదనలను, మానసిక బాధలను, శరీర శ్రమలను, గాయములను, ఆ గాయముల నుండి ప్రవహించిన రక్తధారలను, ఆ సిలువ యందు ఆ కృపాసాగరుడు పలికిన ఆ యేడు మాటలను; ఆయన మరణమును క్షుణ్ణంగా ధ్యానించవలసి యున్నాము.

## 3. పునరుత్థాన శక్తి

లేఖనముల ప్రకారము ప్రభువైన యేసు క్రీస్తు పాపులమైన మనకొరకు సిలువలో మరణించి, సమాధి చేయబడి, మూడవనాడు సమాధినుండి పునరుత్థాన ప్రభావముతో లేక శక్తితో తిరిగి లేచాడు.

పునరుత్థాన ప్రభావమనగా ఏమిటి? సృష్టికర్తయైన దేవుడు సముద్ర జలరాసులలో మునిగిపోయి వుండిన భూగోళమును ఆరిన నేలగా పైకి తీసినప్పుడు ప్రత్యక్షమైన ప్రభావము, పునరుత్థాన ప్రభావమే. (ఆ.కా. 1 : 9,10) మృతులలో నుండి యేసు ప్రభువు చేత లేపబడిన లాజరు ప్రభువు యొక్క పునరుత్థాన శక్తికి సాదృశ్యమై యున్నాడు. (యోహాను 11 : 43) సర్వలోకములో విత్తబడి, మరణించి, మొలకెత్తునటువంటి ప్రతి మొలక పునరుత్థాన శక్తిని మనకు జ్ఞాపకము చేస్తుంది. అంధకారమునుండి కలిగించబడిన వెలుగు కీడులోనుండి పుట్టుచున్న మేలు, దుఃఖములో నుండి కలుగు ఆనందము, నిరాశలోనుండి కలుగు నిరీక్షణ, మరణములో నుండి కలుగు జీవము ఇవన్నియు పునరుత్థాన శక్తికి సాదృశ్యములే. ఈ పునరుత్థాన శక్తి "నేనే పునరుత్థానమును, జీవమునైయున్నాను. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును." (యోహాను 11 : 25) అని సెలవిచ్చిన యేసు ప్రభువు యొక్క కృపాదానమై వుంది. ఈ పునరుత్థాన శక్తిని మనకు ప్రసాదించుటకే మన ప్రభువు యూదా జనాంగమును, రోమా ప్రభుత్వమును, అన్యజనాంగమును, పాపమును, శాపమును, మరణమును, సమాధి బండను, దానిపైవున్న ముద్రను, కావలిని, సమాధిని, పాతాళమును జయించి, జయవీరుడై మహా మహిమతో సమాధి నుండి లేచాడు. కాబట్టి పునరుత్థాన బలము చేతనే మనము జయజీవితమును జీవించగలము. అనగా మనలో పునరుత్థాన బలము సార్థకముగుట ద్వారా మనకు ఆటంకములై పనికిరాని సమస్తము ఎండిన ఆకులవలె రాలిపోతాయి. ఆ కారణాన, "ఏవిధము చేతనైనను ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను." (ఫిలిప్పీ 3 : 10,11) అని విద్యాసంపన్నుడును, దైవజనుడైన పౌలు అన్నాడు. అనగా ఒకడు తనకు కలిగిన సమస్తము కంటే, పునరుత్థాన బలము ఎంతో, అధికమనియు, సమస్తమును



సంపాదించుకొని, పునరుత్థాన బలమును పొందకున్నట్లయితే అది వానికి నష్టమనియు, పునరుత్థాన శక్తి ముందు సమస్తమును పెంటతో సమానమనియు భావము.

భవిష్యత్తులో ఈ ప్రపంచము రెండు పునరుత్థానములను చూడనైయుంది. పునరుత్థాన ప్రభువైన యేసు క్రీస్తు తన్ను నమ్మిన విశ్వాసులను పరలోకమునకు తీసికొని వెళ్ళుటకు మేఘారూఢుడై వచ్చునప్పుడు, దేవుని లేఖనముల ప్రకారము, క్రీస్తునందు మృతులు, అనగా యేసు ప్రభువు నందు విశ్వాసముంచి మరణించి సమాధిలో వుంచబడిన వారు మొదట లేస్తారు. ఆ మీదట సజీవులై యుండు ఆయన విశ్వాసులు రెప్ప పాటులో మార్పు చెంది, వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుతారు. దీనినే మొదటి పునరుత్థానమని పరిశుద్ధ గ్రంథము చెబుతోంది.

ఆ తరువాత సమస్త జనులకు తీర్పు తీర్చుటకు రారాజుగాను ప్రభువుల ప్రభువుగాను యేసు ప్రభువు రానై యున్నాడు. సృష్టి ఆరంభము నుండి అప్పటివరకు మరణించిన వారందరు తిరిగి లేస్తారు. అనగా అడవులలో దుష్టమృగముల వలన చీల్చబడినవారేమి, సముద్రములో, తిమింగళ గర్భములో జీర్ణమైపోయిన వారేమి, పాతిపెట్టబడి మంటికి మన్నై పోయిన వారేమి, దహించబడి, భస్మమై పోయినవారేమి అందరూ దేవుని వాక్యము ప్రకారము తిరిగి బ్రతుకుతారు. ఇది రెండవ పునరుత్థానము. "సముద్రమును పాతాళమును వాటి వశమున నున్న మృతులను అప్పగించెను." (ప్రకటన 20 : 12) అను లేఖన భాగము అప్పుడు నెరవేరుతుంది. ఆ తరువాత అంత్య తీర్పు జరుగనైవుంది.

## 4. పరిశుద్ధాత్మ శక్తి

పరిశుద్ధాత్మ త్రిత్వములోని ఒక వ్యక్తియై యున్నాడు. కాని ఆయా సమయములందు, ఆయా సాదృశ్యముల ద్వారా ఆయన తన్ను ప్రత్యక్ష పరచుకొని దేవుని మహత్తరమైన శక్తిని మానవ మాత్రులకు కనబరచాడు.

పునరుత్థాన ప్రభావశాలియైన యేసు ప్రభువు పరలోకమునకు ఆరోహణమగు సమయాన "పరిశుద్ధాత్మ మీమీదకి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు." (అపో.కా. 1 : 8) అని తన శిష్యులకు సెలవిచ్చాడు. ఆ ప్రకారమే పెంతెకొస్తు

పండుగనాడు, మేడగదిలో అందరూ కూడియుండగా అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా పరిశుద్ధాత్మ వారి మీదికి దిగి వచ్చాడు. (అపొ.కా. 2 : 3) అనగా పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ, అగ్నివలె, గాలివలె, తన్ను ప్రత్యక్ష పరచుకున్నాడు. అగ్ని, గాలి – ఈ రెండు బలమైన ప్రాకృత శక్తులు పెంతెకొస్తు రోజున జతచేయబడ్డాయి. అగ్ని నుండి అగ్ని ఉద్భవిల్లుతుంది. అనగా, అగ్ని మాత్రమే అగ్నిని పుట్టించగలదు. ఇంధనములు తగలగానే అగ్ని రాజుకుంటుంది. కొలిమిలో నుండి వచ్చే ఒక్క నిప్పురవ్వ గాలి సహాయముతో ఒక పట్టణాన్నంతా దహించి వేయగలదు. ఒక్క క్రొవ్వొత్తితో వెయ్యింటికి పైగా వెలిగించవచ్చు. పెంతెకొస్తు నాడు మేడగదిలో కూర్చొని వున్న ప్రభువు శిష్యులపై, అగ్నిరూపాన పరిశుద్ధాత్మ వచ్చి వారిని రగిలించాడు. వారు మండుచున్న కొలిమిలాగా మారిపొయ్యారు. వారి హృదయవేదికలలో నుండి నిప్పురవ్వలు పైకి లేచాయి. దానికి తోడు పరిశుద్ధాత్మ గాలి వీచింది. దాంతో ఆ నిప్పు కణములు మేడగదిని నింపివేశాయి. అగ్ని, గాలి – ఈ రెండింటి ప్రభావము చేత మేడగదిలోని వాతావరణము అమోఘంగా శక్తి భరితమైంది. అప్పుడు ఆత్మావేశముతో అగ్ని వలె మండుచున్న పేతురు లేచి నిలువబడి, అధికారముతో దేవుని శక్తి గల మాటలను, అక్కడ కూడియున్న వారికి బోధించాడు. పేతురు ప్రసంగమును విన్న ప్రజలు తమ హృదయాలలో గుచ్చబడినవారై, దాదాపు మూడువేల మంది ఆ దినము యేసు ప్రభువును తమ రక్షకునిగా అంగీకరించి ఆదిమ సంఘములో చేర్చబడ్డారు. ఈ విధంగా ఆదిమ సంఘము అగ్నిలో జన్మించింది. అగ్ని వలననే జీవించింది. అగ్ని ప్రభావము చేతనే, అపవాదిని, పాపమును జయించి లోకమునే తల క్రిందులుగా చేసింది. మనము కూడ క్రీస్తు ప్రభుని రక్తముతోను, దేవుని వాక్యోదకముతోను కడుగబడుట మాత్రమే గాక, దేవుని పరిశుద్ధాత్మాగ్నితో కణకణ మండుచు, ధగధగ మెరయుచు శక్తివంతులమై యుండుట దేవుని అనంతమైన ఉద్ధేశ్యమైవుంది. ఆ కారణాన "ఆత్మపూర్ణులై యుండుడి." (ఎఫెసీ 5 : 18) అని హెచ్చరింపబడి యున్నాము.

మండుచున్న కొరివిని అగ్నిలో నుండి తీసిన పక్షాన అది బహుత్వరగా ఆరిపోగలదు. అలాగే, పరిశుద్ధాత్మాగ్నిలోను, పరిశుద్ధాత్మాగ్నితోను జీవించవలసిన విశ్వాసి, పరిశుద్ధాత్మాగ్ని నుండి తీసివేయబడిన పక్షాన, ఆధ్యాత్మికముగా చల్లారిపోగలడు.



పరిశుద్ధాత్మ శక్తివలన, పరిశుద్ధ జీవితమును జీవించి, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము (గలతీ 5 : 22,23) అను పరిశుద్ధాత్మ ఫలములను ఫలించగలము. మరియు పరిశుద్ధాత్మ శక్తి వలననే శక్తివంతమైన, విజయవంతమైన జీవితమును జీవించగలము. ఈ పరిశుద్ధాత్మ, "నేను మీతో సత్యమునే చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనము.....నేను వెళ్ళిన యెడల పరిశుద్ధాత్మను మీ యొద్దకు పంపుదును." (యోహాను 16 : 7) అని పల్కిన యేసు ప్రభువు యొక్క కృపాదానమై వుంది.

మనము ఆత్మానుసారముగా నడువ వలసియున్నాము. (గలతీ 5 : 16) (WALK) ఆత్మానుసారముగా ఆరాధించవలసియున్నాము, (ఫిలిప్పీ 3 :3)(WORSHIP), మరియు ఆత్మానుసారముగా సాక్ష్యమివ్వవలసియున్నాము. (అపొ.కా. 1 : 8) (WITNESS)

## 5. ప్రభువును ఎరుగుటలో శక్తి

"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు." (దానియేలు 11:32) అని వ్రాయబడివుంది. అనగా దేవుని ఎరుగుట దేవుని శక్తియైవుంది.

నాస్థికులు దేవుడు లేడని వాదిస్తారు. కాని, "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు." (దా.కీ. 14:1) అని దేవుని గ్రంథం ఘోషించి చెబుతుంది. దేవుడు లేడని వాదించు నాస్థికుడు ప్రకృతి సంబంధి. ఈ ప్రకృతి సంబంది, అవిశ్వాసి, దేవునికి భయపడనివాడు. సత్యమును అడ్డగించువాడు. దేవుని సువార్తను అవిధేయతతో తిరస్కరించువాడు. దేవుని శిక్షకు లోనైనవాడు, నిర్దేవుడు. వాని మనస్సు, ఆలోచన మాట – యివన్నీ కూడ దేవునికి విరోధమైనవే. ఈ యుగ సంబంధమైన దేవత, వాని మనస్సును అంధప్రాయంగా చేసివేశాడు. వాని అంతరంగము దేవుడు లేని కారణాన శిథిలమై పోయింది. కాని దేవుని ఎరిగినవారి అంతరంగము దేవుని మందిరమై ఉంది. ఆ మందిరములో జీవముగల దేవుని ఆత్మ నివసిస్తుంది. దేవుని ఎరిగిన వారు, దేవుని నిజముగా విశ్వసించినవారు. వారి విశ్వాసము సజీవమైనది. అది క్రియలు

చేయగలది. అది సమస్తమును జయించగలది. అది చీకటిని వెలుగుగాను, బలహీనుని బలాఢ్యుని గాను మార్చి వేయ మహత్తర శక్తిగలది.

ప్రవక్తయైన యెషయా, యేసు ప్రభువును, "బలవంతుడైన దేవుడు" (యెషయా 9 : 6) అని తెలియజేశాడు. "నేను సర్వ శక్తి గల దేవుడను." (ఆ.కా.17 : 1) అని ఆ ప్రభువు అబ్రహాముకు తెలియజేశాడు. ఇట్టి బలవంతుని యొక్క బలము, శక్తి ఆయన కలుగజేసిన సృష్టిలో గోచరమవుతుంది. ఆ కారణాన ప్రాచీన నిబంధనలోని వ్యక్తులు, దేవుని శక్తిని దేవుని సృష్టితో కొలిచేవారు. (యెషయా 40 : 12-27) ఉదయ నక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు, దేవుని కుమారులు, దేవుని దూతలందరూ ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు, భూమికి మూలరాతిని వేసినది ఆయన ప్రభావమే. ఆకాశవిశలమును తెరవలె విశాలపరచి ఆ విశాల తెరపై అసంఖ్యాకములైన విచిత్ర నక్షత్రరాసులను చిలకరించినది ఆయన ప్రభావమే. ఆధ్యాత్మికమైన, ప్రకృతి సంబంధమైన సార్వత్రిక సృష్టి సమూహములకు ప్రధాన శిల్పి ఆయనే మన్నును మానవునిగను, ప్రక్కటేముకను స్త్రీనిగను మార్చినది ఆయన శక్తియే.

ప్రభువు తాను కలుగజేసిన సృష్టిలోనే గాక, ఆయన జన్మలో కూడా, తన శక్తిని ప్రత్యక్షపరిచాడు. ఆయన జన్మించగానే పరమండలము తెరువబడింది. దేవుని దూతలు కనుపించి పాటలు పాడి, శుభవార్తను చాటించారు. దేవుని మహిమ ప్రకాశించి, మహిమా స్వరూపియై జన్మించిన ప్రభువును సూచించింది. వెంటనే వింతయైన తార ఒకటి గగనమందు తారసిల్లి, తూర్పుదేశ జ్ఞానుల గమనాన్ని ఆకర్షించింది. వారు ఒంటెలపై వచ్చి హేరోదు రాజు వాకిట నిలచి "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ వున్నాడు?" అని విచారించగా, రాజు హృదయము భయాందోళనలతో కంపించింది. రాజుతో బాటు యెరూషలేము నగరమంతా కలత చెందింది. తూర్పుదేశపు జ్ఞానులు ఆ ప్రభువును వెదకి, కనుగొని ఆయన యెదుట సాగిలపడి, ఆయన్ని ఆరాధించారు. ఇక ఆయన జీవితము, సేవ, అద్భుతములు సమస్తమూ శక్తి గలవే.

ఆ ప్రభువు తన జీవితములోనేగాక, తన మరణ, పునరుత్థానములో కూడా, తన శక్తిని ప్రభావాన్ని ప్రత్యక్షపరిచాడు. ఆయన మరణించినపుడు యెరూషలేము



దేవాలయపు అడ్డుతెర నిలువున చిరిగింది. భూమి కంపించింది. సమాధులు తెరువబడ్డాయి. మృతులు సజీవులై, సమాధులలో నుండి లేచి పట్టణములో కనిపించారు.

ఆయన మరణించి, సమాధి చేయబడిన తరువాత, అనగా మూడవనాడు, మరణాన్ని, సమాధిబండను, దానిపై వున్న ముద్రను, కావలిని, సమాధిని, పాతాళమును, దురాత్మలను, దుష్టశక్తులను, అపవాదిని, సమస్తాన్ని జయించి, జయవీరుడై, ఆదివారము తెల్లవారుజామున మహా మహిమతో తిరిగి లేచాడు. ఇట్టి శక్తివంతుని ఎరుగువారు నిజముగా బలవంతులే. అట్టివారు గొప్ప కార్యములను చేయుటకు సామర్థ్యము కలవారు, అట్టివారు భూలోకమందు వేటిని బంధింతురో అవి పరలోకమందు కూడ బంధించబడుతవి. అట్టివారు భూలోకమందు దేనిని విప్పుదురో అది పరలోకమందు కూడ విప్పబడుతుంది. దేవునియొక్క మహాశక్తి వారి హస్త గతమౌతుంది. దేవుని యొక్క విజయము వారిదే. అట్టివారు, అవసరమైతే, మోషేవలె గాలిని సముద్రమును బంధించగలరు. యెహోషువ వలె సూర్యచంద్రా దులను ఆపగలరు. షద్రకు, మేషాకు, అబేద్నెగోల వలె అగ్ని గుండములో హాయిగా విహరించగలరు. అపొస్తలుడైన పేతురు వలె మృతులను లేపగలరు. అపొస్తలుడైన పౌలువలె సత్యము నిమిత్తమై భూరాజుల సమక్షాన నిర్భయముగా నిలువగలరు. పరీక్షా పరిశోధనలను, ప్రాణాపాయములను చిరునగవుతో సంధించగలరు. స్తెఫనువలె శపించు వారిని దీవించగలరు. అపొస్తలులవలె భూలోకమును తలక్రిందులు చేయగలరు. ప్రభువును ఎరుగువారు నిజముగా బలము కల్గి గొప్ప కార్యములను చేస్తారు.

ప్రభువును ఎరుగుటలో మూడు మెట్లున్నాయి.

**ప్రధమంగా –** ప్రభువును వ్యక్తిగతముగా ఎరుగుట: దీనినే రక్షణ అని చెప్పవచ్చు. "యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము." (యోహాను 17 : 3) అని యేసు ప్రభువే సెలవిచ్చాడు. అనగా, ప్రభువును వ్యక్తి గతంగా ఎరుగుటయే రక్షణ లేక నిత్య జీవము. ప్రతి పాపి తన పాపముల విషయమై పశ్చాత్తప్తుడై, తన రక్షణార్థమై, వ్యక్తిగతంగా యేసు ప్రభువును అంగీకరించవలసి యున్నాడు. తల్లిదండ్రుల రక్షణలో పిల్లలకు భాగములేదు. అలాగే పిల్లల రక్షణలో తల్లిదండ్రులకు భాగము

లేదు. ఎవరి రక్షణ వారిదే. ఈ రక్షణ నూతన జన్మానుభవము ద్వారానే కలుగుతుంది. అందుకు గాను రక్షకుడైన యేసు ప్రభువును వ్యక్తిగతంగా విశ్వసించాలి.

**రెండవది** – ప్రభువులో దినదినాభివృద్ధి: దీనినే పరిశుద్ధ పరచబడుట అని చెప్పవచ్చు. "రక్షణ" అన్నది జీవముతో కూడిన సంబంధం. ఈ సంబంధం దినదినాభివృద్ధి చెందాలి. ఆ కారణాన, "మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు అను గ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధి పొందుండి." (2పేతురు 3 : 18) అని హెచ్చరింపబడి యున్నాము. "నిశ్చయముగా నా ప్రభువైన యేసు క్రీస్తు గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తము సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను." (ఫిలిప్పీ 3 : 8) అని, 25 సంవత్సరముల విశ్వాస జీవితానుభవము కల్గిన అపొస్తలుడైన పౌలు అన్నాడు. అనగా ఒకడు తనకు కలిగిన సమస్తము కంటే ప్రభువును ఎరుగుట ఎంతో విలువైనది. సమస్తమును సంపాదించుకొని, ప్రభువును ఎరుగకున్నట్లయితే అది ఆ వ్యక్తి నష్టమని, ప్రభువును గూర్చిన జ్ఞానము ముందు సమస్తము నిష్ప్రయోజనమని తేటపడుతుంది. మన ప్రభువును మనము కేవలము రక్షకుడుగా మాత్రమే గాక ఆయనను మన సృష్టికర్తగా, మన పోషకునిగా, నాయకునిగా, న్యాయాధిపతిగా, రాజుగా, కాపరిగా, స్నేహితునిగా, తండ్రిగా ఎరుగవలసి యున్నాము. ప్రభువును గూర్చిన జ్ఞానములో మనము దినదినాభివృద్ధిని పొందాలి అంటే, పరిశుద్ధ గ్రంథాన్ని భయ భక్తులతో క్రమంగా చదవాలి. కారణం? పరిశుద్ధ బైబిలు గ్రంథ సారాంశము ప్రభువైన యేసు క్రీస్తే. అందులో ఆయన ఎవరో, ఆయన మనకు ఏమైయున్నాడో గ్రహించగలము. పరిశుద్ధ గ్రంథమందలి 66 ఉప గ్రంథాలలో ఆయన ఏమైయున్నాడో మనము క్లుప్తంగా తెలిసికోవటం ఎంతైనా మంచిది.

### ప్రాచీన నిబంధన :

ఆది కాండములో – ఆయన సృష్టికర్త మరియు స్త్రీ సంతానం (ఆ.కా 1 : 1 3 : 15)
నిర్గమకాండములో – వధించబడిన దేవుని గొర్రెపిల్ల. (నిర్గమ 12 వ అధ్యాయం)



లేవీయ కాండములో – మన ప్రధాన యాజకుడు.
సంఖ్యా కాండములో – యాకోబు నక్షత్రం (24 : 17)
ద్వితీయోపదేశ కాండములో – మోషేవంటి ప్రవక్త (18 : 16)
యెహోషువలో – యెహోవా సేనాధిపతి (5 : 15)
న్యాయాధిపతులలో – యెహోవా వర్తమానికుడు (3 : 15 : 30)
రూతులో – సమీపబంధువు (3 వ అధ్యాయం)
సమూయేలులో – తృణీకరించబడిన రాజు (1సమూ 16-19)
రాజులు, దినవృత్తాంతములలో – రాజుల రాజు, ప్రభువుల ప్రభువు (1 దిన వృత్తా 12 : 38-40)
ఎజ్రా, నెహెమ్యాలలో – పరలోక, భూలోక ప్రభువు
ఎస్తేరులో – మన మొర్దెకై (10 వ అధ్యాయము)
యోబులో – సజీవుడు, రానైయున్న విమోచకుడు (19 : 25)
కీర్తనలలో – ధన్యుడు. (కీర్తన 1)
దైవ కుమారుడు (కీర్తన 2)
మనుష్య కుమారుడు (కీర్తన 8)
సిలువ వేయబడిన వాడు (కీర్తన 22)
పునరుత్థాన ప్రభువు (కీర్తన 23)
రానైయున్న రాజు (కీర్తన 24)
పరిపాలించుచున్న రాజు (కీర్తన 72)
స్తుతికి కారణభూతుడు (కీర్తన 150)
సామెతలలో – మన జ్ఞానము (4వ అధ్యాయం)
ప్రసంగిలో – మరువబడిన జ్ఞాని (9 : 14-15)
పరమగీతములో – నాప్రియుడు (2 : 16)
యెషయాలో – మన కొరకు శ్రమ నొందిన ప్రభువు (53వ అధ్యాయం)
యిర్మియాలో – నీతి రాజు (23 : 6)
విలాప వాక్యములలో – దుఃఖా క్రాంతుడు (1 : 12-18)
యెహెజ్కేలులో – సింహాసనా సీనుడు (1 : 26)
దానియేలులో – విరుగగొట్టు రాయి (2 : 34)

హోషేయలో – దావీదు యొక్క గొప్పరాజు (3 :5)
యోవేలులో – సమృద్ధిగా ప్రసాదించురాజు (2 : 18-19)
ఆమోసులో – ఇశ్రాయేలు రక్షకుడు (3 : 12)
ఓబద్యాలో – సియోను కొండపై ఆసీనుడైన విమోచకుడు
యోనాలో – పునరుత్థానుడైన రక్షకుడు
మీకాలో – నిత్యుడైన దేవుడు (5 : 2)
నహూములో – ఆశ్రయ దుర్గము (1 : 7)
హబక్కూకులో – మన విశ్వాసమునకు లంగరు (2 : 4)
జెఫన్యాలో – న్యాయము తీర్చు యెహోవా (3 : 15)
హగ్గయిలో – మనకు తోడైయున్న ప్రభువు (1 : 13)
జెకర్యాలో – నలుగ గొట్టబడిన కాపరి (13 : 7)
మలాకీలో – నీతి సూర్యుడు (4 : 2)

**నూతన నిబంధన :**

మత్తయి సువార్తలో – యూదుల రాజు (2 : 1)
మార్కు సువార్తలో – దేవుని సేవకుడు
లూకా సువార్తలో – మనుష్య కుమారుడు (3 : 38, 4 : 1-13)
యోహాను సువార్తలో – దేవుని కుమారుడు (1 : 1)
అపొస్తులుల కార్యములలో – ఆరోహణుడైన ప్రభువు (1 : 8-9)
రోమా పత్రికలో – మన నీతి (3 : 22)
1 కొరింథీలో – నిద్రించిన వారిలో ప్రథమ ఫలము (15 : 20)
2 కొరింథీలో – పాపముగా చేయబడిన రక్షకుడు (5 : 21)
గలతీ పత్రికలో – ధర్మశాస్త్రము యొక్క ముగింపు (3 : 13)
ఎఫెసీ పత్రికలో – మన సర్వాంగ కవచము (6 : 11-18)
ఫిలిప్పీ పత్రికలో – ప్రతీ అవసరతను తీర్చు ప్రభువు (4 : 19)
కొలొస్సై పత్రికలో – అన్నింటిలో ప్రాముఖ్యుడు (1 : 18)
1 థెస్సలొనీక పత్రికలో – తిరిగి రానైయున్న ప్రభువు (4 : 15-18)
2 థెస్సలొనీక పత్రికలో – రానైయున్న న్యాయాధిపతి (1 : 7-9)
1 తిమోతిలో – మధ్యవర్తి (2 : 5)



2 తిమోతిలో – కిరీటములను బహూకరించు ప్రభువు (4 : 8)
తీతు పత్రికలో – మహాదేవుడు, మన రక్షకుడు (2 : 13)
ఫిలేమోను పత్రికలో – తండ్రి భాగస్తుడు (17 : 19)
హెబ్రీ పత్రికలో – మన విశ్రాంతి
యాకోబు పత్రికలో – సైన్యములకు అధిపతియగు ప్రభువు (5 : 4)
1. పేతురు పత్రికలో – ప్రవచనాల మూలాంశము (1 : 10-11)
2. పేతురు పత్రికలో – దీర్ఘశాంతముగల రక్షకుడు (3 : 9)
1 యోహానులో – జీవ వాక్యము (1 : 1)
2 యోహానులో – క్రీస్తు విరోధికి గురి పలక (7,8) (TARGET)
3. యోహానులో – సత్యము (3,4)
యూదా పత్రికలో – విశ్వాసి యొక్క భద్రత (24,25)
ప్రకటన గ్రంథములో – రాజుల రాజు, ప్రభువుల ప్రభువు, మహిమ రాజు (19 : 11-16)

మనము మన ప్రభువును ఎంతగా ఎరుగుదుమో అంతగా ఆయనను ప్రేమించగలము. ఆయనను ఎంతగా ప్రేమించుదుమో అంతగా ఆయనను గ్రహించగలము. ఆయనను ఎంతగా గ్రహించగలమో, అంతగా ఆయన స్వరూపములోకి మార్చబడగలము. ఇది ఆయన యందలి ప్రేమ ప్రభావము.

**మూడవదిగా –** ప్రభువును సంపూర్ణముగా ఎరుగుట. దీనినే మహిమ పరచబడుట అని చెప్పవచ్చు. "ఇప్పుడు కొంత మట్టుకే యెరిగియున్నాను. అప్పుడు నేను పూర్తిగా ఎరుగుదును" (1 కొరింథీ 13 : 12) అని పౌలు సాక్ష్యమిచ్చాడు. మనము ఈ లోకములో వున్నంతకాలము ప్రభువును సంపూర్ణముగా ఎరుగజాలము. కాని ఆయన తన రెండవ రాకడలో మేఘారూఢుడై వచ్చునప్పుడు ఆయన విశ్వాసులు, ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు, మేఘముల మీద కొనిపోబడతారు. అప్పుడు ఆయన మహిమను పొంది, ఆయన స్వరూపములోకి మార్చబడి ఆయనను సంపూర్ణముగా ఎరుగుదురు.

## 6. ప్రభువు కొరకు ఎదురు చూచుట వలన కలుగు శక్తి

"యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజుల వలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మ సిల్లక నడచిపోదురు." (యెషయా 40 : 31) అని వ్రాయబడివుంది.

ఒక వ్యక్తి ఎగురుటకు ప్రయత్నించినపుడు, క్రింద భూమి ఆ వ్యక్తిని ఆకర్షించి, క్రిందికి లాగి పడవేస్తుంది. అలాగే ఆధ్యాత్మికంగా ఎగిరి పారమార్థిక వాతావరణములో విహారము చేయుటకు విశ్వాసి ప్రయత్నించినపుడు, ఆ వ్యక్తిని ప్రాపంచికము ఆకర్షించి, క్రిందకి లాగి, పడద్రోయుటకు ప్రయత్నిస్తుంది. అట్టి ప్రపంచపుటాకర్షణను యెదిరించి, జయించగలిగి నంతటే, ఆత్మ బలము తనలో వుంటేగాని, ఆ విశ్వాసి ఆధ్యాత్మికంగా ఎగురలేడు. యెహోవా కొరకు ఎదురు చూచు వారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజులవలె, రెక్కలుచాపి పైకి ఎగురుదురు. అని వ్రాయబడిన ప్రకారము పక్షిరాజు వలె రెక్కలు చాపి, పైకి ఎగురుటకు నూతన బలము కావాలి. ఆ బలము మనకున్న బలము కాదు. అది నూతన బలము. యెహోవా కొరకు ఎదురుచూచుట వలన, ఆ నూతన బలాన్ని యెహోవా యొద్దనుండే పొందగలము. ఆ బలము చేతనే, మన సమస్యలను పరిష్కరించి, కష్టములను అధిగమించి, పరీక్షా పరిశోధనలను జయించగలము. మానవ హస్త కృత్యములైన రాకెట్లు వెళ్లజాలని ఉన్నత స్థలములకు, అతి సులభంగా ఎగిరి వెళ్లగలము. యేసు ప్రభుని ఆగమనము నందు జరుగు అద్భుతమిదే. మేఘమండలములో ప్రభువు ప్రత్యక్షము కాగానే అప్పటికి క్రీస్తునందు మృతులైన వారు, అనగా యేసు ప్రభువునందు విశ్వాసముంచి, మరణించి, సమాధులలో వున్నవారు మొదటలేచి, అప్పటికి క్రీస్తునందు సజీవులైన వారితో యేకమై, అందరూ కలసి, మేఘమండలములోనికి కొనిపోబడి, ప్రభువుతో సదాకాలముంటారు. దైవ జనులైన హనోకు, ఏలియాల అనుభవమిదే. వారు శరీరము తోనే ఆరోహణమై పొయ్యారు. యేసు ప్రభువు కూడ, శరీరముతోనే అంతర్థాన మయ్యాడు.

ప్రకృతి శరీరము, పారమార్థికమును స్వతంత్రించుకొనుటకు వీలులేదు. కాబట్టి ప్రకృతి శరీరములు ఆత్మీయమైన శరీరములుగా మారి, అరోహణమై పోతాయి, ఇది మన దీన శరీరములో ప్రభువు జరిగించు కార్యమై వుంది. ఇదే మన నిరీక్షణ. ఇదే మన పిలుపు. సర్వోన్నతుడైన దేవుడు, మన అధోలోకమునకు



అరు దెంచుటలో ఉద్దేశము కూడా యిదే.

యెహూవా కొరకు ఎదురు చూచువారు, నూతన బలము పొంది, పక్షిరాజు వలె రెక్కలు చాపి, పైకి ఎగురుట మాత్రమేగాక, వారు అలయక పరుగెత్తుదురు. అని వ్రాయబడి వుంది. మానవులమైన మనమందరమూ, శారీరకముగా, మానసికముగా, ఆధ్యాత్మికంగా, అలసిపోతూ వుంటాము. పగలంతా విరామములేక చేసే పనులవల్ల, శరీరము అలసి పోతుంది. ఆలాగే, అనేక చింతలవల్ల, వ్యాకులముల వల్ల మనస్సు కూడ అలసి పోతుంది. ఆలాగే ఆధ్యాత్మికంగా అనేక కారణాలవల్ల ఆత్మ కూడ అలసి పోతుంది. ఆధ్యాత్మికంగా అలసిపోయిన వారికి, దేవుని వాక్యమంటే ప్రార్థన, ఆరాధనలంటే, విశ్వాసుల సహవాసమంటే, ఏవగింపు వేస్తుంది. పాపమున్న చోట దేవుని కొరకైన ఆకలిదప్పులుండవు, అందువల్ల, పాపము వలన ఆధ్యాత్మికంగా అలసట జనించదు. ఆధ్యాత్మికంగా, ఆకలి దప్పులు గలవారికి, ఆత్మీయ అలసట కలుగుతుంది. కాని మనము అలయక ప్రభువు వైపు మాత్రమే పరుగెత్తవలసి యున్నాము.

యెహూవా కొరకు ఎదురు చూచువారు అలసిపోరు. పూర్తిగా రెక్కలుచాపి, గగన విహారము చేసే, పక్షిరాజుకు అలసట వుండదు. ఆలాగే, యెహూవా కొరకు ఎదురు చూచువారు, బడలికకు బదులు, నూతన బలమును పొంది ముందుకు సాగిపోగలరు. ఉదాహరణగా, కర్మేలు పర్వతముపై, బయలు ప్రవక్తలను ఓడించిన ఏలియా, ఒక స్త్రీ బెదిరింపులకు భయపడి హోరేబు పర్వతమునకు పారిపొయ్యాడు. అక్కడ దేవుని స్వరాన్ని విని, దేవుని సన్నిధిలో దేవుని కొరకు ఎదురు చూచినందున, అలసటకు బదులు, ఆత్మలో విశ్రాంతిని బలాన్ని పొంది, వీరావేశముతో రాజైన ఆహాబును ఎదుర్కొనుటకు తిరిగి రాజధానికే వచ్చాడు. ఎంత ఆశ్చర్యము!

ప్రభువైన యేసు క్రీస్తు, శారీరకంగా అలసిపోయినట్లు సువార్తలలో వ్రాయబడి వుందిగాని, మానసికంగా, ఆధ్యాత్మికంగా అలసినట్లు ఎక్కడా కనిపించదు. కారణం? ప్రభువు తన మనస్సు పరిస్థితుల వత్తిడికి ఆహుతి కానివ్వలేదు. ఆ కారణాన, సిలువ మీద సహితము ఆయన ఆత్మ అలసిపోలేదు. ఆ ప్రభువు పగలంతా విరామమెరుగని సేవలో బడలిక పొందినా, రాత్రంతా కొండల మీద తన తండ్రితో సహవసించేవాడు. అందువల్ల మరుసటి దినము

కన్ను విప్పిన పువ్వు యొక్క తేజస్సుతో, తాజాతనముతో, నూతన బలముతో, తిరిగి తన సేవలో ప్రవేశించేవాడు. కాబట్టి ప్రార్ధనలో, దైవ ధ్యానములో ప్రభువు కొరకు ఎదురు చూచుట దేవుని శక్తియై వుంది.

## 7. ప్రభువునందు ఆనందించుట వలన కలుగు శక్తి

"యెహోవా యందు ఆనందించుట వలన మీరు బలమొందుదురు. (నెహెమ్యా 8 : 10) అని వ్రాయబడి వుంది. అనగా ప్రభువునందు ఆనందించుట దేవుని శక్తియై వుంది.

మానవ జీవితమునకు కావలసినది వాస్తవికమైన ఆనందము. కాని యిట్టి ఆనందము, సృష్టికర్తయైన దేవుని వరప్రసాదమైవుంది. ఆ సత్యమును మానవుడు గ్రహించక శాపగ్రస్తమైన లోకము వైపు చూచుట ఎంత పరితాపకరము! లోకమిచ్చు సంతోషము వేరు, ప్రభువు ప్రసాదించు ఆనందము వేరు. లోకమిచ్చు సంతోషము పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. అనగా పరిస్థితులు మనకు అనుకూలంగా వున్న పక్షాన, లోకమిచ్చు సంతోషము అధికమవుతుంది. కాని పరిస్థితులు మనకు ప్రతికూలముగా తిరిగినప్పుడు, మనలోని ఆ సంతోషము అంతరించి పోతుంది. అనగా మనము పరిస్థితుల వత్తిడికి ఆహుతియై పోయినపుడు, మనలోని సంతోషము వెళ్ళిపోతుంది. కాని ప్రభువిచ్చు ఆనందము లోకమిచ్చు లాంటిది కాదు. అది పరిస్థితులకు ఆహుతి కాజాలని ఆనందము. అది పరిస్థితులను అధిగమించగల ఆనందము. అది మారని ఆనందము. అది ఆత్మలో జనించు ఆనందము. అది ప్రభుని ఆనందము.

ఆనందము ఒక ప్రవాహములాంటిది. ఆ కారణాన "నీ ఆనంద ప్రవాహములోనిది నీవు వారికి త్రాగించుచున్నావు." (దా.కీ. 36 : 8) అని వ్రాయబడివుంది. ప్రవాహము శక్తి గలది. ఆలాగే ప్రభువునందలి ఆనందము దేవుని శక్తియై వుంది.

ప్రవాహము చలనమును, జీవమును, పరిచర్యను సూచిస్తుంది. ఆలాగే ఆనంద మన్నది అనేక హృదయాలలో ప్రవేశించి, చింతా క్రాంతులను సంతోష పరచి, రోగులకు ఆరోగ్యాన్ని, బలహీనులకు బలాన్ని ప్రసాదిస్తుంది.



పరిశుద్ధ బైబిలు గ్రంథం ప్రకారము, ఆనందాన్ని ప్రసాదించునవి మూడున్నాయి. ప్రథమంగా నీళ్ళు, రెండవదిగా ద్రాక్షారసము, మూడవదిగా తైలము లేక నూనె. ఈ మూడింటిని గురించి క్లుప్తంగా తెలిసికుందాము.

**ప్రథమంగా – నీళ్ళు :** నీళ్ళు దేవుని వాక్యమునకు, అనగా దేవుని మాటలకు సాదృశ్యంగా వున్నాయి. "నీ మాటలు నాకు సంతోషమును, నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి." (యిర్మియా 15 : 16) అని యిర్మియా ప్రవక్త సాక్ష్యమిచ్చాడు. అనగా దేవుని మాటలే ఆనందదాయకము. ఈ లోకములో పనికి మాలిన మాటలు, ఇచ్చకపు మాటలు, డంభపు మాటలు వదరుబోతు మాటలు, గప్పాలమారి మాటలు విస్తారముగా దొరుకుతాయి. కాని దేవుని మాటలు అరుదు. అట్టిమాటలు దొరికిన వెంటనే, జ్ఞానము గలవారు వారి హృదయవేదికలలో వాటిని భద్రపరచు కొని ఆనందిస్తారు.

**రెండవదిగా – ద్రాక్షారసము :** ద్రాక్షారసము ఆనందాన్ని కలుగజేస్తుంది. అందువల్ల, "నరుల హృదయమును సంతోషపెట్టు ద్రాక్షారసము." (దా.కీ. 104 : 15) అని వ్రాయబడివుంది. ఈ ద్రాక్షారసము యేసు ప్రభువు యొక్క గాయములనుండి ప్రవహించిన విలువైన రక్త ధారలను సూచిస్తుంది. అందువల్ల ప్రభువైన యేసు క్రీస్తు, ద్రాక్షారసముగల పాత్రను పట్టుకొని, "ఇది నా రక్తము" (1 కొరింథీ 11 : 25) అని సెలవిచ్చాడు. కాబట్టి ఆనందమునకు రెండవ రహస్యము యేసు రక్తమే. ప్రభువును ఎరిగిన విశ్వాసులు ప్రభువు రక్తములో కడుగబడిన వారు. కాబట్టి ప్రభువు యొక్క ఆనందము వారిదే.

**మూడవది – నూనె :** "నిన్ను ఆనంద తైలముతో అభిషేకించి యున్నాడు." (దా.కీ.45 : 7) అని వ్రాయబడిన ప్రకారము నూనె ఆనంద దాయకమైవుంది. నూనెకు అలవాటు పడ్డవారు ప్రతిదినము తలకు నూనె రాస్తారు. నూనె పరి శుద్ధాత్మకు సూచనగా వుంది. కాబట్టి పరి శుద్ధాత్మ తైలముతో ప్రతిదినము నిండి, ఆత్మ పూర్ణులమై వుండుట ఎంతో అవసరమై వుంది. ఆ కారణాన, "ఆత్మ పూర్ణులై యుండుడి" అని (ఎఫెసీ 5 : 18) లో హెచ్చరింపబడియున్నాము.

మానవునికి ఆనందాన్ని కలుగజేయునవి నీళ్ళు, ద్రాక్షారసము, నూనె లేక తైలము. నీళ్ళు వాక్యాన్ని సూచిస్తున్నాయి. ద్రాక్షారసము, యేసు రక్తాన్ని

సూచిస్తుంది. నూనె పరిశుద్ధాత్మను సూచిస్తుంది.

"వినుటవలన విశ్వాసము కలుగును." (రోమా 10 : 17) అని వ్రాయబడిన ప్రకారము దేవుని వాక్యమును వినుట వలన విశ్వాసము కలుగుతుంది. రెండవదిగా, యేసు రక్తమువలన హృదయ శుద్ధి కలుగుతుంది. మూడవదిగా, ఆత్మ తైలమువలన జీవితమునకు పరిచర్యలో కావలసిన శక్తి లభిస్తుంది.

మానవ జీవితమునకు ఆనందాన్ని కలుగజేయు, వాక్యము, రక్తము, పరిశుద్ధాత్మ – ఈ మూడు క్రీస్తు ప్రభువు నుండే పొందగలము. కాబట్టి వాస్తవికమైన ఆనందము క్రీస్తు ప్రభువే. అందువల్ల "మీ యందు నా సంతోషము ఉండ వలెనని, మీ సంతోషము పరిపూర్ణము కావలెనని, ఈ సంగతులు మీతో చెప్పు చున్నాను." (యోహాను 15 : 11) అని యేసు ప్రభువే సెలవిచ్చాడు. ఎవరైతే దేవుని వాక్యాన్ని విని విశ్వసించెదరో, ఎవ్వరి హృదయాలు ప్రభువు రక్తంతో శుద్ధీకరించ బడినవో, ఎవ్వరి హృదయాలను పరిశుద్ధాత్మ తనకు ఆలయముగా చేసి యున్నాడో, వారే నిజమైన ఆనందాన్ని కల్గినవారు. (1పేతురు 1 : 8) అట్టివారే ప్రభువునందు ఆనందించగల విశ్వాసులు. అట్టి వారే దేవుని శక్తిగలవారు.

ప్రభువునందు ఆనందించినవారిలో అపోస్తలుడైన పౌలు ఒకడు. ఈ అపోస్తలుడు, ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి. (ఫిలిప్పీ 4 : 4) అని సెలవిచ్చాడు. ప్రభువు నందలి ఆనందము పౌలు మహాశయునికి దేవుని శక్తి. అది ఏలాగో చూద్దాము.

పౌలు భక్తుడు రోము పట్టణానికి సువార్తికునిగా వెళ్ళదలచాడు. కారణం? రోము ప్రపంచ ప్రసిద్దమైన మహానగరం. పన్నెండు మైళ్ళ విస్తీర్ణము కలిగి ఇరవై లక్షల క్రిక్కిరిసిన జనాభాతో నిండి, అన్ని దిశలా రోమన్ సామ్రాజ్య వైభవాన్ని చాటిన నగరం. ఇటువంటి రోము నగరాన్ని ప్రభువు కొరకు జయించాలి అని ఆశించాడు పౌలు. రోము పట్టణము ప్రభువు స్వాధీనమైతే, యూరపు ఖండము, అవలీలగా ప్రభువు రాజ్యముగా మారి పోగలదని పౌలు ఆశించాడు. కాని తాననుకున్నట్లు జరుగలేదు. తాను ఒక సువార్తికునిగా (PREACHER) గాక ఒక బందీగా (PRISONER) రోము నగరము వెళ్ళ వలసి వచ్చింది. తాను నిర్దోషియైనా, రోమీయుల చేతిలో ఖైదీగా అప్పగింపబడ్డాడు. కాళ్ళకు చేతులకు



సంకెళ్ళు పడ్డాయి. చెరలో సంకెళ్ళతో ఒంటరియై పొయ్యాడు. కాని తన సంకెళ్ళను బట్టి తాను విచారించలేదు. మోషే చేతిలోని కర్రను, దావీదు చేతులోని వడిసెలను, గిద్యోను చేతిలోని మట్టి కుండను తన మహిమార్థమై వాడిన దేవుడు, తన సంకెళ్ళను కూడా ఆయన తన మహిమార్థమై వాడగలడని పౌలు ఆనందముతో వాటిని ప్రభువుకు సమర్పించాడు. తత్ఫలితంగా, తనకు ప్రతికూలములన్నీ, సానుకూలములుగా మారిపొయ్యాయి.

పౌలు తన యొద్దకు వచ్చేవారికి, దేవుని రాజ్యమును గురించి ప్రభువైన యేసు క్రీస్తును గురించి బోధింపసాగాడు. ఆ సమయములో, వంతుల చొప్పున ఆయన గృహాన్ని కావలా కాసే రోమను భటులు అనేకులు, సువార్తను విని విశ్వాసులుగా మారి పొయ్యారు. ఆ సువార్త జ్వాలలు ప్రేతోరియము వరకూ, రాజభవన అంతఃపురములోనికి కూడా ప్రాకిపొయ్యాయి. కైసరు అంతఃపురము నందే, విశ్వాసులు జన్మించారు. ఎంత ఆశ్చర్యం! రోము నగరములోని యూదులేగాక, గ్రీకులు, రోమన్లు కూడా, పౌలు దగ్గరికి నడిపించబడ్డారు. అట్టి వారిలో కొలస్సయిలోని ఫిలేమోను ఇంట ఆస్తిని దొంగిలించి పారిపోయిన ఒనేసీము ఒకడు. ఈ ఒనేసీము పౌలు వాక్య పరిచర్యతో రక్షింపబడ్డాడు. దొంగ, దొరగా, దాసుడు, సోదరునిగా మారి వెళ్ళాడు. పౌలు సంకెళ్ళతో వున్నా, సేవను మానలేదు. సూర్యుడు ఒకచోటే వున్నా ప్రపంచమంతటా వెలిగిచ్చు విధంగా, గృహ నిర్బంధములో వుండికూడా, సర్వ ప్రపంచానికి సువార్తను అందించిన మహనీయుడు ఈ పౌలు మహాశయుడు. అందుకు కారణం, ప్రభువునందలి తనకున్న ఆనందమే. అది దేవుని శక్తి!

## 8. ప్రభువు రక్త శక్తి

పరిశుద్ధ బైబిలు గ్రంథము ఒక ప్రత్యేకమైన గ్రంధము. అందుకు కారణము, అందులో ప్రవహించే రక్తదారలే. ఆ రక్తధారలే పరిశుద్ధ బైబిలు గ్రంథానికి జీవాన్ని, శక్తిని పోశాయి. అందువల్ల "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించు నంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది." (హెబ్రీ 4 : 12) అని

వ్రాయబడివుంది. దేవుని వాక్యమునకు శక్తి, జీవము, క్రీస్తు రక్తమే. రక్షణ సువార్తకు జీవాన్ని, శక్తిని ప్రసాదించునది క్రీస్తు రక్తమే. క్రీస్తు రక్తము దేవుని శక్తియై వుంది. "రక్తము దేహమునకు ప్రాణము, మీ నిమిత్తము. ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీ కిచ్చితిని." (లేవీ 17 : 11) అని ప్రభువు సెలవిచ్చిన ప్రకారము, రక్తము ప్రాణమునకు ఆధారమై వుంది. అనగా రక్తములో జీవముంది. యేసు ప్రభువు నిత్యుడైన దేవుడు (యెషయా 9 : 6) కాబట్టి ఆయన రక్తములో నిత్యజీవముంది.

**ప్రభువు రక్తము యొక్క ప్రత్యేకత :** మానవుల మైన మనకు మరణము సోకగనే, మన శరీరాలలో కుళ్లు ప్రారంభమవుతుంది. మొదట మన శరీరంలోని రక్తము చెడి కుళ్లు పడుతుంది. ఆ తరువాత కుళ్లు శరీరములోనికి వ్యాపిస్తుంది. అప్పుడు శరీరం కూడా కుళ్లు పడుతుంది. కారణం ? మన శరీరాలు పాపకళంకిత మైనవి. మనలోని రక్తము కూడా పాప కళంకితమైనదే. కాని యేసు ప్రభువు శరీరము పాప రహితమైనది. ఆయన పాప రహితుడు కాబట్టి ఆయన రక్తము కూడా పాప రహితమైనది. అది అమోఘమైనది. అది అద్వితీయమైనది. అది అక్షయమైన దేవుని రక్తము. అది చెడని రక్తము. "నీ పరిశుద్ధుని కుల్లు పట్టనియ్యవు." (దా.కీ 16 : 10) అని భక్తుడైన దావీదు రాజు ప్రభువు శరీరమును గూర్చి ప్రవచించాడు. ఆ ప్రకారమే ఆయన శరీరము మూడు దినములు సమాధిలో ఉంచబడినా అది చెడిపోలేదు. కుళ్లు పట్టలేదు. ఆయన శరీరము కుళ్లు పట్టలేదు, అనగా ఆయన రక్తము కూడా కుళ్లు పట్టలేదు అని అర్థము. అలాగైతే ఆ ప్రియ రక్షకుడు సిలువలో కార్చిన రక్తము ఏమై పోయింది? ఆయన శిరస్సు నుండి, పాద హస్తముల నుండి ప్రక్కలో నుండి కారిన విలువైన ఆ రక్తధారలు ఏమైపొయ్యాయి? ఆయన రక్తములో నిత్య జీవముంది. అది పావన రక్తము. కాబట్టి ఆరక్తము చెడిపోవుటకు, లేక కుళ్లుపట్టుటకు ఎంత మాత్రము వీలులేదు. "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్క సారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను." (హెబ్రీ 9 : 12) అని వ్రాయబడిన ప్రకారము, ఆ ప్రభువు తాను కార్చిన రక్తాన్ని పరిశుద్ధ స్థలమునకు అనగా పరలోకమునకు తీసికొని వెళ్ళాడు. ఇక్కడ మనకు రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలు ఎదురౌతున్నాయి.



1. ప్రభువు తన రక్తాన్ని ఎందుకై పరలోకమునకు తీసికొని వెళ్ళాడు?
2. ఆ కార్యాన్ని ప్రభువు ఎప్పుడు నెరవేర్చాడు? ఈ రెండు ప్రశ్నలకు జవాబుల ను అన్వేషించటం ఎంతైనా అవసరము.

## 1. ప్రభువు తన రక్తాన్ని ఎందుకై పరలోకమునకు తీసికొని వెళ్ళాడు?

ప్రాచీన నిబంధనలోని లేవీయ కాండము 16 వ అధ్యాయములో మొదటి ప్రశ్నకు జవాబును కనుగొనగలము. ప్రాయశ్చిత్తార్థ దినమందు ప్రధాన యాజకుడు, ప్రజలందరి పాపము నిమిత్తము మేక రక్తముతో, ప్రత్యక్షపు గుడారములోని అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించి, ఆ రక్తాన్ని కరుణాపీఠము పై ప్రోక్షించేవాడు. అప్పుడు పరిశుద్ధాగ్ని దిగివచ్చి, ఆ రక్తాన్ని దహించి వేసేది. అనగా ఆ రక్తాన్ని దేవుడు అంగీకరించాడు అని అర్థం. ఆ విధంగా ప్రజలకు రక్తము ద్వారా పాప క్షమాపణ కలిగేది. ఆనాటి బలులు, రక్తము తాత్కాలికముగా ఉపశాంతిని కలిగించాయి, కాని క్రీస్తుబలి, ఆయన చిందించిన ప్రశస్త రక్తము సంపూర్ణ శాంతిని, నిత్య జీవాన్ని ప్రసాదించాయి. ఆ కారణాన, మన గొప్ప ప్రధాన యాజకుడైన యేసు రక్షకుడు, సర్వమానవుల పాప పరిహారార్థమై తన రక్తాన్ని చిందించి, ఆ రక్తాన్ని, పరలోక పరిశుద్ధ స్థలమునకు తీసికొని వెళ్ళి, కరుణా పీఠముపై ప్రోక్షించాడు. అందువల్లే, "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" అని వ్రాయబడివుంది.

## 2. ఈ కార్యాన్ని ప్రభువు ఎప్పుడు నెరవేర్చాడు?

ప్రభువు ఈ గొప్ప కార్యాన్ని ఈస్టరు ఉదయాన, మగ్దలేనే మరియకు ప్రత్యక్షమైన తరువాత నెరవేర్చాడని లేఖనములు మనకు తెలియజేస్తున్నాయి.

ఈస్టరు ఉదయాన, అనగా ఆదివారము నాడు తెల్లవారుచుండగానే మగ్దలేనే మరియ, మరి కొందరు స్త్రీలు కలసి తాము తయారు చేసిన సుగంధ ద్రవ్యాలు తీసికొని ప్రభువు సమాధి దగ్గరికి వెళ్ళారు. సమాధి ముందుండిన రాయి అప్పటికే దొర్లి ఉండటము వారి చూశారు. వెంటనే మగ్దలేనే మరియ ఒక్క పరుగున, పేతురు, యోహానుల యొద్దకు వెళ్ళింది. ప్రభువును సమాధిలోనుండి

ఎవరో యెత్తికొని పొయ్యారు. ఆయనను ఎక్కడ వుంచిరో తెలియదు. అని వారికి చెప్పింది.

మరియతో సమాధి యొద్దకు వెళ్ళిన స్త్రీలు, సమాధిలోకి వెళ్ళి చూచినప్పుడు యేసు శరీరము వారికి కనబడలేదు. సరికదా, అకస్మాత్తుగా ఇద్దరు దేవ దూతలు వారి దగ్గరే నిలబడ్డారు. వారి వస్త్రాలు ధగధగ మెరసి పోతున్నాయి. ఆ స్త్రీలు భయపడి తలలు వంచుకున్నారు. కాని ఆ యిద్దరు వ్యక్తులు, "సజీవుడైన వానిని మీరెందుకు మృతులలో వెదకుచున్నారు? ఆయన యిక్కడ లేడు. సజీవుడైలేచాడు. మీరు వెళ్ళి ఆయన శిష్యులకు ఈ విషయము చెప్పండి. మీకు చెప్పినట్టే ఆయన మీకంటే ముందుగా గలలియలోకి వెళ్తున్నాడు. అక్కడ మీరు ఆయనను చూస్తారు." అని అన్నారు. ఈ మాటలను విన్న ఆ స్త్రీలు నిలువుగా నీరైపోయి గడగడ వణకుతూ ఆ సమాధినుండి పారిపోసాగారు.

ఇంతలో పేతురు యోహానులు, మగ్దలేనే మరియ చెప్పిన సంగతి విని పరుగు పరుగున సమాధి యొద్దకు వచ్చారు. సమాధి ఖాళీగా ఉండటము చూచి పేతురు యోహాను తిరిగి తమ ఇండ్లకు వెళ్ళిపొయ్యారు. అంతలో మరియ తిరిగి సమాధి యొద్దకు వచ్చింది. సమాధియొద్ద పేతురు యోహానులు గాని, ఆస్త్రీలు గాని, మరెవ్వరూ లేరు. మరియ ఒంటరిగా సమాధి యొద్ద ఏడుస్తూ నిలుచుంది. అప్పుడు తెల్లని బట్టలు ధరించిన యిద్దరు దేవదూతలు ఆమెకు కనిపించారు. వారు ఆమెను, "అమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగారు. ఆమె, "వారు నా ప్రభువును తీసికొని పోయారు. ఆయన్ని ఎక్కడ వుంచారో నాకు తెలియదు." అని చెప్పి వెనుకకు తిరగింది. ప్రభువు అక్కడే నిలిచి వుండటం చూచింది కాని ఆయనే యేసు అని ఆమె గుర్తు పట్టలేదు. "అమ్మా! ఎందుకు ఏడుస్తున్నావు? ఎవరి కోసము చూస్తున్నావు?" అని ప్రభువు ఆమెనడిగాడు. ఆయన తోటమాలి కాబోలు అనుకొని ఆయనతో "అయ్యా! నీవే గనుక ఆయనను మోసికొని పోయివుంటే, ఎక్కడుంచావో నాతో చెప్పు. నేను ఆయన్ని యెత్తికొని పోతాను". యోహాను (20 : 15) అని చెప్పింది. అప్పుడు ప్రభువు ఆమెతో, "మరియా!" అన్నాడు. ఆమె ఆయన వైపు తిరిగి "రబ్బూని" అని యూదుల భాషలో అన్నది. ఆ మాటకు బోధకుడు అని అర్థము. అప్పుడు ప్రభువు." నన్ను ముట్టవద్దు నేను యింకా తండ్రి దగ్గరకు, ఎక్కి వెళ్ళలేదు. అయితే నా



సోదరుల యొద్దకు వెళ్లి నాతండ్రి దగ్గరకు పైకి వెళ్ళుచున్నాను, అని వారితో చెప్పు," అని సెలవిచ్చాడు. (మత్తయి 28, మార్కు 15, లూకా 24, యోహాను 20)

మగ్దలేనే మరియతో సమాధి యొద్దకు వెళ్ళిన స్త్రీలు, దేవదూతలు సెలవిచ్చినట్లు, ప్రభువు లేచిన శుభవార్తను తెలియజేయుటకై, భయముతో, మహానందముతో సమాధియొద్దనుండి పరుగు పరుగున వెళ్తూ వుండగా మార్గమధ్యములో, అకస్మాత్తుగా ప్రభువు వారికి ఎదురై "మీకు శుభం" అని అన్నాడు. అప్పుడు వారు ఆయన దగ్గరికి వెళ్లి ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కారు (మత్తయి 28 : 9)

"నన్ను ముట్టవద్దు" (యోహాను 20 : 17) అని మగ్దలేనే మరియతో సెలవిచ్చిన ప్రభువు, ఆ స్త్రీలతో కూడా "నన్ను ముట్టవద్దు" అని ఎందుకు చెప్పలేదు? అందుకు రహస్యమేమిటి?

ప్రభువు తన రక్షణ కార్యాన్ని ముగించక పూర్వమే, అనగా, తన ప్రశస్త రక్తాన్ని పరలోకమునకు తీసుకువెళ్ళక ముందే, మగ్దలేనే మరియకు ప్రత్యక్ష మయ్యాడు. కాబట్టి "నన్ను ముట్టవద్దు" అని మరియతో అన్నాడు. కాని తన స్వరక్తముతో పరలోక పరిశుద్ధ స్థలములో ప్రవేశించి, కరుణా పీఠముపై ఆ రక్తాన్ని ప్రోక్షించి, రక్షణ కార్యాన్ని ముగించిన తరువాత, ఆస్త్రీలకు ప్రభువు ప్రత్యక్ష మయ్యాడు. ఆ కారణాన, వారితో, "నన్ను ముట్టవద్దు" అని ప్రభువు చెప్పలేదు. అందువల్లే వారు ఆయన పాదములు పట్టి ఆయనకు మ్రొక్కారు.

**రక్తము ద్వారానే నిత్య జీవం :** పస్కా పండుగ రోజు ఇశ్రాయేలీయుల ద్వార బంధపు రెండు నిలువ కమ్ముల మీద పై కమ్మి మీద, నిర్దోషమైన గొర్రెపిల్ల రక్తము పూయబడింది. (నిర్గమ 12 : 7) ఆ రక్తాన్ని చూచిన సంహారకదూత ఆ యింటి లోనికి ప్రవేశించక దాటిపొయ్యాడు. కాని ఏ యింటిపై గొర్రెపిల్ల రక్తపు గుర్తు లేదో, సంహారక దూత ఆ యింటిలో ప్రవేశించి, వారి జ్యేష్ఠ సంతానముపైకి తన ఖడ్గాన్ని ప్రయోగించాడు. ఆ రాత్రి సింహాసనముపై నున్న ఫరో రాజు తొలి సంతానముతో ప్రారంభమై చెరసాలలో ఉన్న ఖైదీ తొలి పిల్ల వరకూ – అనగా ఐగుప్తు దేశమందలి తొలి సంతాన మంతా, సంహారకపు దూత ఖడ్గ దాటికి

ఆహుతియై పొయ్యారు. ఐగుప్తు దేశమంతా ప్రళయ ఘోష పుట్టింది. కన్నీటి మడుగులతో దేశం నిండిపోయింది. ఒక ప్రక్క దేశమంతటా మరణాక్రందనములు మరొక ప్రక్క గోడు, గోడు ఏడ్పులు. గొర్రె పిల్ల రక్తపు గుర్తు వున్న యింటిలో జీవము, రక్షణ. ఎంత ఆశ్చర్యము! ఆనాటి నిర్దోషమైన గొర్రెపిల్ల రక్తము ద్వారా మరణ దూత దాటిపోయినట్లు, యీనాడు ప్రభువైన యేసు ప్రశస్త రక్తము ద్వారా నిత్యమరణము దాటిపోతుంది. అనగా ఆయన రక్తము ద్వారా పాపికి రక్షణ నిత్య జీవం. "యిప్పుడు క్రీస్తునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు." (రోమా 8 : 1)

**రక్తము ద్వారానే ఐక్యత :** యేసు ప్రభువును విశ్వసించిన వారు, క్రీస్తు శరీర మని పిలువబడుచున్నారు. (ఎఫెసీ 1 : 23) అనగా క్రీస్తు శరీరములోని అంగములు ఆయన విశ్వాసులే. మన శరీరములోని అంగముల జీవము మనలో ప్రవహించు రక్తముపై ఆధారపడివుంది. అలాగే క్రీస్తు శరీరములోని అంగములు, లేక ఆయన విశ్వాసుల ఆధ్యాత్మిక జీవము ఆయన రక్తముపై ఆధారపడివుంది. మన శరీరములోని అవయువములన్నీ ఒక్క శరీరముగా చేయబడుటకు రక్తమే కారణము. అలాగే ప్రభుని ప్రజలందరూ ఆయన శరీరముగా చేయబడుటకు ఆయన రక్తమే కారణము.

యేసు ప్రభువు రక్తము లేకుండ –

1. పాప క్షమాపణ లేదు (ఎఫెసీ 1 : 7)
2. దేవునికి సమీపస్తులము కాలేము (ఎఫెసీ 2 : 13)
3. దేవుని దృష్టిలో నీతి మంతులము కాలేము. (రోమా 5 : 9)
4. దేవునితో సమాధానము లేదు. (కొలొస్సి 1 : 20)
5. దేవుని సన్నిధిలోనికి ప్రవేశము లేదు. (హెబ్రీ 10 : 19)
6. పాపమాలిన్యమునుండి శుద్ధిలేదు. (1 యోహాను 1 : 7)
7. విజయవంతమైన జీవితము లేదు (ప్రకటన 12 : 11)

పల్లవి : నీ రక్తమే – నీ రక్తమే – నన్ శుద్ధీకరించున్
నీ రక్తమే నా బలము.

1. నీ రక్త ధారలేయిల – పాపి కాశ్రయంబిచ్చును
పరిశుద్ధ తండ్రి పాపిని – కడిగి పవిత్ర పరచుము ॥నీ రక్తమే॥
2. నీ సిల్వలో కార్చినట్టి – విలువైన రక్తముచే
పాపవిముక్తి జేసితివి – పరిశుద్ధ దేవ తనయుడ ॥నీ రక్తమే॥
3. నన్ను వెంబడించు సైతానున్ నన్ను బెదరించు సైతానున్
దునుమాడేది నీ రక్తమే – దహించేది నీ రక్తమే ॥నీ రక్తమే॥
4. స్తుతి మహిమ ఘనతయు – యుగయుగంబులకును
స్తుతి పాత్రనీకే చెల్లును – స్తోత్రార్హుడ నీకే తగును ॥నీ రక్తమే॥



యేసు క్రీస్తును కలిగిన వారే బలవంతులు. ఆ ప్రభువును కలిగి యుండ కుండుటయే బలహీనత. "నాకు బలము ధరింప జేయువాడు ఆయనే. నన్ను యదార్థ మార్గమున నడిపించు వాడు ఆయనే. ఆయన నా కాళ్లు జింక కాళ్లవలె చేయుచున్నాడు. ఎత్తయిన స్థలముల మీద నన్ను నిలువుచున్నాడు." (దా.కీ 18 : 32,33). "ప్రభువగు యెహోవాయే నాకు బలము. ఆయన నా కాళ్లను లేడి కాళ్లవలె చేయును. ఉన్నత స్థలముల మీద ఆయన నన్ను నడువ చేయును." (హబ 3 : 19) అని వ్రాయబడిన ప్రకారము, మన బలమైన ప్రభువు మన కాళ్లను లేడి కాళ్లవలె చేసి మనకు చాలినంత బలము నిచ్చి, మనల్ని ధైర్యపరచి, మార్గమందంతట మనకు తోడై యుండి, చక్కగ నడిపించి, ఆధ్యాత్మిక పర్వత శిఖరానుభవములలోనికి మనల్ని సురక్షితముగ చేర్చువాడై యున్నాడు. ప్రతి విధమైన శోధనను జయించుటకు, శత్రువైన సాతానును ఎదిరించుటకు, జీవిత తుఫానుల యందు స్థిరముగా నిలువబడుటకు ఆయనే మన బలము.

బలహీనులమైన మన నిమిత్తము బలవంతుడైన ప్రభువు బేసెరుగా కాగోరి, మానవ హస్తములలో బలహీనతను అనుభవించాడు. గెత్సేమనే తోటలో రాణువ వారును, సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును ఒక్కుమ్మడిగా ప్రభువుపై దాడి జరిపి, ఆయనను పట్టి బంధించినపుడు ఆ సర్వశక్తి మంతుడు శక్తి హీనతను అనుభవించాడు. ఆయన తన ముఖమును ఉమ్మి వేయబడుటకును గంత కట్టబడుటకును అప్పగించినపుడు, దుర్మార్గులు ఇనుపముళ్ల కొరడాలతో నెత్తురు ఎగజిమ్ము నట్లుగా కొట్టి ఆయన వెండ్రుకలు లాగి, "యేసూ! నిన్ను కొట్టినదెవరో చెప్పు" అని హేళన చేసినప్పుడు, బలుడైన ఆ ప్రభువు బలహీనతను అనుభవించాడు. ఆయనకు ఊదా రంగు వస్త్రమును ధరింపజేసి, ముళ్ళ

కిరీటమును శిరస్సుపై మొత్తి, "యూదుల రాజా, నీకు శుభముగుగాక" అని హేళన చేసినప్పుడు ఆశక్తి మంతుడు శక్తి హీనతను అనుభవించాడు. ఘోరమైన సిలువను ఆయనపై మోపి, గొల్గొతా కొండ పైకి దానిని మోయవలెనని బలవంతము చేసినప్పుడు, బలవంతుడైన ఆ ప్రభువు, ఆ సిలువ బరువుకు కృంగిపోయి బలహీనతను అనుభవించాడు. మూడు ఇనుప మేకులతో ఆ ప్రభువును సిలువకు బిగించి, గొల్గొతా కొండపై దానిని నాటినపుడు ఆ శక్తిమంతుడు శక్తిహీనతను అనుభవించాడు. ఉదయము 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు భయంకరమైన మండుటెండలో, ఆ సిలువలో వ్రేలాడినపుడు ఆ బలవంతుడు బలహీనతను అనుభవించాడు. బలహీనతను కనబరుచుటను బట్టి ఆయన సిలువ వేయబడ్డాడు. (2 కొరింధి 13 : 4) వధకు తేబడిన గొర్రెపిల్ల వలె శక్తి హీనతను అనుభవించి మరణించాడు. ఎంత ఆశ్చర్యము.

## ఆరవ అధ్యాయము

## రామోతు

రామోతు అనుమాటకు హెబ్రీ భాషలో ఔన్నత్యము అని అర్థము ఇట్టి అర్థమిచ్చు రామోతు యేసు ప్రభువునే సూచిస్తుంది.

"దేవుడు క్రీస్తు యేసును అధికముగా హెచ్చించి ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను" (ఫిలిప్పీ 2 : 11) అనియు, "క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు (కొలస్సి 3 : 1) అనియు వ్రాయబడిన ప్రకారము, ప్రభువైన యేసు క్రీస్తు భూమ్యాకాశములకు పైగా, సర్వోన్నత స్థలములలో ధగ ధగ మెరిసె ఆ మహిమలోనికి హెచ్చింపబడిన వాడై, తండ్రి కుడి పార్శ్యమున, సింహాసనాసీనుడై యున్నాడు. ఒక వ్యక్తి రామోతు లోనికి ప్రవేశించుట అనగా తన ఆధ్యాత్మిక జీవితములో ఔన్నత్యమైన స్థానములోనికి ప్రవేశించుట అని అర్థము. అనగా రామోతు ఆధ్యాత్మిక జీవితాభివృద్ధిని తెలియ జేస్తుంది. ఆధ్యాత్మిక జీవితాభివృద్ధిలో ఏడు అంతస్థులున్నట్లు పరిశుద్ధ బైబిలు గ్రంథములో వ్రాయబడివుంది.



## రామోతు అంతస్థులు

**1. విశ్రమించుట :** ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతిని కలుగ జేతును". (మత్తయి 11 : 28) అని వ్రాయబడిన ప్రకారము, ఒక పాపి రక్షకుడైన యేసు క్రీస్తు యొక్క ప్రేమాహ్వానమును విని, అంగీకరించి, ఆ ప్రభువును ఆశ్రయించగనే, ఆయన ఆపాపిని ప్రేమతో చేర్చుకొని క్షమించి, తన ప్రశస్త రక్తముతో వాని పాప కల్మషము నంతటిని కడిగి వాని పేరును జీవ గ్రంథములో వ్రాసికొని, పరలోక రాజ్యములోనికి, తిరిగి జన్మించిన చంటి బిడ్డగా తన ప్రేమ కౌగిటిలో పరుండజేసి విశ్రమింపజేస్తాడు. "పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయు చున్నాడు" (దా.కీ 23 : 2) అనగా పచ్చికగల చోట్లను ఆయన నన్ను విశ్రమింపజేయును అని అర్థము. ఇది ఆధ్యాత్మిక జీవితములో మొదటి అంతస్థు.

**2. కూర్చుండుట :** ఆధ్యాత్మికంగా తిరిగి జన్మించిన వారు ఎంతసేపూ ఊయల తొట్టిలో పరుండి విశ్రమించు పసిపాపల వలెనే ఉండక, ఆధ్యాత్మికంగా క్రమక్రమేణ ఎదిగి కూర్చుండు స్థితికి రావాలి. ఆ కారణాన, మరియ యేసు పాదముల యొద్ద కూర్చుండి ఆయన బోధను వినుచుండెను, అని లూకా సువార్త 10 : 39 లో వ్రాయబడివుంది. "అడవి వృక్షములలో జల్దరు వృ క్షమెట్లున్నదో పురుషులలో నా ప్రియుడు అట్లున్నాడు. ఆనంద భరితనైనేనతని నీడను కూర్చుంటిని. అతని ఫలము నాజిహ్వకు మధురము". (ప.గీ. 2 : 3) అని వ్రాయబడిన ప్రకారము ఈ లోకమును అరణ్యములో జల్దరు వృక్షము వలెనున్న యేసు ప్రభుని నీడలో ఆయన పాదముల చెంత మనము ఆనంద భరితులమై కూర్చుండినపుడు మధురమైన పండ్ల వంటి తన సద్బోధల వలన మనల్ని తృప్తి పరుస్తాడు. ఇది ఆధ్యాత్మిక జీవితములోని రెండవ అంతస్థు.

**3. ఆనుకొనుట :** "తన ప్రియుని మీద ఆనుకొని అరణ్య మార్గమున వచ్చునది ఎవతె?" (ప.గీ. 8 : 5). "ఆయన శిష్యులలో యేసు ప్రేమించిన యొకడు యేసు రొమ్మును ఆనుకొనుచుండెను". (యోహాను 13 : 23) అని వ్రాయబడిన ప్రకారము, ప్రభువు బిడ్డలమైన మనము మన ప్రియుడైన యేసు ప్రభువు రొమ్మును ఆనుకొని జీవించుటకు నేర్చుకోవాలి. ఆయా అవసరముల

యందు, మనము మన జ్ఞానము మీదనో ఉద్యోగాధికారము మీదనో, స్నేహితుల మీదనో, బంధువుల మీదనో ఆనుకుంటూ వుంటాము. కాని, మనము ఆనుకొని ఆధారపడదగినవాడు మన ప్రియ ప్రభువే. ఆయన ఎంతటికైనా, దేనికైనా ఆధారపడదగినవాడు, ఆనుకొనదగిన వాడు, మరియు నమ్మదగినవాడు. తన మీద ఆనుకొన్న వారిని ఆయన ఎన్నడూ నిరాశపర్చడు. అట్టి వారిని విడువక ఎడబాయక అంతము వరకు వారికి సహాయపడి నడిపిస్తాడు. కాబట్టి, ఆనుకొనుట ఆధ్యాత్మిక జీవితములోని మూడవ అంతస్థు.

**4. నిలుచుట :** ఒక దాసుడు తన యజమానుడు సెలవిచ్చు దానిని నిర్వహించుటకు గాను, తన యజమానుని చెంత నిలుచుంటాడు. ఆలాగే ప్రభువు రక్తముతో కడగబడి, ప్రభువు బిడ్డలైన వారు ఆయన సన్నిధిలో నిలుచుండుటకు నేర్చుకోవాలి. ఆ కారణాన, "నడుముకు సత్యమును దట్టికట్టు కొని, నీతియను మైమరువు తొడుగు కొని పాదములకు సమాధాన సువార్త వలననైన సిద్ధమనస్సును జోడు తొడుగుకొని నిలువ బడుడి అని ఎఫెసీ పత్రిక 6 : 14 లో హెచ్చరించ బడుచున్నాము.

ఎంతసేపూ ప్రభువు సన్నిధిలో నిశ్చింతగా కూర్చుండి ఆయన హితోపదేశమును వింటూ, ఆనందించడమే గాకుండా, ఆయన సెలవిచ్చిన దానిని నెరవేర్చుకొని వచ్చుటకు ఆయన సన్నిధిలో నిలుచుండ వలసి యున్నాము. కాబట్టి ప్రభువు సన్నిధిలో నిలుచుట ఆధ్యాత్మిక జీవితములో నాల్గవ అంతస్థు.

**5. నడచుట :** ప్రభువు యొక్క ఆజ్ఞను పొంది ఆయన చిత్తాన్ని నెరవేర్చు కొని వచ్చుటకుగాను, నడచి వెళ్ళవలసి యున్నాము. "వారు సొమ్మసిల్లక నడచి పోవుదురు". (యెషయా 40 : 31) అని వ్రాయబడిన ప్రకారము మన ఆధ్యాత్మిక నడకలో సొమ్మ సిల్లుట సహజమే. ఆ కారణాన మనము బలపడుటకు ఆధ్యాత్మికాహారమును బాగా భుజించవలసి యున్నాము.

ప్రవక్తయైన ఏలియా బదరీ వృక్షము క్రింద పరుండి నిద్రించుచుండగా ఒక దేవదూత వచ్చి ఆయనను ముట్టి, "నీవు లేచి భోజనము చేయుము" అని సెలవిచ్చాడు. అప్పుడు ఏలియా చూడగా, ఆయన తల దగ్గర, నిప్పుల మీద కాల్చ బడిన అప్పమును, నీళ్ళబుడ్డి కనబడ్డాయి. ఆయన భోజనము చేసి



తిరిగి పడుకున్నాడు. ఆయితే యెహూవా దూత రెండవ మారు వచ్చి ఆయన్ని ముట్టి, "నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధమై వుంది." "నీవు లేచి భోజనము చేయుము", అని చెప్పినప్పుడు, ఏలియా లేచి భోజనము చేసి, ఆ భోజన బలము చేత నలువది దివారాత్రములు ప్రయాణము చేసి దేవుని పర్వతమని పేరు పెట్టబడిన హోరేబుకు వెళ్ళినట్లు. 1 రాజులు 19 : 5-8 లో వ్రాయబడి వుంది. కల్వరి గిరి మీద యేసు ప్రభువును కనుగొన్న వారు బలమైన ఆధ్యాత్మికాహారమును బాగుగా భుజించి బలపడితేనేగాని, సీయోను పర్వత శిఖరాను భవముల లోనికి నడచి వెళ్ళలేరు.

హనోకు దేవునితో నడచినవాడు, కాబట్టి మనము కూడా దేవునితో నడువ వలసి యున్నాము. వెలిచూపును బట్టి గాక, విశ్వాసముతో నడువ వలసి యున్నాము. శరీరాను సారముగా కాక, ఆత్మానుసారముగా, నూతన జీవము గలవారమై నడువ వలసి యున్నాము. దేవుని కృపను ఆధారము చేసికొని, మన పిలుపునకు తగిన రీతిగా, జ్ఞానాను సారముగా దేవుని వెలుగులో నడువ వలసి యున్నాము. అప్పుడే, "రాజకుమార పుత్రికా, నీ పాదరక్షలతో నీ వెంత అందముగా నడుచుచున్నావు". (ప.గీ. 7 : 1) అను ప్రభువు మెప్పును పొంద గలము. కాబట్టి ఆధ్యాత్మిక జీవితములోని ఐదవ అంతస్థు నడుచుట.

**6. పరుగెత్తుట :** ప్రభువును ఎరిగిన విశ్వాసులు తమ ప్రభువు చిత్తమును నెరవేర్చుటకు గాను పరులెత్తి ఆయన సేవ చేయవలసి యున్నారు. పందెపు రంగమందు అందరూ పరుగెత్తు వారే కాని బహుమానమును పొందువాడు ఒక్కడు మాత్రమే. ఆలాగే ప్రభుని ప్రజలు, బహుమానమును పొందునంతగా, తమ ఆధ్యాత్మిక జీవితములో పరుగెత్తవలసి యున్నారు. పందెమందు పోరాడు ప్రతివాడు అన్ని విషయాలలో మితముగా ఉంటాడు. అయినను తాను పందెపు రంగములో గెలిచి పొందునది క్షయమగు కిరీటమే. కాని ప్రభుని ప్రజలు, అక్షయ కిరీటమును సంపాదించుటకు గాను అన్ని విషయాలలో మితముగా వుండవలసి యున్నారు.

"నేను గురి చూడని వాని వలె పరుగెత్తు వాడను కాను", (కొరింథీ 9 : 26) మరియు, "వెనుక వున్నవి మరచి, ముందున్న వాటి కొరకై వేగిర పడుచు. . . బహుమానమును పొందవలెనని గురి యొద్దకే పరుగెత్తు చున్నాను", (ఫిలిప్పీ 3

: 13,14) అని ఆధ్యాత్మిక పరుగును తుదముట్టించిన దైవజనుడు, అపొస్తలుడైన పౌలు తెలియజేశాడు. దేవుని ప్రజలైన వారు ఒక గురిని కలిగినవారై పరుగెత్తవలసి యున్నారు. ఆ గురి యేసు క్రీస్తే !

సింహము తన ఎఱమీద గురి పెట్టినప్పుడు, మరెవ్వరును తన గురిని ప్రక్కకు త్రిప్పలేరు. కాని కుక్క ఒక యెముకను చూచినంత మాత్రాన, తన గురిని మార్చుకుంటుంది. ఒకానొకనాడు యేసు ప్రభువు సురోఫెనికయ స్త్రీతో చెప్పినట్లు, మనము కుక్క పిల్లలమై యుంటిమి గాని ఇప్పుడైతే, ఆయన కృప చేత మనల్ని దేవుని పిల్లలనుగా మార్చియున్నాడు. కాబట్టి మన ముందు ఉంచబడిన పందెపు రంగములో మొదటి బహుమానమును పొందునంత మట్టుకు ఓపికతో పరుగెత్త వలసి యున్నాము. “యేసు వైపు చూచుచు, మన యెదుట వుంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తెదము”. (హెబ్రీ 12 : 2) అని వ్రాయబడిన ప్రకారము, మన ఆధ్యాత్మిక జీవిత పందెమును ఓపికతో పరుగెత్తి ముగించవలసి యున్నాము. ఇది ఆధ్యాత్మిక జీవితములో ఆరవ అంతస్థు.

7. ఎగురుట : విశ్రమించుట, కూర్చుండుట, ఆనుకొనుట సుళువుగాని, నడుచుట సుళువుకాదు. పరుగెత్తుట కష్టము. దానికంటే ఎగురుట ఎంతో కష్టము. ఒక వ్యక్తి ఎగురుటకు ప్రయత్నించినపుడు క్రింది భూమి వాని నాకర్షించి, క్రిందికి లాగి పడవేస్తుంది. ఆలాగే ఆధ్యాత్మికంగా ఎగిరి పారమార్థిక వాతావణము లో, విహారము చేయుటకు విశ్వాసి ప్రయత్నించినపుడు, వానిని ప్రాపంచకము ఆకర్షించి క్రిందికి లాగి పడద్రోయుటకు ప్రయత్నిస్తుంది. ప్రపంచపు ఆకర్షణను యెదిరించి జయించగలిగి నంతటి ఆత్మబలము తనలో వుంటే గాని తాను ఆధ్యాత్మికంగా ఎగురలేడు. “యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షి రాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు”. (యెషయా 40 : 31) అని వ్రాయబడివుంది. పక్షి రాజుల వలె రెక్కలు చాపి పైకి ఎగురుటకు నూతన బలము కావాలి. ఆ బలము మనకున్న బలము కాదు. అది నూతన బలము. ఆది మన ప్రభువు యొద్ద నుండే పొందగలము. ఆబలము చేతనే పైకి ఎగుర గలము. యేసు ప్రభుని ఆగమనము నందు జరుగు అద్భుతమిదే. మేఘ మండలములో ప్రభువు ప్రత్యక్షము కాగానే అప్పటికి క్రీస్తు నందు మృతులైన వారు లేచి, అప్పటికి క్రీస్తు నందు సజీవులైన వారితో యేకమై, అందరూ కలిసి మేఘ మండలము లోనికి కొనిపోబడి ప్రభువుతో సదా కాలముంటారు. ఆధ్యాత్మిక జీవితములో యిది ఏడవ అంతస్థు.

ఈ ఏడు అంతస్థులు మన ఆధ్యాత్మిక జీవితాభివృద్ధిని తెలియ జేస్తున్నాయి అనగా ఇవి రామోతు అనుభవాన్ని తెలియజేస్తున్నాయి.

## రామోతు రహస్యము

“నన్ను ఘన పరచు వారిని నేను ఘన పరచుదును. నన్ను తృణీకరించు వారు తృణీకారమొందుదురు.” (1 సమూ 2 : 30) అని ప్రభువు సెలవిచ్చిన ప్రకారము, రామోతు రహస్యము ప్రభువును హెచ్చించి ఘనపరచుటయే.

1. ఇశ్రాయేలీయులు : ఇశ్రాయేలీయులు జీవము గల దేవుని ఎప్పుడెప్పుడు ఘనపరచి హెచ్చించిరో, అప్పుడెల్లా దేవుడు వారిని పై వారినిగా వుంచాడు. అనగా వారిని రామోతులో వుంచాడు. లోకములో ఎవరికి లేని ఘనత వారికి కలిగింది. వారి కీర్తి లోకమంతటా వ్యాపించింది. వారి భయము అన్య జనాంగములను ఆవరించింది. వారి ధాటికి అన్యరాజులు నిలువ జాలక వారికి సామంతులై పొయ్యారు. ఎటు బోయినా విజయమే వారికి కంఠహారముగను, కీర్తి ప్రఖ్యాతులు వారికి కిరీటములుగను అయ్యాయి అధికారము రాజత్వము, ప్రభుత్వము ప్రాధాన్యత, పలుకుబడి శోభాతిశయములు వారి జన్మహక్కులై పొయ్యాయి. కాని ఇశ్రాయేలీయులు ఎప్పుడెప్పుడు జీవము గల దేవుని ఘనపరచక, ఆయన పరిశుద్ధ నామమును అవమాన పరచిరో అప్పుడెల్లా వారు అధోగతి పాలయ్యారు.

**2. యోహాను :** “స్త్రీలు కనిన వారిలో బాప్తిస్మ మిచ్చు యోహాను కంటే గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను”. (మత్తయి 11:11) అని బాప్తిస్మ మిచ్చు యోహానును గూర్చి జనసమూహముల యెదుట యేసు ప్రభువు సాక్ష్యమిచ్చాడు. ఆ ప్రభువు సాక్ష్యములో అబద్ధముండదు. మానవ రీతిగా ఆలోచించి నట్లయితే, యోహానులో ఏ గొప్ప తనము లేదు. చనిపోయిన ఏ వ్యక్తిని యోహాను బ్రతికించలేదు. ఏ రోగిని స్వస్థ పరచలేదు. యొర్దాను నదిని పాయలుగా చేయలేదు. చివరకి సామాన్యమైన రోగిని కూడ బాగు

చేయలేదు. సరికదా ! ఆలాగైతే, యోహానును గూర్చి యేసు ప్రభువు అంత గొప్ప సాక్ష్యమివ్వటానికి కారణమేమిటి?

యోహాను తన జీవితములో ఒకే ఒక తీర్మానమున కలిగి యుండేవాడు. "ఆయన హెచ్చవలసి యున్నది నేను తగ్గవలసి యున్నది". (యోహాను 3:30) యోహాను తన్ను ఘనపరచు కొనుటకు ఆశించిన వాడు కాదు. తన జీవితములో యేసు ప్రభువునే హెచ్చించిన వాడు. "సత్యము నిమిత్తము ఎత్తి పట్టుకొనుటకై నీ యందు భయభక్తులు గల వారికి నీవు ఒక ధ్వజము నిచ్చియున్నావు" (దా.కీ. 60 : 4) అని వ్రాయబడిన ప్రకారము యోహాను ధ్వజము యేసు ప్రభువే. కారణం? యోహాను సత్యము ననుసరించి సత్యమునే హత్తుకొని, సత్యమునే పల్కిన వాడు. "ఆయన హెచ్చవలెను. నేను తగ్గవలెను" అని పల్కిన మాటలు సత్యమునే బయలు పరుస్తున్నాయి.

యోహాను ఎగురవేసిన జెండా యేసు ప్రభువే. యోహాను, తన జెండాను ఎగురవేసిన వాడు కాదు. యేసు ప్రభువే యోహాను అతిశయము. యేసు ప్రభువే యోహాను మహిమ, "ఆయన చెప్పుల వారును విప్పుటకైనను, నేను యోగ్యుడను కాను" (యోహాను 1 : 27) అని సాక్ష్యమిచ్చినది యీ యోహానే.

యోహానుది దేవుని విధానము. ఆయన దేవునిచే నియమింపబడిన సేవకుడు. దేవుని చేత ప్రజ్వలింపబడిన ప్రవక్త. దేవుని బహుగా హెచ్చించిన భక్తుడు. "నీవు ఎవరు? అని యాజకులు, లేవీయులు ప్రశ్నించి అడిగినప్పుడు, "నేను క్రీస్తును కాను" అని వారికి జవాబిచ్చాడు. "నీవు ఏలీయావా?" అని అడిగినప్పుడు, "కాను" అని జవాబిచ్చాడు. "నీవు ఆ ప్రవక్తవా?" అని తిరిగి వారు ప్రశ్నించారు. "ఆ ప్రవక్త" అంటే ఏ ప్రవక్తో వారికే తెలియదు. కాబట్టి "నేను ఆ ప్రవక్తనే" అని ఒకవేళ యోహాను చెప్పేవుంటే, జనసమూహము అమాంతంగా యోహానును వెంబడించే వారు వారి వలన యోహాను బహుగా హెచ్చింపబడి, ఘనపరచబడి గొప్పవాడుగా కనబడి యుండి యుండేవాడు. కాని యోహాను మనుష్యుల మెప్పును కోరినవాడు కాదు. యేసు ప్రభువుని ఘనపరచిన వాడు. ఆ కారణాన, "నేను ఆ ప్రవక్తను కూడ కాను" అని జవాబిచ్చాడు. అలాగైతే నీవెవరు? అని చివరిగా వారు ప్రశ్నించగా, "నేను



అరణ్యములో ఒక శబ్దము మాత్రమే" అని యోహాను జవాబిచ్చాడు. (యోహాను 1 : 19-23).

అరణ్యములో ఒకడు కేకవేసినపుడు, ఆ కేకలోని వాక్కులకంటే, ఆ వ్యక్తి స్వరమే మొదట వినబడుతుంది. కాబట్టి మొదట స్వరానికే ప్రాముఖ్యత నిస్తాము. కాని కేకలోని వాక్కు వినిపించినపుడు స్వరాన్ని లెక్కచేయము. అలాగే లోకమనెడి అరణ్యములో యోహాను ఒక కేకవేశాడు. ఆ కేకలోని వాక్కు యేసు ప్రభువే. మొదటి స్వరం వినబడింది. ఆస్వరం యోహానే. ఆ తరువాత ఆ స్వరము లోని వాక్కు వినబడింది. ఆ వాక్కు యేసు ప్రభువే. ఇక స్వరముతో పనిలేదు. యేసు ప్రభువును హెచ్చిస్తూ యోహాను ఒక దివ్య ప్రకటన చేశాడు. "ఇదిగో లోక పాపమును మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల". (యోహాను 1 : 29). ఇది యోహాను స్వరం. ఈ స్వరంలో యోహాను గొప్పతనాన్ని గుర్తించగలము. యోహానుది రామోతు అనుభవము.

3. యేసు ప్రేమించిన శిష్యుడు : దేవుని వాక్యమును బోధించినందుకు శిష్యుడైన యోహాను పత్మాను అను ద్వీపములో పరవాసిగా వుంచబడ్డాడు. తాను కృషి చేసిన స్థానిక సంఘములకు దూరము కావలసి వచ్చింది. సూది మొనలు గల రాళ్ళమయమైనట్టి, చెట్టు చేమలు లేనట్టి భయంకరమైన పత్మాను దీవిలో ఒంటరిగా వుండవలసి వచ్చింది. ఆ సమయములో తన సహ విశ్వాసులను, తన్ను ప్రేమించి పరిచర్య చేసిన విశ్వాసులను, తాను కష్టపడి పనిచేసిన స్థానిక సంఘములను తలంచుకొని, తనకు కలిగిన ఆ ఒంటరి తనమును బట్టి ఎంతో బాధపడ్డాడు. "స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ, తన చంటి పిల్లను మరచునా ? వారైనా మరచుదురుగాని, నేను నిన్ను మరువను". (యెషయా 49 : 15) అని వాగ్దానము చేసిన, నమ్మకమైన ప్రభువు తన సేవకుని మరచి పోలేదు. కనురెప్ప పాటులో ఆత్మవశునిగా చేసి తన స్వరూప దర్శనముతో ఆయన్ని మురిపించి, ఆనందములో ముంచివేశాడు. అది చాలనట్లు, "యోహానూ! ఇక్కడికి ఎక్కిరమ్ము" (ప్రకటన 4 : 1) అని ఆహ్వానించి యింకను మహోన్నత వాతావరణములోనికి ఆయన్ని తీసికొని పోయి, పరలోకములో దేవుని సింహాసనము చుట్టు జరుగుచున్న ఆరాధన కూటములో ఆయన్ని ప్రవేశపెట్టాడు.

ఇది ఎంతటి భాగ్యము ! యోహాను శరీరము పత్మను దీవిలో వున్నా, తన ఆత్మ మహిమ సింహాసనము యెదుట ఆరాధన కూటములో వుంది. ఇది ఎంతటి ధన్యత ! యోహాను తనకు కలిగిన యీ దర్శనముచే అత్యానంద భరితుడై, ఆరాధనాత్మ ప్రపూర్ణుడై, బహుగా ఆదరించ బడినవాడై, తన ఒంటరి స్థితిని, తన శ్రమలను పూర్తిగా మరచి పోగలిగాడు. ఇదియే యోహానుకు కలిగిన రామోతు అనుభవము.

ప్రభువును ఆశ్రయించిన విశ్వాసుల శరీరాలుపత్మను పట్టులో వున్నా, వారి ఆత్మలు మహిమలోక వన విహారమొనర్చగలవు, అని యోహానుకు కల్గిన దర్శనము నిరూపిస్తుంది. "ఇక్కడికి ఎక్కిరమ్ము" అని పత్మను ద్వీపములో పరవాసి యైన యోహానును ఆహ్వానించిన ప్రభువు పత్మను పరిస్థితులలో సతమత మౌతున్న మనల్ని కూడా "ఇక్కడికి ఎక్కిరండి" అని పదే పదే ఆహ్వానిస్తున్నాడు. మన జవాబేమిటి ? మనము రామోతు అనుభవములో వుండుట మన ప్రభువు యొక్క ఉద్దేశమైవుంది.

**4. మరియ :** కన్యయైన మరియ ప్రభువు వలన బహుగా హెచ్చింప బడిన వ్యక్తి. ఆ దినములలో రక్షకుడైన యేసు ప్రభువును గర్భము ధరించుటకై స్త్రీలలో అనేకులు కన్యకలుగా కనిపెట్టారు. కాని రక్షకుని గర్భము ధరించు భాగ్యము మరియకు మాత్రమే కలిగింది. ఆమె స్త్రీలలో ఆశీర్వదింపబడిన వ్యక్తి. ఆమె కన్యక. పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కన్నది. ఆమె దేహము దేవుని మందిరముగా మారింది. జగద్రక్షకుని ఈ లోకము లోనికి తెచ్చుటకు ఆమె సాధనమైంది. "ఇది మొదలుకొని అన్ని తరముల వారు నన్ను ధన్యురాలు అందురు". (లూకా 1 : 49) అని ఆమె సాక్ష్యమిచ్చింది. ఈ విధంగా మరియ ప్రభువుచే హెచ్చింపబడుటకు కారణమేమిటి. "నా ప్రాణము ప్రభువును ఘన పరచుచున్నది" (లూకా 1 : 46) అని మరియ ఎలీసబెతు ఎదుట పల్కింది. అనగా మరియ ప్రభువును ఘన పరచిన వ్యక్తి. ఆమెకు కలిగిన అనుభవము రామోతు అనుభవము.

5. అపొస్తలుడైన పౌలు : తార్సువాడైన సౌలు, పౌలుగా మారక పూర్వం బహు గర్వ హృదయుడై యుండేవాడు. సౌలు మొదట యూదుడు. బెన్యామీను



గోత్రములో జన్మించినవాడు. ఇశ్రాయేలీయుల మొదటి రాజైన సౌలు కూడా, బెన్యామీను గోత్రికుడే. "సౌలు" అను పేరు తమ కుమారునికి పెట్టుటలో తల్లి దండ్రుల హృదయ వాంఛ విదితమౌతుంది. అనగా తన కుమారుడు కూడా సౌలు రాజంతటి గొప్పవాడు అవ్వాలి అని. తార్సువాడైన సౌలు కూడ గొప్పవాడు అవ్వటానికే కంకణము కట్టుకున్నాడు. గమలీయేలు, అను గొప్ప శాస్త్రజ్ఞుని యొద్ద పాండిత్యాన్ని నేర్చాడు. ధర్మ శాస్త్ర నిష్ఠయందు సుశిక్షితుడయ్యాడు. రోమా పౌరసత్వాన్ని కూడ సంపాదించాడు. "సౌలు" అన్న పేరు తనకు సార్థకమైంది. ఈ సౌలు, కుల గర్వం, కుటుంబ గర్వం, విద్యా గర్వం, మత గర్వం - ఇలాంటి వాటితో నిండి, క్రీస్తు విరోధిగా తయారయ్యాడు. స్తెఫను అను దైవజనుని చంపించాడు. క్రీస్తు విశ్వాసులను చెరపట్టి హింసించాడు.

ఒకనాడు గుర్రమెక్కి, దమస్కు మార్గాన వెళ్తూ వుండగా, దీన మనస్కుడైన యేసు ప్రభువు, సౌలును సంధించాడు. ప్రభువు యొక్క దివ్య వెలుగును చూచి సౌలు కొంత కాలం గ్రుడ్డి వాడయ్యాడు. ఆ తరువాత దీనత్వం అంటే ఏమిటో నేర్చుకున్నాడు. సౌలు పౌలుగా మారి పొయ్యాడు. పౌలు తన మిగత జీవితమంతా ప్రభువును హెచ్చించి ఘనపరచాడు.

ఒక పర్యాయం లుస్త్ర అను పట్టణములో పుట్టినది మొదలు కుంటివాడై, యెన్నడూ నడవని ఒక వ్యక్తిని చూచి, పౌలు, "నీ పాదములు మోపి సరిగా నిలువుము" అని బిగ్గరగా చెప్పాడు. వెంటనే ఆ కుంటివాడు గంతులు వేస్తూ నడవసాగాడు. అప్పుడు అక్కడి ప్రజలు, పౌలును, తన జత పనివాడైన బర్నబాను చూచి, "వీరు దేవతలు, మనుష్య రూపమును దాల్చి మన యొద్దకు వచ్చి యున్నారు". అని చెప్పి వారిని పూజించి ఘనపరచుటకై, యెద్దులను, పూదండ లను తెచ్చారు. అప్పుడు దైవజనుడైన పౌలు, "అయ్యలారా! మీరెందుకు ఈ లాగు చేయుచున్నారు? మేము కూడా మీ స్వభావము వంటి స్వభావము గల నరులమే. మీరు జీవము గల దేవుని వైపు తిరుగ వలెనని మీకు సువార్త ప్రకటించు చున్నాము. (అ.పొ.కా. 14 : 7 - 15) అని అన్నాడు. అనగా పౌలు ప్రజల మెప్పును కోరక దేవుని ఘనపరచాడు. ఒకవైపు ప్రజలు, పౌలును, బర్నబాను, "దేవతలు" అని సంభోదిస్తూ వుంటే, మరొకవైపు, "మేము మీలాంటి మనుష్యులమే", అని పౌలు అంటూ వున్నాడు. ఇది రామోతు రహస్యం.

# రామోతు జీవిత అడ్డు బండలు

"ఎవని గర్వము వానిని తగ్గించును. వినయ మనస్కుడు ఘనత నొందును". (సామెతలు 29 : 23) అని వ్రాయబడిన ప్రకారము రామోతు జీవితమునకు ఆటంకము గర్వమే.

**లూసీఫర్ (తేజో నక్షత్రము) :** మానవ సృష్టికి పూర్వం సర్వజ్ఞుడైన దేవుడు విశ్వాన్ని సర్వ సుందరంగా సృజించి, దాని యొక్క కార్యభారాన్ని వహించుటకు పరలోకములో అసంఖ్యాకులైన దేవదూతలను సృజించాడు. వీరిలో లూసీఫర్ అనే దేవదూత ప్రధానుడు. కాని ఈ ప్రధాన దూత తనకున్న సౌందర్యాన్ని బట్టి జ్ఞానాన్ని బట్టి ఎంతో అతిశయించాడు. దేవుని అధికారాన్ని, ఆధిక్యతను చూచి వీడికి కన్నుకుట్టింది. తాను ఒక ఔన్నత్యమైన స్థానములో, దేవుని సన్నిధిలో వుండి కూడా అంతటితో తృప్తిచెందక, గర్వాంధుడై, దేవుని సింహాసనము కన్నా, భూమ్యాకాశములకు పైగా సర్వోన్నత స్థలములలో ధగ ధగ మెరిసే, ఆ మహిమలో సింహాసనాసీనుడై తన అధికారాన్ని ఛలాయించాలనుకొన్నాడు. అందుకై దేవ దూతలలో కొంత మందిని తన పక్షం వహించేట్లు చేశాడు. విప్లవాలు లేవదీయుటకై నాంది ప్రస్థావనలు సాగించాడు. ఆ కారణాన, సర్వాధికారియైన దేవుని వాని గర్వానికి తగినట్లు పరమందు పదవి భ్రష్టునిగా చేసి, సాతానునిగా క్రిందికి పడ ద్రోశాడు. వానితో బాటు వాని అనుచరులు సహా దురాత్మలుగా లేక దయ్యాలుగా పడద్రోయబడ్డారు. కాబట్టి గర్వమే రామోతు జీవిత గుదిబండ అని తెలుస్తుంది.

"నాశనమునకు ముందు గర్వము నడుచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును". (సామె 18 : 18) అని వ్రాయబడిన ప్రకారము పడి పోవుటకు గర్వము నాయకత్వమును వహిస్తుంది. స్వార్థము గర్భాన్ని ధరించి గర్వాన్ని కంటుంది. గర్వము పెరిగి నాశనమునకు నడిపిస్తుంది.

గర్వమున్నది ఏ రూపములో కనుపించినా, దాని మాతృ గర్భం అహంకార హృదయమే. ఆధ్యాత్మిక గర్వమున్నది ఒకటుంది. ఆధ్యాత్మిక గర్వ హృదయులు వేషధారులే. "దేవా నేను యితరుల వలె వుండనందుకు నీకు వందనాలు. (లూకా 18 : 11) అని ప్రార్థించిన పరిసయ్యుడు ఆధ్యాత్మిక గర్వహృదయులకు



చక్కని సాదృశ్యము.

కొందరు తమ జ్ఞానార్జనను బట్టి గర్విస్తారు. కాని తమ జ్ఞానార్జన యితరుల శ్రమ, ప్రయాస అని వారు ఎరుగరు. దేవుని యందలి భయభక్తులు జ్ఞానమునకు మూలమని దేవుని గ్రంథము బోధిస్తుంది.

ధన సంపత్తిని బట్టి గర్వించు వారు కూడా ఎందరో వున్నారు. దేవుడుండవలసిన ప్రథమ స్థానములో స్వార్థముండుట పరితాపకరమైన విషయము.

మానవ జీవితములో సహజ స్వభావము ననుసరించి కనుపించు అహంకారము, గర్వము, డంబము, తిరస్కారము, తగిన దానికంటే తమ్మును తాము ఎక్కువగా ఎంచుకోవటము, అధిక ప్రసంగము, విద్యాగర్వము, ఉద్యోగ గర్వము, కుల గర్వము, కుటుంబ గర్వము, రంగు గర్వము – ఇవన్నీ కూడ రామోతు జీవితమునకు అడ్డుబండలై వున్నాయి. కాని దేవుని ప్రజలు తమ్మును తాము తగ్గించుకొని, విశ్వాసముతో ప్రార్థించినట్లయితే, ఈ అడ్డు బండలు తీసివేయబడతాయి. అప్పుడు వారు, దేవుని గొర్రె పిల్ల లక్షణములైన కృపా లక్షణములతో అనగా సాత్వికము, దీనత్వము ప్రేమ సమర్పణ మొదలైన సులక్షణాలు కల్గి రామోతు అనుభవములోకి హెచ్చింపబడగలరు.

"ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానముగా ఉండుట విడచి పెట్టకూడని భాగ్యమని యెంచు కొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసి కొనెను". (ఫిలప్పీ 2 : 6)

పాపాంధకార అగాధములోపడి, చెడి అధోగతిపాలై నిత్య నాశనమునకు యీడ్వబడుచున్న మనల్ని రక్షించి, పరిశుద్ధులనుగా మార్చి, మన భారముల నన్నిటిని తానే భరించి, తన శాశ్వతమైన ప్రేమతో మనల్ని సహవసించి, మనకు చాలినంత బలము నిచ్చి, మన నిమిత్తమై రామోతుగా కాగోరి, అనగా తానున్న ఉన్నత స్థితిలో మనల్ని కూర్చుండబెట్టగోరి, ఆ సర్వోన్నతుడు తన మహిమా సింహాసనాన్ని వదలి మన అధోగతికి దిగి వచ్చుట ఎంత ఆశ్చర్యము!

# ఏడవ అధ్యాయము

# గోలాను

గోలాను అనుమాటకు హెబ్రీ భాషలో వలయము అని అర్థము. వలయము నిత్యత్వమును సూచిస్తుంది. ఇట్టి అర్థమిచ్చు గోలాను ప్రభువైన యేసు క్రీస్తుకే సాదృశ్యంగా ఉంది. అందువల్ల ఆయనకు "నిత్యుడగు తండ్రి" (యెషయా 9:6) అని పేరు. ఒక వ్యక్తి గోలాను ఆశ్రయపురము లోనికి ప్రవేశించుట అనగా నిత్యుడైన దేవుని యొద్దకు చేరుట అని అర్థము.

**1. నిత్యత్వము :** వలయము నిత్యత్వమును సూచిస్తుంది. యేసు ప్రభువు నిత్యుడు.

"నేను మొదటి వాడను కడపటి వాడను. (యెషయా 41 : 4, 48 : 12) అని ప్రాచీన నిబంధనలో సెలవిచ్చిన దేవుడే, నూతన నిబంధనలో, "నేనే అల్ఫాయు, ఓమెగయు, మొదటి వాడను, కడపటి వాడను, ఆదియు అంతమునై యున్నాను." (ప్రకటన 1 : 8, 22 : 13) అని సెలవిచ్చాడు. యేసు ప్రభువు ఈ లోకములో శరీర ధారిగా జన్మించి ముప్పది మూడున్నర సంవత్సరములు జీవించి, పాపుల రక్షణార్థము సిలువలో మరణించి, సమాధి చేయబడి, మూడవనాడు మృత్యుంజయుడై లేచి పరలోకమునకు ఆరోహణుడై యిప్పటికి దాదాపు రెండువేల సంవత్సరములైనది. అంతమాత్రాన ఆ ప్రభువు అదివరకు లేడని కాదు. ఒక పర్యాయము ఆయన యూదులతో సంభాషిస్తూ, "మీ తండ్రియైన అబ్రహాము నా దినము చూతునని మిగుల ఆనందించెను. అది చూచి సంతోషించెను". (యోహాను 8 : 56) అని చెప్పినప్పుడు ఆ యూదులు, "నీకింకను ఏబది సంవత్సరములైనా లేవే, నీవు అబ్రహామును చూచితివా? అని ఆయనతో చెప్పగా, "అబ్రహాము పుట్టకమునుపే నేను వున్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను". అని ప్రభువు వారికి జవాబిచ్చాడు. అనగా ఆయన ఆద్యంత రహితుడని తెలుస్తుంది.

యేసు ప్రభువు ఆదియు, అంతము, అల్ఫాయు, ఓ మెగయు, మొదటి వాడును కడపటి వాడును, సమస్తములో సమస్తమై యున్నాడు. ఆయన కాలము



నకు, సమయమునకు బంధితుడు కాడు. కాలము సమయము అనునవి చరిత్రలో కనుపించక పూర్వమే ఆయన వున్నాడు. వర్తమాన భూత భవిష్యత్కాలములలో వుండువాడు ఆయనే.

"ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశ మందున్నవియు, భూమి యందున్నవియు, దృశ్యమైనవి గాని, అదృశ్యమైనవి గాని, అవి సింహాసనము లైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను అధికారము లైనను, సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టయు సృజింపబడెను. ఆయన అన్నిటికంటే ముందుగా వున్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు". (కొలస్స 1 : 15 – 17) అని వ్రాయబడిన ప్రకారము, ఆధ్యాత్మికమైన, ప్రకృతి సంబంధమైన సార్వత్రిక సృష్టి సమూహములకు సృష్టికర్త ఆయనే. ఉదయ నక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు, దేవుని కుమారులు, దేవుని దూతలందరూ ఆనందించి విజయ ధ్వనులు చేసినప్పుడు భూమికి మూల రాతిని వేసిన వాడు ఆ ప్రభువే. ఆకాశ విశాలమును ఒక తెర వలె విసరి పరిచిన ఆ విశాల తెరపై అసంఖ్యాకములైన ఆ విచిత్ర నక్షత్రరాసులను చిలకరించినది ఆ ప్రభావ శాలియే. మంటిని మానవునిగాను, ప్రక్కటెముకను స్త్రీనిగాను చేసినది ఆ సర్వజ్ఞుడే. ఆకాశ శూన్యతలోని రహస్యం, నక్షత్రములలోని అందము, పక్షులలోని సునాదము, వృక్షాల పచ్చనిదనము ఆయన ప్రభావమే. సముద్రము యొక్క ఘోషను, ఉరుము యొక్క ధ్వనిని, మెఱుపు తీగెలోని తేజస్సును వాటికి ప్రసాదించినది ఆయన మహిమయే.

యేసు క్రీస్తు నిన్న నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు. అవును యుగ యుగము లకును ఒక్కటే రీతిగా ఉన్నాడు. (హెబ్రీ 13 : 8) అని వ్రాయబడిన ప్రకారము ఆయన మార్పులేని శాశ్వితుడు. మానవులమైన మనము పదే పదే మారుతూ వుంటాము. చెడ్డదాని నుండి మంచి దానికి, మంచి దాని నుండి చెడ్డదానికి మారుట మానవ స్వభావము. కాని మన ప్రభువు మహా పరిశుద్ధుడు కాబట్టి మంచి దానిలో నుండి చెడ్డ దాని లోనికి మార్పుకాజాలడు. ఆయన నిత్యము ఏక రీతిగా ఉన్నాడు. ఆ కారణాన, "నేను మార్పు లేనివాడను" (మలాకి 3:6) అని ఆయన సెలవిచ్చాడు.

**2. దేవత్వము :** వలయము దేవత్వాన్ని సూచిస్తుంది. యేసు క్రీస్తు నిజమైన దేవుడు.

వలయము నిత్యత్వాన్ని సూచిస్తుంది. నిత్యత్వము దేవత్వాన్ని సూచిస్తుంది. యేసు క్రీస్తు ఒక సామాన్య మానవుడని, ఒక గురువని, ఒక గొప్ప బోధకుడని, ఒక ప్రవక్తని – ఈ విధంగా తలంచేవారు ఎందరో వున్నారు. ఆయన దేవుడని ఆరాధించేవారు కూడా ఎందరో ఉన్నారు. ఈ భేదాభిప్రాయాలు తరతరాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఈ వివాదాల కారణంగా, యేసు క్రీస్తును కంచు కాగడ వేసి పరీక్షించిన వారు కోకొల్లలుగా వున్నారు. ఈ జగద్రక్షకుడు ఈ లోకములో శరీరధారిగా వున్నప్పుడు, "మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొను చున్నారు?" (మత్తయి 16 : 13) అని తన శిష్యులను ఆ ప్రభువే ప్రశ్నించినపుడు, కొందరు బాప్తిస్మ మిచ్చు యోహానని యు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు, కొందరు ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారని అన్నారు. అందు కాయన, "మీరైతే, నేను ఎవడనని చెప్పుకొనుచున్నారు, అని వారిని ప్రశ్నించాడు. అందుకు సీమోను పేతురు, "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు". (మత్తయి 16 : 15–16) అని చెప్పాడు. పేతురు జవాబును బట్టి యేసు క్రీస్తు సర్వోన్నతుడైన దేవుని కుమారుడని స్పష్టమవుతుంది.

ఇదే సత్యాన్ని గబ్రియేలు దూత కన్యయైన మరియకు బయలుపరచాడు. యేసు జననము గూర్చి ఆ దూత మరియతో, "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును. కనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును". (లూకా 1 : 32 – 35) అని తెలియజేశాడు.

యెషయా ప్రవక్త కూడా యిదే సత్యాన్ని ప్రవచించాడు. "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడను గ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు. నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును". (యెషయా 9 : 6)

దేవుని కుమారుడనబడిన యేసు క్రీస్తు నిజముగా దేవుడని ఎరుగవలసి



యున్నాము. ఈ వాస్తవిక సత్యాన్ని పరీక్షించి తెలుసు కోవడము ఎంతైనా మంచిది.

(1) యేసు క్రీస్తు దేవుడు కాదని బోధించే వారు కూడా వున్నారు. యేసు క్రీస్తు జననమునకు 700 సంవత్సరాలకు పూర్వము యెషయా ప్రవక్త, "కన్యక గర్భవతియై కుమారుని కని, అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును." (యెషయా 7 : 14) అని ప్రవచించాడు. ఆ ప్రకారమే ఇమ్మానుయేలు జన్మించాడు. ఇమ్మానుయేలు అను పేరుకు హెబ్రీభాషలో, "మనకు తోడుగా ఉండు దేవుడు" అని అర్థము. ప్రాచీన నిబంధన కాలములో ఆయా సమయాలలో ఆయా విధాలుగా మన పితరులకు దేవుడు ప్రత్యక్షమై వెళ్ళిపొయ్యే వాడు. అనగా అప్పుడప్పుడు మాత్రమే దేవుడు మనష్యులకు కనుపించే వాడు. కాని ఈ కృపా యుగములో అదే దేవుడు ఇమ్మానుయేలు అను పేరుతో, శరీరధారియై మనష్య కుమారుడయ్యాడు. (మత్తయి 1 : 23)

(2) యేసు క్రీస్తు తాను దేవుడనని మనుష్యులకు తెలియజేశాడు. "నేనును నా తండ్రియును ఏకమై యున్నాము". (యోహాను 10 : 30) అని ఒకప్పుడు యేసు యూదులతో చెప్పగా, యూదులు ఆయనను కొట్ట వలెనని రాళ్లు చేత పట్టుకొన్నారు. అప్పుడు ఆయన "తండ్రి యొద్దనుండి అనేకమైన మంచి క్రియలను మీకు చూపితిని. వాటిలో ఏ క్రియ నిమిత్తము నన్ను రాళ్ళతో కొట్టుదురు? అని వారిని ప్రశ్నించాడు. అందుకు యూదులు," నీవు మనుష్యుడవై యుండి దేవుడనని చెప్పుకొనుచున్నావు, గనుక దేవ దూషణ చేసినందుకే నిన్ను రాళ్ళతో కొట్టుదుము, గాని మంచి క్రియ చేసినందుకు కాదు, అని ఆయనకు జవాబిచ్చారు. (యోహాను 10 : 31 – 33) అనగా యేసు ప్రభువు యూదులకు తాను దేవుడనని స్పష్టముగా తెలియజేశాడు.

మేడ గదిలో శిష్యుడైన ఫిలిప్పు, ప్రభువా తండ్రిని మాకు కనబరచుము, మా కంతే చాలును (యోహాను 14 : 8) అని యేసు ప్రభువుకు మనవి చేశాడు. అనగా, ప్రభువా మాకు దేవుని కనబరచుము, అని యేసు ప్రభువును ఫిలిప్పు అడిగాడు. అందుకు ఆయన, "ఫిలిప్పూ, నేనింత కాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని, (అనగా దేవుని) చూచి యున్నాడు. గనుక తండ్రిని మాకు కనబరచుమని యేల చెప్పుచున్నావు" (యోహాను 14 : 9) అని జవాబిచ్చాడు. అనగా తాను దేవుడనని యేసు

ప్రభువు ఫిలిప్పుకు తెలియజేశాడు.

(3) దేవుడు మాత్రమే ఆరాధింప తగినవాడు. సృష్టికర్తను మినహాయించి, మనము దేనిని పూజించినా సరే, అది విగ్రహారాధన అవుతుంది. "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను". (మత్తయి 4 : 10) అని యేసు ప్రభువు సాతానుతో చెప్పాడు. అనగా మనము ఆరాధించి, మ్రొక్క వలసినది దేవుని మాత్రమే.

తూర్పు దేశ జ్ఞానులు వచ్చి యేసు ఎదుట సాగిలపడి ఆయనను పూజించి, తమ పెట్టెలు విప్పి, బంగారమును, సాంబ్రాణిని, బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించారు. (మత్యయి 2 : 10–11) కారణం? ఆయన దేవుడు కాబట్టి. వారి ఆరాధనను ప్రభువు అంగీకరించాడు.

యేసు ప్రభువు గలిలీయ సముద్రము మీద నడచి, సముద్రములో చెలరేగిన గాలిని, తుఫానును నిమ్మళ పరచినప్పుడు, ఆయన శిష్యులు ఆశ్చర్యపడి ఆయనను ఆరాధించారు. (మత్తయి 14 : 33) ఆయన దేవుడు కాబట్టి వారి ఆరాధనను అంగీకరించాడు. సమరయ గలిలయ ప్రాంతములో యేసు చేత స్వస్థత పొందిన కుష్ఠ రోగి, గొప్ప శబ్దముతో కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు ఆయన పాదముల యొద్ద సాగిలపడి ఆయనను మహిమ పరచి ఆరాధించాడు". (లూక 17 : 16) ఆయన దేవుడు కాబట్టి ఆ కుష్ఠరోగి యొక్క ఆరాధనను అంగీకరించాడు.

ప్రకటన గ్రంథము 5వ అధ్యాయములో, పరలోకములో దేవుని దూతలు, పరిశుద్ధులు, సర్వ సృష్టి యేసు ప్రభువును ఆరాధిస్తున్నట్లు చూడగలము.

ఆ ప్రభువు దేవుడు కాబట్టి భూలోకమందలి నరుల ఆరాధనను, పరలోకమందలి దేవదూతల ఆరాధనను అంగీకరించాడు.

(4) దేవుడు మాత్రమే పాపములను క్షమించగలడు. పాపములను క్షమించు అధికారము భూమి మీద ఏ నరునికి యివ్వబడలేదు. దేవుడొక్కడే పాపములను క్షమించు అధికారము గలవాడు. ఇదే సత్యాన్ని యూదా మతాధికారులు బోధించారు.



ఒక పర్యాయము కొందరు మనుష్యులు ఒక పక్షవాయువు గల వానిని మంచము మీద మోసికొని వచ్చి, ఇంటి మీది కెక్కి, పెంకులు విప్పి, మంచముతో సహా యేసు ఎదుట దించినపుడు, ప్రభువు వారి విశ్వాసమును చూచి, "మనుష్యుడా, నీ పాపములు క్షమింపబడి యున్నవి" అని వానితో చెప్పగా, అక్కడ కూడియున్న శాస్త్రులు పరిసయ్యులు "దేవ దూషణ చేయుచున్న యితడెవడు? దేవుడొక్కడే తప్ప మరి ఎవడు పాపములు క్షమింపగలడు?" (లూకా 5 : 18–21) అని ఆలోచించుకొనసాగారు. అప్పుడు ప్రభువు, "పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను". (లూకా 5 : 25) అని వారితో చెప్పి, పక్షవాయువు గల వాని చూచి, "నీవు లేచి నీ మంచమెత్తుకొని నీ యింటికి వెళ్ళుము" అని సెలవిచ్చాడు. వెంటనే వాడు లేచి మంచమెత్తుకొని దేవుని మహిమ పరుస్తూ యింటికి వెళ్ళాడు.

ఒకప్పుడు, పాపాత్మురాలైన ఒక స్త్రీ ఒక పరిసయ్యుని యింట యేసు భోజనమునకు కూర్చొని యున్నాడని తెలిసికొని, ఒక బుడ్డిలో అత్తరు తీసికొని వచ్చి, వెనుక తట్టు ఆయన పాదముల దగ్గర నిలువబడి తన కన్నీటితో ఆయన పాదములను తడిపి, తన తల వెంట్రుకలతో తుడిచి, ఆ పాదములను ముద్దు పెట్టుకొని అత్తరు పూసింది. అప్పుడు ఆ ప్రభువు "నీ పాపములు క్షమించబడియున్నవి". (లూకా 7:48) అని ఆమెతో చెప్పగా, ఆయనతో కూడా కూర్చుండినవారు పాపములు క్షమించుచున్న యితడెవడు" అని తమలో తామనుకున్నారు. అనగా పాపములను క్షమించువాడు దేవుడొక్కడే అని వారు గ్రహించారు.

యేసు క్రీస్తు దేవుడు కాబట్టి నరుల పాపములను క్షమించు వాడై యున్నాడు.

(5) యేసు క్రీస్తు దేవుడని అనేకులు సాక్ష్యమిచ్చారు.

**శరీర ధారియైన దేవుడు :** యోహాను 1 : 1 "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను" అని వ్రాయబడిన ప్రకారము, వాక్యము యేసు ప్రభువునే సూచిస్తుంది. ఎందుకనగా, 14వ వచనములో, ఆ వాక్యము శరీరధారియై మన మధ్య నివసించెను" అని వ్రాయబడి వుంది. అనగా యేసు ప్రభువు శరీరధారియైన దేవుడని యోహాను సాక్ష్యమిచ్చాడు.

**మహా దేవుడు :** "శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము అనగా, మహాదేవుడును, మన రక్షకుడునైన యేసు క్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురు చూస్తూ బ్రతుకు చుండవలెను." (తీతు 2 : 13) అని భక్త పౌలు తీతుకు వ్రాశాడు. అనగా యేసు ప్రభువు మహాదేవుడని పౌలు తెలియజేశాడు. ఆయన ప్రత్యక్షతయే మన శుభప్రదమైన నిరీక్షణ.

**సర్వాధికారియైన దేవుడు :** శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడై యున్నాడు. ఆమేన్ (రోమా 9 : 5) అని అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాశాడు. అనగా యేసు ప్రభువు సర్వాధి కారియైన దేవుడని పౌలు వారికి తెలియజేశాడు.

**జీవముగల దేవుడు :** "మనుష్యుల కందరికి రక్షకుడును మరి విశేషముగా విశ్వాసులకు రక్షకుడునైన జీవముగల దేవుని యందు మనము నిరీక్షణ నుంచి యున్నాము. గనుక ఇందు నిమిత్తము ప్రయాస పడుచున్నాము" (1 తిమోతి 4 : 10) అని వ్రాయబడిన ప్రకారము, జగద్రక్షకుడైన యేసు ప్రభువు జీవము గల దేవుడని భక్త పౌలు తిమోతికి తెలియజేశాడు.

**తండ్రియైన దేవుడు :** తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవునితో, అనగా యేసు ప్రభువుతో, "దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది" (హెబ్రీ 1 : 8) అని అన్నాడు. ఇవి ఆశ్చర్యకరమైన మాటలు, దేవుడైన యేసు క్రీస్తు సింహాసనము నిరంతర ముండు సింహాసనమని పరమ తండ్రి తెలియజేశాడు.

**బలవంతుడైన దేవుడు :** "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్య కరుడు ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు. అని అతనకి పేరు పెట్టబడును". (యెషయా 9 : 6) అని యెషయా ప్రవచించాడు.

**నిజమైన దేవుడు :** యేసు ప్రేమించిన శిష్యుడు యోహాను, యేసు ప్రభువే నిజమైన దేవుడును నిత్య జీవమునై యున్నాడు" (యోహాను 5 : 21) అని లోకమునకు చాటించాడు.



**మన దేవుడు :** "యేసు క్రీస్తు దాసుడును, అపొస్తలుడైన సీమోను పేతురు, మన దేవుని యొక్కయు రక్షకుడైన యేసు క్రీస్తు యొక్క నీతిని బట్టి, మా వలెనే అమూల్యమైన విశ్వాసము పొందిన వారికి శుభమని చెప్పి వ్రాయునది". (2 పేతురు 1 : 1) అని వ్రాయబఢిన ఈ మాటలలో, మన దేవుడు, రక్షకుడు అను మాటలు యేసుప్రభునకే చెందినవి. అనగా యేసు ప్రభువు "మన దేవుడు", "మన రక్షకుడు" అని పేతురు సంభోధిస్తున్నాడు.

**నా దేవుడు :** యేసు శిష్యులలో ఒకడైన తోమాను మేడ గదిలో ప్రభువు సంధించి నపుడు, "నా ప్రభువా, నా దేవా! (యోహాను 20 : 28) అని సంభోదించాడు. అనగా యేసు ప్రభువు, "నా దేవుడు" అని తోమా సాక్ష్య మిచ్చాడు.

వీరందరి సాక్ష్యములను బట్టి, ప్రభువైన యేసు క్రీస్తు నిజమైన దేవుడని స్పష్టమవుతుంది.

**3. అందుబాటు :** వలయము అందుబాటును సూచిస్తుంది. యేసు ప్రభువు అందరికి సమీపములో ఉన్నవాడు. వలయము మధ్యనుండి, అనగా కేంద్రము నుండి ఎటు చూచినా సమాన దూరమును చూపిస్తుంది. ఆలాగే గోలాను ఆశ్రయపురముగా వున్న యేసు ప్రభువు అందరికి సమాన దూరములో వున్నాడు. అనగా సర్వ మానవులకు ఆ ప్రియ ప్రభువు అందుబాటులో వున్నాడు.

మన సమాజంలో ఎటువంటి నాయకుడైన లేక గొప్ప వాడైన ప్రజలతో కలసి మెలసి అందుబాటులో ఉండుటకు యిష్టపడడు. ప్రభుత్వ రంగంలోనో, ఉద్యోగ రంగంలోనో, ఆర్థిక పరిస్థితుల్లోనో, లేక ఆధ్యాత్మిక పరిచర్యలలోనో, గొప్పవాడు అనగానే ప్రజలకు అల్లంత దూరాన వుండాలి. అలాంటి గొప్పవారి దగ్గరకు వెళ్ళాలంటే కొంత ప్రయత్నం అవసరము. కొన్ని పర్యాయాలు అసలే వీలుపడదు. కాని యేసు ప్రభువు ఎప్పుడూ ప్రజలతో కలసి మెలసి వుండేవాడు. ఆయనకు గ్రుడ్డివాడని లేదు. కుష్ఠిరోగి అని లేదు. పాపి అని లేదు. పరిశుద్ధుడు అని లేదు. అధికారి అనిలేదు, అధముడని లేదు. పగలని లేదు. రాత్రి అనిలేదు. "ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు నిద్రపోడు". (దా.కీ. 121 : 4) అని వ్రాయబడిన మాటలు ఎంతైనా సత్యం. ఎవరైనా సరే, ఎప్పుడైనా సరే ఆ ప్రభువు

దగ్గరకు వెళ్ళొచ్చు. ఎవరైనా ఆ ప్రభువును సమీపించ వెళ్ళిప్పుడు, "నేను నిద్రించుచున్నాను. నన్ను తొందర చేయకుము. రేపు ఉదయము రమ్ము", అని ఆయన చెప్పునా? "తమ ఆలోచనలను అనుసరించి, చెడు మార్గమున నడుచుకొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను". (యెషయా 65 : 2) అని ఆప్రభువు సెలవిచ్చిన ప్రకారము, ఎంత ఘోరపాపినైనా ప్రేమించి కనికరించి, వాని రక్షణార్థమై, దినమంతయు ఆ కృపామయుడు చేతులు చాపుచున్నాడు. పాపుల రక్షణార్థమై, కొండలు, లోయలు సహితము, నిద్రనక ఆహారమనక ఎండకు గాలికి వర్షములకు ఓర్చి సంచారము చేసినవాడు మన ప్రియ రక్షకుడు.

ఆయన ఏదేను వనములో ఆదినరులైన ఆదాము హవ్వలతో సంచరించిన వాడు. హనోకు అనుదైవ జనునితో నడచినవాడు. మానవుల రక్షణార్థమై, సముద్ర తీరములందు, గ్రామ సీమలయందు, అందరి సమీపములో అందరికి అందుబాటులో సంచారము చేసినవాడు.

ఆయన యెరూషలేము ఆలయమునకు వెళ్ళినవాడు. యొర్దాను నదికి, యోహాను వద్దకు వెళ్ళినవాడు. సమరయ స్త్రీని రక్షించుటకై, యాకోబు బావి యొద్దకు నడచి వెళ్ళినవాడు. పేతురు, యాకోబు, యోహానులను వెంట బెట్టుకొని రూపాంతర కొండపైకి వెళ్ళినవాడు. గెత్సేమనే తోటకు నడచిన వాడు. కల్వరి గిరికి, మన పాప భారమును, శాపమును మోసినవాడు. పునరుత్థానుడైన తరువాత ఎమ్మాయి గ్రామస్తులతో నడచినవాడు. పాపులందరికి ఒకే విధమైన ఆహ్వానము. అందరికి ఒకే రక్షణ.

**4. సంరక్షణ :** వలయము, సంరక్షణను సూచిస్తుంది. యేసు ప్రభువు సంరక్షకుడు.

"ఆయన కరములు స్వర్ణ గోళములవలె నున్నవి" (ప.గీ 5 : 14) అని వ్రాయబడిన ప్రకారము చేతులు గోలాను వలెను, అనగా వలయము వలె గుండ్రముగా ఉన్నవని అర్థము. ఆ చేతులకు గోలాను ఆకారము ఎట్లు కలిగింది? ప్రయాసపడి భారమును మోయుచున్న సమస్తమైన వారలారా నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని ప్రభువు పిలచినపుడు, కల్వరి సిలువకు



మేకులతో కొట్టబడినపుడు, పాపుల వైపు చాపబడినపుడు ఆ చేతులు చక్కగా దండముల వలె ఉన్నాయి. కాని పశ్చాత్తప్తుడైన పాపి ఆయన పిలుపును అంగీకరించి, తన యొద్దకు వచ్చినపుడు, ఆచేతులు వాని కౌగలించి యున్న కారణాన, ఆ చేతులకు గోలాను ఆకారము లేక గుండ్రని వలయాకారము ఏర్పడినదని భావము. "ఆయన ఎడమ చెయ్యి నాతల క్రింద వున్నది. కుడి చేత ఆయన నన్ను కౌగలించుచున్నాడు" (ప.గీ. 2 : 6) అని వ్రాయబడిన ప్రకారము, ప్రియుడైన యేసు ప్రభువు తన వారిని కౌగలించి, ఆయన తానే వారి చుట్టూ అగ్ని ప్రాకారముగాను (జకర్యా 2 : 5) మరియు కంచెగాను (యోబు 1 : 10) ఉంటాడు. తప్పి పోయి తిరిగి వచ్చిన కుమారుని కౌగలించి ముద్దు పెట్టుకున్న తండ్రివలె తన యొద్దకు తిరిగివచ్చు పాపులను తానే కౌగలించి, ముద్దాడి సంరక్షిస్తాడు. ఆయన ప్రేమ కౌగిటిలో వుండు వారు పాపము చేయుటకై తమ చేతులు చాపకుండునట్లును, వెలుపలి భక్తిహీనుల రాజదండము తన ప్రజల మీదికి రాకుండునట్లును యెరూషలేము చుట్టును పర్వతములున్నట్లు (దా.కీ. 125 : 2,3) ఆయన తానే నిత్యము తన ప్రజల చుట్టు వుండునని వాగ్దానము చేశాడు.

యేసు ప్రభువు నిత్యుడు కాబట్టి ఆయన సింహాసనము నిత్యమైనది. ఆ కారణాన, "దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది" (హెబ్రీ 1 : 8) అని వ్రాయబడివుంది. మానవ చరిత్రలో, ఏ రాజేగాని, యే సార్వభౌముడేగాని నిత్యమైన సింహాసనమును కలిగి యుండలేదు. ప్రభువైన యేసు క్రీస్తు ఒక్కడు మాత్రమే నిత్యమైన సింహాసనమును కలిగియున్నాడు. ఆయన రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు. ఆయన రాజ్యము నిత్యమైన రాజ్యము.

యేసు ప్రభువు నిత్యుడు కాబట్టి ఆయన ప్రసాదించు రక్షణ కూడ నిత్యమైనదే. ఆ కారణాన, "ఒక్క అర్పణ చేత ఆయన. పరిశుద్ధ పరచబడు వారిని సదా కాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు" (హెబ్రీ 10 : 14) అనియు మరియు "తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను". (హెబ్రీ 5 : 9) అని వ్రాయబడిన ప్రకారము, ఆయన యందు విశ్వసించిన వారికి ఆ ప్రభువు సంపూర్ణరక్షణను ప్రసాదించు చున్నాడు.

నిత్యుడైన యేసు ప్రభువు యొక్క యాజకత్వము కూడ నిత్యమైనది.

అందువల్ల, "నీవు మెల్కీసెదకు యొక్క క్రమము చొప్పున నిరంతరము యాజకుడవై యున్నావు" (హెబ్రీ 5 : 6) అని వ్రాయబడివుంది. ప్రాచీన నిబంధన యాజకులు మానవ మాత్రులే కాబట్టి వారు కూడ మరణించారు. వారు యాజకత్వము మార్పుతో కూడినదై వుండేదికాని యేసు ప్రభువు మానవుడు కాదు ఆయన నిత్యుడైన దేవుడు కాబట్టి ఆయన యాజకత్వము నిరంతరమైనది.

యేసు ప్రభువు నిత్యుడు కాబట్టి ఆయన ప్రసాదించు ఆశీర్వాదము లన్నియు నిత్యమైనవే. ఒక పాపి పశ్చాత్తప్తుడై విరిగి నలిగిన హృదయముతో యేసు ప్రభువు నందు విశ్వాసముంచి, తన రక్షణార్థమై ఆయనను ఆశ్రయించినపుడు, ఆయన ఆ పాపికి ప్రసాదించు రక్షణ, పరిశుద్ధత (కెదెషు) విశ్రాంతి (షెకెము), సహవాసము (హెబ్రోను) శక్తి (బేసెరు) ఔన్నత్యత (రామోతు) తాత్కాలికములు గాక, శాశ్వితములై ఉన్నాయి.

నరమాత్రులమైన మన నిమిత్తము గోలాను ఆశ్రయపురముగా కాగోరి, అనగా తన నిత్యత్వము లోనికి మనలను ప్రవేశపెట్టగోరి, స్థలమునకు, కాల పరిమితికి బంధితుడు కాజాలని యేసు ప్రభువు తాత్కాలికముగ స్థలమునకు, కాల పరిమితికి బంధితుడయ్యాడు. ఎంత ఆశ్చర్యము !

ప్రియమైన చదువరీ! నీ పాపమును, నీ పాప భారమును, ఇహ పరముల చేత విసర్జింపబడిన నీ ఒంటరి స్థితిని, నీ శక్తి హీనతను, పడిచెడిన నీ అధోగతిని, కాలమునకు, స్థలమునకు బంధితమైన నీ ఆధ్యాత్మిక స్థితి గతిని గ్రహించి, నీ పాప దోషము పగవాని వలె నిన్ను తరిమి పట్టుకొనకమునుపే (సంఖ్యా 32:23) నీ ఆత్మకు శాశ్వత ఆశ్రయపురముగా వున్నట్టి ప్రభువైన యేసు క్రీస్తును విశ్వాసముతో ఆశ్రయించి నిత్యరక్షణను పొందు మని ప్రేమతో మనవి చేస్తున్నాను. ఆ జగద్రక్షకుడే నీకు సహాయము చేయును గాక !

"సకల యుగములలో రాజై యుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు, మహిమయు యుగయుగములు కలుగును గాక" (1 తిమోతి 1 : 17)

ఆమేన్, ఆమేన్, ఆమేన్,

# ఆశ్రయపురములు

గ్రంథకర్త

జి. జాన్

బెంగుళూరు

# THE CITIES OF REFUGE

Author
**Gollapalli John**

Second Print 2007

Published by
**Chicago Bible Fellowship**
**2849, West Granville**
**Chicago, Illinois 60659, USA.**

## తొలిపలుకులు

పరిశుద్ధ బైబిలు గ్రంథమందలి అంశములలో ‘ఆశ్రయపురములు’ అనునది ఒక ప్రాముఖ్యమైన అంశం. ఈ అంశాన్ని గూర్చి వ్రాయుటకు నన్ను బలవంతపెట్టిన ఆ శక్తిసంపన్నునికి నేనెంతయో కృతజ్ఞుడను.

తనను వివరించు ఈ పుస్తకమును ఆ మహోన్నతుడు తానే ఆశీర్వదించి, తద్వారా తానే అనంతముగా మహిమ పరచబడును గాక!

బెంగుళూరు, గొల్లపల్లి జాన్
25-9-1992

## విషయసూచిక


| | పేజీ నెం. |
|---|---|
| ఉపోద్ఘాతము | 1 |
| యెహోషువ 20వ అధ్యాయము | 3 |
| **మొదటి అధ్యాయము** | |
| ఆశ్రయపురముల ప్రాముఖ్యత | 4 |
| నరహంతకుడు | 5 |
| ప్రతి హత్య చేయువాడు | 7 |
| ఆశ్రయపురములు | 13 |
| **రెండవ అధ్యాయము** | |
| కెదెషు | 19 |
| పరిశుద్ధుడైన ప్రభువు | 19 |
| పరిశుద్ధత యొక్క ప్రత్యేకత | 21 |
| పరిశుద్ధ పిలుపు | 22 |
| పాపముగా చేయబడిన పరిశుద్ధుడు | 23 |
| **మూడవ అధ్యాయము** | |
| షెకెము | 25 |
| పాపభారమును మోయు రక్షకుడు | 25 |
| తప్పిపోయిన గొర్రెలను మోయుకాపరి | 26 |
| భారములను భరించు ప్రధాన యాజకుడు | 27 |
| తల్లి వలె ఎత్తికొని ఆదరించువాడు | 28 |
| తండ్రి వలె ఎత్తికొని మోయువాడు | 30 |
| పక్షి రాజు వలె మోయువాడు | 32 |
| అనుదిన భారములను భరించువాడు | 34 |

మనము మోయవలసిన భారములు 35
ప్రభుని కాడి భారము 35
ఇతరుల భారము 37
వ్యక్తిగత భారము 39

## నాల్గవ అధ్యాయము

హెబ్రోను 40
మనము చేయవలసిన సహవాసములు 40
ప్రభువుతో సహవాసము 40
తండ్రితో సహవాసము 47
సంఘముతో సహవాసము 48
సహవిశ్వాసులతో సహవాసము 51
సహవాసములో విశ్వాసి బాధ్యతలు 51
మనము చేయకూడని సహవాసములు 52
దుష్టులతో సహవసించరాదు 52
లోకముతో సహవసించరాదు 53
అవిశ్వాసులతో సహవసించరాదు 58
అన్యస్త్రీలతో సహవసించరాదు 63

## ఐదవ అధ్యాయము

బేసెరు 64
వాక్య శక్తి 66
సిలువ శక్తి 67
పునరుత్థాన శక్తి 69
పరిశుద్ధాత్మ శక్తి 70
ప్రభువును ఎరుగుటలో శక్తి 72
ప్రభువు కొరకు ఎదురు చూచుట వలన కలుగు శక్తి 77
ప్రభువు నందు ఆనందించుటవలన కలుగు శక్తి 81
ప్రభువు రక్తపు శక్తి 84

## ఆరవ అధ్యాయము

రామోతు 91
రామోతు అంతస్థులు 92
విశ్రమించుట 92
కూర్చుండుట 92
ఆనుకొనుట 92
నిలుచుట 93
నడచుట 93
పరుగెత్తుట 94
ఎగురుట 95
రామోతు రహస్యము 96
ఇశ్రాయేలీయులు 96
యోహాను 96
యేసు ప్రేమించిన శిష్యుడు 98
మరియ 99
అపొస్తలుడైన పౌలు 99
రామోతు జీవిత అడ్డుబండలు 101

## ఏడవ అధ్యాయము

గోలాను 103
నిత్యత్వము 103
దేవత్వము 105
అందుబాటు 110
సంరక్షణ 111



## Gollapalli John

M.A., M.S. (USA)

సహోదరుడు గొల్లపల్లి జాన్ గారు (1932 – 2007) యేసు క్రీస్తు ప్రభువును తన స్వంత రక్షకునిగా అంగీకరించి ఆయన పిలుపునకు లోబడి చిన్న తనము నుండే సంపూర్ణ సేవలో కొనసాగిరి. సత్యసంపదలకు గనియైన బైబిల్ గ్రంథములోని గూఢమైన సంగతులను వాక్సరళతకలిగి బహు స్పష్టంగా పరిశుద్ధాత్మ శక్తితో ఇండియాలోనూ, ఇతర దేశములలోనూ చిన్న, పెద్ద, నిపుణులు గుంపులకు భోధించిరి. తన 42 సంవత్సరముల సుదీర్ఘ రేడియో పరిచర్యలో "**దైవోపదేశములు**", "**బైబిల్ సమయం** ", "**ఆరాధన సమయం**" అను రేడియో కార్యక్రమముల ద్వారా మన దేశములోనూ, పొరుగు దేశములలోనూ దేవుని వాక్యమును విస్తారముగ ప్రకటించిరి. వాక్యమును జ్ఞాపకముంచుకొనుటలో వీరికి దేవడనుగ్రహించిన అసాధారణ జ్ఞాపకశక్తిని బట్టి వీరిని " వాకింగ్ బైబిల్ " (Walking Bible) అని పిలిచారు.

దైవకృప వలన వీరికి అనుగ్రహించబడిన వరములకు గుర్తించి, గౌరవించి, సహోదరులు భక్తసింగ్ గారు తన జత పనివారిగా అనేక పరిచర్యలలో ప్రత్యేకంగా పరిశుద్ధ సమాజ కూటములలో వాక్యోపదేశము చేయుటకై వీరిని ఉపయోగించిరి.

**ఆశ్రయ పురములు :** పరిశుద్ధ బైబిలు గ్రంథములో రెండు భాగాలున్నాయి. మొదటి భాగాన్ని ప్రాచీన నిబంధన లేక పాత నిబంధన అని, రెండవ భాగాన్ని నూతన నిబంధన లేక క్రొత్త నిబంధన అని పిలుస్తారు. ప్రాచీన నిబంధనలో ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ఛాయలను మాత్రమే మనము చూడగలము. కాని నూతన నిబంధనలో ఆ ఛాయల నిజ స్వరూపమైన యేసు క్రీస్తు ప్రభువును చూడగలము. యెహోషువ గ్రంథము 20వ అధ్యాయములో వ్రాయబడిన ఆరు ఆశ్రయపురములు:

1. కెదెషు, 2. షెకెము, 3. హెబ్రోను, 4. బేసెరు, 5. రామోతు, 6. గోలాను

అనునవి కూడ యేసు ప్రభుని ఛాయలు మాత్రమే. ఈ ఛాయలను వెంబడించి వాటిని గ్రహించుట ద్వారా, ఆ ప్రియ ప్రభువు ఎంత పరిశుద్ధుడో, ఎంత కరుణా సంపన్నుడో, ఎంత సుందరుడో, ఎంత విజ్ఞాన సంపన్నుడో, ఎంత శక్తిమంతుడో, ఎంత విలువైన వాడో మనము గ్రహించగలము.